


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★



ముట్టడిలో సమానత్వం.. ప్రమాదంలో ప్రజాస్వామ్యం... 108 ఏళ్ల నవంబర్ విప్లవం : కొత్త వ్యూహాల ఆవశ్యకత **06**


పార్థ్ పవార్ భూ ఒప్పందంపై కుంభకోణంపై దర్యాప్తుకు ఆదేశం **05**



సంపుటి 08, సంచిక: 336 | శుక్రవారం | 07-11-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00


# నిర్లక్ష్యం వహించొద్దు

● జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలి ● ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి ● ప్రచారానికి సోషల్ మీడియానూ ఉపయోగించుకోవాలి ● కాంగ్రెస్ శ్రేణులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం



ప్రజాపక్ష/హైదరాబాద్

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా లేకుండా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులకు సూచించారు. జూబ్లీహిల్స్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో గురువారం జరిగిన సమీక్ష సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు అందుబాటులో ఉన్న మంత్రులు పాల్గొన్నారు. ఇప్పటికే మంత్రులు, సీనియర్ నాయకులు, ఎంఎల్‌ఎలు గడప గడపకూ తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. సిఎం రేవంత్ రెడ్డి కూడా ఇప్పటికే నాలుగు తరువాయి 2లో



# బిహార్ తొలి దశలో 64 శాతం

అక్కడక్కడా హింసాత్మక ఘటనల మధ్య పోలింగ్

ఉపముఖ్యమంత్రి సిన్హా కారుపై చెప్పులతో దాడి

రాష్ట్రంలో మార్పు తీసుకురండి తేజస్వీయాదవ్, రబ్రీదేవి పిలుపు

**పాట్నా:** బిహార్ అసెంబ్లీకి తొలి దశ ఎన్నికల్లో 18 జిల్లాలలో ఉన్న 121 నియోజకవర్గాలలో 3.75 కోట్లమంది ఓటర్లు ఓటుహక్కు ఉపయోగించుకున్నారు. గురువారం సాయంత్రం ఐదు గంటల వరకూ 64.46 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ ప్రక్రియ సందర్భంగా అక్కడక్కడ హింసాత్మక సంఘటనలు చెలరేగాయి. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా కారుపై చెప్పులు, రాళ్ళతో దాడి జరిగింది. బురఖా ధరించి ఓటు వేయడానికి వచ్చిన మహిళలను భద్రతా సిబ్బంది తనిఖీలు చేశారు. ఇలా తనిఖీలు చేయడాన్ని కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ సమర్థించారు. ఈ తనిఖీలవల్ల ఓట్ చోరీని అడ్డుకోవడానికి వీలు కలుగుతుందన్నారు. ''మనం పాకిస్థాన్‌లో బతకడంలేదు, ఇదిమతపరమైన వివక్ష కాదు, బిహార్‌లో తేజస్వి యాదవ్ ప్రభుత్వంగానీ, షరియా చట్టం గానీ అమలులో లేదు'' అంటూ ఎగతాళి విమర్శలు చేశారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయడం ద్వారా మార్పు తీసుకురావాలని యువతీ యువకులకు ప్రతిపక్ష 'ఇండియా' కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వి యాదవ్, ఆయన తల్లి,మాజీ ముఖ్యమంత్రి రబ్రీదేవి పిలుపు ఇచ్చారు. తొలిదశలో బెగుసరాయ్ నియోజకవర్గంలో అత్యధికంగా 67.32 శాతం తరువాయి 2లో

### బిహార్‌లో వామపక్షాలు

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్షాలు మహాగట్బంధన్‌లో భాగస్వాములుగా మొత్తం 30 సీట్లలో పోటీ చేస్తున్నాయి. సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ 20, సిపిఐ 6, సిపిఐ(ఎం) 4, సీట్లలో పోటీలో ఉన్నాయి. కాగా సిపిఐ మరో మూడు సీట్లలో వేరె కాంగ్రెస్‌తో 'స్నేహపూర్వక' పోటీలో ఉంది. ఆర్‌ఎస్‌పి, ఫార్వర్డ్‌బ్లాక్‌లకు ప్రతిపక్ష కూటమిలో స్థానం లభించలేదు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఐ (ఎంఎల్) ఎల్ 19 సీట్లలో పోటీచేసి 12 గెలుపొందింది. అయితే భోజ్‌పురి జిల్లాలోని తరారీ సీటులో గెలిచిన అభ్యర్థి సుధామ ప్రసాద్ గత లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసి ఎన్నికైనారు. అయితే తరారీ సీటు ఉప ఎన్నికలో ఎం.ఎల్. అభ్యర్థి ఓటమి పొందారు. అందువల్ల ఎం.ఎల్. సభ్యులు 11 సీట్లతో అసెంబ్లీలో ఉన్నారు. సిపిఐ, సిపిఐ(ఎం)లకు చెరో ఇద్దరు సభ్యులున్నారు. గత ఎన్నికల్లో వామపక్షాల ఓటు వాటా – సిపిఐ (ఎంఎల్) ఎల్ 3.16శాతం, సిపిఐ 0.83, సిపిఐ (ఎం) 0.65 – వెరసి మొత్తం పోటీ చేస్తున్నారు

# ఇప్పుడైనా ఎరువులివ్వండి

● డిసెంబర్‌లోపు 70శాతం సరఫరా చేస్తే ఇబ్బందులు లేకుండా రైతులకు పంపిణీ
● రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రానికి విజ్ఞప్తి
● గత సీజన్‌లో కేటాయింపుల మేరకు ఇవ్వలేదని వ్యాఖ్య
● యాసంగి సీజన్ ఎరువుల సరఫరాపై అధికారులతో సమీక్ష



ప్రజాపక్షం/హైదరబాద్

గత సీజన్‌లో కేటాయించిన ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఎరువులను సరఫరా చేయలేదని, ప్రస్తుత సీజన్‌లోనైనా డిసెంబర్‌లోపు 70 శాతం ఎరువులను సరఫరా చేస్తే ఎటువంటి ఇబ్బందులు లేకుండా రైతులకు పంపిణీ చేయవచ్చని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. యాసంగి సీజన్‌కు సంబంధించిన ఎరువుల సరఫరాలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి మాట్లాడుతూ యాసంగి సీజన్ కోసం 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా, 1.45 లక్షల మెట్రిక్ టన్నుల డిఎపి, 7 లక్షల మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 0.65 లక్షల మెట్రిక్ టన్నులు ఎమ్‌ఓపి, 0.60 లక్షల మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పి ఎరువులను రాష్ట్రానికి కేటాయించారని వివరించారు. తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాలో 6 లక్షల మెట్రిక్ టన్నులను అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలలో నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల తరువాయి 2లో



# వామపక్ష ఐక్యతతోనే పేదలకు న్యాయం

● కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తున్న మోదీని సాగనంపాలి
● ఓట్ చోరీ ఆరోపణలను ఎన్నికల సంఘం పట్టించుకోదా?
● సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి నిలదీత
● పేదల హక్కుల కోసం నక్సలైట్లు వామపక్షాలతో కలిసి రావాలి : తక్కలపల్లి

ప్రజాపక్షం / హుస్నాబాద్

భారత దేశంలో కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ దేశ సంపదను అదాని, అంబాని లాంటి ధనవంతులకు దోచి పెడుతున్న ప్రధాని నరేంద్ర మోదీని సాగనంపాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పిలుపు నిచ్చారు. గురువారం అయన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ అనభేరి సింగిరెడ్డి అమరుల భవనంలో తెలంగాణ రాష్ట్ర సిపిఐ సహాయ కార్యదర్శి శ్రీనివాస్‌రావుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమవేశంలో చాడ వెంకటరెడ్డి మాట్లాడారు. దేశంలో కార్మికులకు, కర్శకులకు, పేదలకు న్యాయం జరగాలంటే వామపక్షాల ఐఖ్యత ఎంతో అవసరమని అందుకు వామపక్ష భావజాలాలు ఉన్న ప్రతీ ఒక్కరూ కలిసి రావాలని చాడ పిలుపునిచ్చారు. నేడు ప్రపచంలోనే అగ్రరాజ్యమైన అమెరికాలోని న్యూయార్క్ రాష్ట్రంలో డెమోక్రాటిక్ అభ్యర్థి మమ్దానీ మేయర్‌గా ఎన్నిక అయ్యారంటే వామపక్షాల అవసరం పేదలకు ఎంత అవసరం ఉంటే గెలిపించారని, నేడు మన దేశంలో ప్రతీ ఒక్క భారతీయుడూ అలోచించాలని కోరారు. దేశంలో హర్యానా, కేరళ రాష్ట్రంలో ఓట్లు చోరీ జరిగిందని అనేక అరోపణలు వస్తున్నా ఎన్నికల సంఘం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. నేడు బిహార్ రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల్లో కూడా ఓట్ల చోరీ కొనసాగుతుందని అనుమానం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఐదేళ్లకు జరగాల్సిన లోకల్ బాడీ ఎన్నికలు బిసి రిజర్వేషన్లు బిల్లు పేరుతో తరువాయి 2లో

# బిహార్‌లోనూ బిజెపి ఓట్ల చోరీకి యత్నం

అడ్డుకునే బాధ్యత యువతదే : రాహుల్‌గాంధీ పిలుపు




**పూర్ణియ/మోతీహరి/సీతామరి :** ఓట్ల దొంగతనంపై లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ బిజెపిపై మరోసారి విమర్శలు చేశారు. ఓట్లు దొంగిలించడం ద్వారా ప్రతిచోటా ఎన్నికలలో గెలుస్తోందని ఆరోపించారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బిజెపి తన శక్తినంతా ఉపయోగించి ఓట్లను దొంగిలించడానికి ప్రయత్నిస్తుందని, దానికి వ్యతిరేకంగా వ్యవహరించడం యువత బాధ్యత రాహుల్‌గాంధీ పిలుపునిచ్చారు. బిహార్‌లో గురువారం తొలి విడద పోలింగ్ జరిగింది. ఈ నేపథ్యంలో రాహుల్ ఓట్ల దొంగతనం వ్యాఖ్యల ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. గురువారం పూర్ణియాలో జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో రాహుల్ మాట్లాడుతూ బిజెపి, ఎన్నికల కమిషన్ హర్యానా ఎన్నికలను దొంగిలించాయని తాము మొత్తం ప్రపంచానికి చూపించామన్నారు. వారు బీహార్‌లో కూడా ఓట్లను దొంగిలించడానికి ప్రయత్నిస్తారని కచ్చితంగా చెప్పగలనన్నారు. దీనిని ఆపడం, రాజ్యాంగాన్ని కాపాడటం బిహార్ యువత బాధ్యత అని, అందరూ పోలింగ్ బూత్‌ల వద్ద జాగ్రత్తగా ఉండాలి అని మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ యువత నిరుద్యోగులుగా మిగిలిపోయే బిలియనీర్ల పాలన కోరుకుంటున్నారని కూడా గాంధీ ఆరోపించారు. అరారియాలో జరిగిన మరో ర్యాలీలో మాట్లాడుతూ మోదీ, హోంమంత్రి అమిత్ షా దేశంలో 'జంగిల్ రాజ్' విధించారని ఆరోపించారు. నితీష్ కుమార్ బీహార్‌లో తరువాయి 12లో



# ప్రకృతి రక్షణలో మాటలొద్దు..కార్యాచరణే...

● లులా డసిల్వా పిలుపు
● లాంఛనంగా కాప్–30 ప్రారంభం

**బెలెం :** 'మాటలు కట్టిపెడదాం, ఇక కార్యాచరణ ప్రారంభించాల్సిందే, అందుకు సమయం వచ్చేసింది, ఇక ఆలస్యం కూడదు..భూగోళాన్ని ప్రకృతి వైపరీత్యాల నుండి కాపాడుకోవడానికి ఆచరణాత్మక చర్యల్లోకి దిగాల్సిందే'అని బ్రెజిల్ దేశాధ్యక్షుడు లూయిస్ ఇనాసియో లులా డసిల్వా పిలుపు ఇచ్చారు. గొప్ప అడవులకు, ప్రకృతికి పెట్టింది పేరుగా ఉండే బ్రెజిల్ దేశం అమెజాన్‌లోని బెలెంలో కాప్–30 (ఐక్యరాజ్యసమితి వాతావరణ మార్పుల సదస్సు)కు ముందుగా లులా డసిల్వా ప్రపంచవ్యాప్తంగా మాధ్యమాల ద్వారా చైతన్యస్ఫూర్తి రగిలించారు. నవంబరు 10 నుండి 21వ తేదీ వరకూ బెలెంలో కాప్–30 సమావేశాలు జరుగుతాయి. దీనికి ముందుగా గురు–శుక్రవారాలలో ప్రపంచదేశాల అధికార ప్రతినిధులు సమావేశమై సదస్సులోని ముఖ్యాంశాలను, ఎజెండాను, ప్రాధాన్యతలను, చర్చనీయాంశాలను నిర్ధారిస్తారు. ఇప్పటివరకూ బొగ్గు, చమురు, గ్యాస్ వంటి సంప్రదాయ ఇంధన వనరులు ఉపయోగించుకుని పారిశ్రామికంగా బాగా ఎదిగిన ధనికదేశాలు అభివృద్ధి చెందుతున్న, వెనుకబడిన దేశాలకు సహాయం చెయ్యాలని, వాతావరణాన్ని, ప్రకృతి విలయాలను అడ్డుకునేందుకు అన్ని దేశాలు తగిన చర్యలు తీసుకోవడంతోపాటు ధనిక దేశాలు తమ వంతుగా తృతీయ ప్రపంచ దేశాలకు 1.3 ట్రిలియన్ డాలర్లు నిధులు సమకూర్చి వాతావరణ రక్షణలో తమవంతు బాధ్యతలు నిర్వహించాలని లులా డసిల్వా పిలుపు ఇచ్చారు. కీలకమైన సందర్భాలు వచ్చినప్పుడు యావత్ ప్రపంచం, మానవాళి ఏకమై ఒకేమాట మీద నిలబడి మానవ మనుగడను కాపాడుకోవడానికి కృషి చేస్తుందని కరోనా మహమ్మారి ప్రమాదం రుజువు చేసిందని, ఇక ప్రకృతి వైపరీత్యాలు రాకుండా వాతావరణాన్ని కాపాడుకోవడానికి అదే పద్ధతిలో అన్ని దేశాలు ఏకం కావాలని, ప్రతి దేశం తన జాతీయ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని ఆచరించాలని లులా డసిల్వా కోరారు. ఈ దిశగా బ్రెజిల్ దేశం తన వంతు కృషి చేస్తోందని చెప్పారు. బ్రెజిల్‌లో 88 శాతం విద్యుత్ వనరులు పునర్వినియోగ ఇంధన వనరుల ద్వారా లభిస్తోందని, జీవ ఇంధనానికి, పవన విద్యుత్ తరువాయి 2లో

# 14న విచారణకు హాజరుకండి

రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీకి 'ఇడి' తాజా సమన్లు జారీ



**న్యూఢిల్లీ :** బ్యాంకు మోసం, మనీలాండరింగ్ కేసులో వచ్చే వారం విచారణకు హాజరు కావాలని రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తాజాగా సమన్లు జారీ చేసిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. 66ఏళ్ల వ్యాపారవేత్త అనిల్ అంబానీని ఆగస్టులో ఫెడరల్ దర్యాప్తు సంస్థ దాదాపు 10గంటల పాటు ప్రశ్నించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ)లో రూ.2,929 కోట్ల రుణమోసం కేసులో రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఆర్‌సిఒఎం) పై నమోదైన మనీ లాండరింగ్ కేసులో నవంబరు 14న ఆయన విచారణ హాజరు కావాలని కోరినట్లు వారు తరువాయి 12లో

# లెంకలగడ్డలో సుడిగాలి విధ్వంసం

● రెండు కిలోమీటర్ల మేర నేలమట్టమైన వృక్షాలు
● దాదాపు వంద ఎకరాల్లో తుడిచిపెట్టుకుపోయిన మిరప, పత్తి, వరి ● పంటలను పరిశీలించిన కలెక్టర్ రాహుల్ శర్మ

ప్రజాపక్షం/భూపాలపల్లి



జయశంకర్ జిల్లా పలిమెల మండలం లెంకలగడ్డ గ్రామంలో సుడిగాలి వాన విధ్వసం సృష్టించింది. దాదాపు 10 నిమిషాల సుడిగాలి బీభత్సంతో అడవిలో చెట్లతో పాటు 30 ఎకరాల్లో పత్తి, 10 ఎకరాల్లో మిరప 5 ఎకరాల్లో పంటలు తుడుచు పెట్టుకుపోయాయి. అక్కడే పంట పొలాల్లో పనులు చేస్తున్న రైతులు పరుగులు తీయడం తో ప్రాణ నష్టం జరగలేదు. పంటపొలాల్లో ఉన్న నీళ్ల డ్రమ్ములు గాల్లో ఎగిరిపోగా ఎద్దుల బండి మూడు పల్టీలు కొట్టినట్లు స్థానిక రైతులు చెబుతున్నారు. గత ఏడాది ములుగు జిల్లా తడ్వాయి, మేడారం అడవుల్లో జరిగిన సంఘటనే మళ్ళీ ఇక్కడ పునరావృతం అయిందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

**నష్టం అంచనా వేయండి : కలెక్టర్**

భారీ సుడిగాలికి ధ్వంసం అయిన పంటలను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ గురువారం తరువాయి 2లో

# ఎరుపెక్కిన జెఎన్‌యు

● విద్యార్థి సంఘం ఎన్నికల్లో లెఫ్ట్ క్లీన్‌స్వీప్ ● నాలుగు కీలక స్థానాలు కైవసం



**న్యూఢిల్లీ:** జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం ఎరుపెక్కింది. విద్యార్థి సంఘం (జెఎన్‌యుఎస్‌యు) ఎన్నికలలో వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య సంఘటన నాలుగు కీన్ స్థానాలను కైవసం చేసుకున్నది. వామపక్ష అభ్యర్థుల గెలుపుతో వర్సిటీ ఆవరణ అరుణ శోభను సంతరించుకున్నది. ఎబివిపి పూర్తిస్థాయిలో చిత్తు అయింది. జెఎన్‌యు విద్యార్థి సంఘం అధ్యక్షురాలిగా అదితీ మిశ్రా, ఉపాధ్యక్షురాలిగా కె.గోపికా బాబు, ప్రధాన కార్యదర్శిగా సునీల్ యాదవ్, సంయుక్త కార్యదర్శిగా దానిష్ అలీ ఎన్నికయ్యారు. ఈ నిర్ణయాత్మక విజయంతో జెఎన్‌యు విద్యార్థి రాజకీయాల్లో వామపక్షాల బలం మరోమారు రుజువైంది. ఈసారి ఎన్నికల్లో ఎన్‌ఎస్‌యూఐ, బిఎపిఎస్‌ఎతో పాటు స్వతంత్ర సంఘాలు పోటీ పడ్డాయి. ప్రచారం కూడా పెద్ద ఎత్తున సాగింది. ఓటింగ్‌కు అర్హులైన విద్యార్థుల సంఖ్య మొత్తం 9,043 కాగా 67 శాతం పోలింగ్ నమోదైంది. ఓట్ల లెక్కింపు ముగియడంతో గురువారం ఫలితాలు ప్రకటించారు. వామపక్ష అభ్యర్థుల గెలుపుతో జెఎన్‌యూలో విద్యాపరమైన స్వేచ్ఛ, తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## సిగరెట్, డ్రగ్ యూజర్లకు బంగ్లాదేశ్‌లో టీచరు ఉద్యోగాల్లేవు

**ఢాకా:** ధూమపానం, మాదక ద్రవ్యాలు ఉపయోగించేవారిని ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశం లేకుండా బంగ్లాదేశ్ నిషేధం అమలు చేయడం ప్రారంభించింది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఉద్యోగాలు చేసేందుకు దరఖాస్తు చేసుకోవాలంటే ఈ అలవాట్లు ఉండకూడదు. ఈ అలవాట్లు ఉన్నవారు ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడానికి అనర్హులని ప్రభుత్వం ప్రకటించింది. బంగ్లాదేశ్ ప్రైమరీ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజ్‌షాహి, రంగపూర్, సిల్హెట్, ఖుల్నా, బరిషాల్, మైమెన్‌సింగ్ డివిజన్లలో 10,219 కొత్త టీచరు ఉద్యోగాలను భర్తీ చేసేందుకు విద్యాశాఖ నోటీసు జారీ చేసింది. ఇందులో నిబంధనల ప్రకారం దూమపానం, మాదకద్రవ్యాలు సేవించేవారికి దరఖాస్తు చేసుకునే అర్హత లేదు. 21–32 మధ్య వయసుగల అర్హులైన వారు నవంబరు 21వ తేదీ వరకూ దరఖాస్తులు చేసుకోవచ్చు.

## మమ్మల్ని గౌరవిస్తేనే మమ్దానీకి విజయం

### డోనాల్డ్ ట్రంప్ హెచ్చరిక

**వాషింగ్టన్/న్యూయార్క్:** న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికైన జోహ్రాన్ మమ్దానీకి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరిక చేశారు. మమ్మల్ని గౌరవిస్తేనే మీకు ప్రజాస్వామ్య సోషలిస్టు విజయం చేకూరుతుందని అన్నారు. మమ్దానీకి సహాయం చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని, ఐతే ఆయన ప్రజాస్వామ్య సోషలిజం విజయం సాధించాలంటే తమకు గౌరవం ఇవ్వాలని అన్నారు. మమ్దానీ గెలిచిన తర్వాత సందేశం ఇస్తూ, ఈ విజయం నవశకానికి నాంది పలుకుతుందన్నారు. ట్రంప్‌కు నేరుగా హెచ్చరిక చేశారు. మిమ్మల్ని మీరు సరిదిద్దుకోవాలన్నారు. ఈ విజయం ట్రంప్ ఓటమికి ప్రారంభ సూచనగా ఆయన పేర్కొన్నారు. ట్రంప్‌ను ఎదిరించి నిలబడతానని మమ్దానీ చేసిన ప్రకటనపై ట్రంప్ పైవిధంగా స్పందిస్తూ, తమకు గౌరవం ఇవ్వాలనీ, ఆయన చేసిన ప్రకటన ప్రమాదకరమైనదనీ అన్నారు "అతడు కొంచెం తమ పట్ల గౌరవంగా ఉండాలి, ఎందుకంటే అతనంటూ లేకపోతే అసలు అతడు విజయం సాధించే అవకాశమే లేదు" అని ఫాక్స్‌న్యూస్ ప్రతినిధి బ్రెట్ బేయర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. "అతడిని విజయవంతం చేయాలని నేను కోరుకుంటున్నాను, అని మళ్ళీ తన మాటలను సరిదిద్దుకుంటూ, న్యూయార్క్ నగరం విజయవంతం కావాలని నేను కోరుకుంటున్నాను" అన్నారు.



**గాజాలో యుద్ధం కాదు, సామూహిక హత్యాకాండ : మమ్దానీ స్పందన**

న్యూయార్క్ తొలి ముస్లిం మేయర్, మొదటి దక్షిణాసియా వాసి, సోషలిస్టు జోహ్రాన్ మమ్దానీ ఇజ్రాయెల్ చేస్తున్న ఘోర అకృత్యాలపై తీవ్రంగా స్పందించారు. గాజాలో జరుగుతున్నది యుద్ధం కాదు, అది సామూహిక హత్యాకాండ, సామూహిక ఊచకోత అని వ్యాఖ్యానించారు. దీంతో ఇజ్రాయెల్ ప్రభుత్వం ఆయనపై ఎదురుదాడికి దిగింది. మమ్దానీ హమాస్ ఉగ్రవాదుల పక్షం వహించారని ఇజ్రాయెల్ మంత్రి ఒకరు విమర్శించారు.

మమ్దానీ మొదటి నుండీ మానవతావాదాన్నే సమర్థిస్తూ వచ్చారు. గాజాలో ఇజ్రాయెల్ దురాగతాలను గతంలో కూడా ఆయన తీవ్రస్థాయిలో దునుమాడారు. మేయర్ పదవి ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత బ్రూక్లిన్‌లో ఆయన అభిమానులకు సందేశం ఇచ్చారు. 2023 అక్టోబరు ఏడో తేదీన హమాస్ ఇజ్రాయెల్‌పై దారుణంగా చేసిన దాడిని మమ్దానీ "వార్ క్రైమ్"గా అభివర్ణించారు. కానీ ఆ తర్వాత ట్రంప్ సహాయంతో నెతన్యాహూ గాజాలో అమానవీయంగా ఊచకోతలకు పాల్పడ్డారని విమర్శించారు. ఇజ్రాయెల్‌కు ఒక దేశంగా మనుగడ సాగించే హక్కు ఉంది, కానీ అదే సమయంలో పొరుగు దేశాలకు కూడా వారితో సమానమైన హక్కులు ఉంటాయని చర్చల సందర్భంగా అనేక సార్లు ఆయన చెప్పారు.

## పాక్–అఫ్ఘానిస్థాన్ మధ్య మళ్ళీ చర్చలు
## ఈసారి విఫలమైతే యుద్ధమే:ఆసిఫ్

**ఇస్తాంబుల్:** పాకిస్థాన్ – అఫ్ఘానిస్థాన్ మధ్య సరిహద్దు ఉగ్రవాదం, సరిహద్దుల ఉల్లంఘన సమస్యలపై మూడో విడత చర్చలు టర్కీ (తుర్కియే) రాజధాని ఇస్తాంబుల్‌లో గురువారం తిరిగి ప్రారంభమయ్యాయి. ఇంతకుముందు రెండు విడతలుగా దోహా, ఇస్తాంబుల్ నగరాల్లో జరిగిన చర్చలు ఎలాంటి ఒప్పందం లేకుండానే విఫలమయ్యా యి. ఈ చర్చలకు టర్కీ, ఖతార్ దేశాలు మధ్యవర్తిత్వం చేస్తున్నాయి. ఈసారి చర్చలకు పాకిస్థాన్ తరపున మిలిటరీ ఇంటిలిజెన్స్ విభాగాధిపతి ఆసిమ్ మాలిక్ ప్రతినిధి బృందానికి నాయకత్వం వహిస్తున్నారు. అఫ్గానిస్థాన్ తరపున ఆ దేశ ఇంటిలిజెన్స్ విభాగాధిపతి అబ్దుల్ హక్ వాసిక్ ప్రతినిధి బృందానికి నాయకత్వం వహిస్తున్నారు. గతనెల 11వ తేదీన రెండు దేశాల సరిహద్దుల్లో సైన్యాలమధ్య తీవ్ర ఘర్షణలు చెలరేగాయి. ఈ ఘర్షణల్లో 206 మంది అఫ్గాన్ తాలిబన్లు, 110 మంది తెహ్రీక్ ఎ తాలిబన్ పాకిస్థానీ ఉగ్రవాదులు మరణించారు. మరో 23 మంది పాకిస్థానీ సైనికులు మరణించారు. గతనెల 15వ తేదీన రెండు దేశాలు కాల్పుల విరమణకు ఒప్పుకున్నాయి.



గతంలో జరిగిన చర్చల్లో పాకిస్థాన్ ప్రతినిధులు అలవికాని మాటలు, మొరటు మాటలు మాట్లాడారని, చర్చలపట్ల గౌరవం లేకుండా అమర్యాదకరంగా ప్రవర్తించారని అఫ్గానిస్థాన్ ప్రతినిధులు విమర్శించారు. ఐతే ఈ చర్చలు ప్రారంభం కాకముందుగానే పాకిస్థాన్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ ఒక హెచ్చరిక చేస్తూ ఈసారి చర్చలు విఫలమైతే అఫ్గానిస్థాన్‌తో యుద్ధం తప్పదని హెచ్చరిక చేసింది. పాకిస్థాన్ అనుసరిస్తున్న వైఖరిని అఫ్గాన్ ప్రభుత్వ వర్గాలు కూడా తీవ్రంగా ఖండించాయి. తమ సరిహద్దులను తాము కాపాడుకుంటామని, తమ సరిహద్దులను ఉల్లంఘించి తమ గగనతలంలోకి ప్రవేశిస్తే పాకిస్థాన్‌ను సహించేదిలేదని అఫ్గానిస్థాన్ ప్రతినిధులు ఇప్పటికే రెండు విడతలుగా జరిగిన చర్చల్లో స్పష్టం చేశారు. టిటిపి ఉగ్రవాదులను అరికట్టాల్సిన బాధ్యత అఫ్గానిస్థాన్ తాలిబన్ ప్రభుత్వానిదేనని పాకిస్థాన్ వాదిస్తుండగా, ఉగ్రవాదులతో తమకు ఎలాంటి సంబంధం లేదని, వారిని అదుపు చేసుకోవాల్సిన బాధ్యత పాకిస్థాన్ సైన్యం, భద్రతా బలగాలదేనని అఫ్గానిస్థాన్ ప్రతినిధులు వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో మూడో విడత చర్చలు మొదలయ్యాయి.

## అమెరికాలో షట్‌డౌన్ ఎఫెక్ట్
## నేటి నుండి 10 శాతం విమానాల రద్దు

**వాషింగ్టన్:** అమెరికా చరిత్రలో ఎన్నడూలేనివిధంగా 37 రోజులుగా కొనసాగుతున్న అసాధారణమైన ఎకనామిక్ షట్‌డౌన్ మెల్లిగా మరింత ప్రభావం చూపిస్తోంది. దీనివల్ల విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగనున్నది. శుక్రవారం నుండి 10 శాతం విమానాలను నిలిపివేస్తామని అమెరికా రవాణావిభాగం కార్యదర్శి సీన్ డఫ్ఫీ చెప్పారు. ఫెడరల్ ఫండింగ్ బడ్జెట్‌కు అమెరికా కాంగ్రెస్ ఆమోదం ఇవ్వకపోవడంతో ఈ పరిస్థితి వచ్చింది. విమాన రంగానికి సంబంధించి దాదాపు 14 లక్షలమంది ఫెడరల్ వర్కర్లు, ట్రాఫిక్ కంట్రోలర్లు వేతనాలులేకుండా పనిచేయాలి. లేదా బలవంతంగా వేతనం లేకుండా సెలవుమీద వెళ్ళాలి.



నిధుల కొరత కారణంగా విమానాల్లో ఈ కోత విధించనున్నారు. షట్‌డౌన్ వల్ల కేవలం అత్యవసర సేవలు మాత్రమే దేశంలో పనిచేస్తున్నాయి. మిగిలిన విభాగాలన్నింటిలో పనిచేస్తున్న ఉద్యోగులు అందరూ వేతనం లేకుండా సెలవులపై ఇళ్ళకు వెళ్ళి కూర్చున్నారు. కాంగ్రెస్‌లో బిల్లు ఆమోదం పొందిన తర్వాత మాత్రమే ఉద్యోగులకు వేతనాలు ఇస్తారు. అప్పటివరకూ ఎన్నిరోజులు షట్‌డౌన్ అమలులో ఉంటే అన్ని రోజులకూ ఉద్యోగులకు వేతనాలు ఇవ్వరు. ఐతే విమానాశ్రయాలలో పనిచేసే సిబ్బంది సంఖ్య కూడా తక్కువగా ఉండటంతో వారిపై ఒత్తిడి తగ్గించేందుకు బాగా రద్దీగా ఉన్న 40 విమానాశ్రయాల నుండి రాకపోకలు చేసే పదీ శాతం విమానాల్లో కోత పెడుతున్నారు. బహుశా 1800 ల విమానాలు గాల్లోకి ఎగరకుండా ఆగిపోతాయి.

## పేదలకు న్యాయం
(మొదటి పేజీ తరువాయి)

వాయిదా వేస్తుందని అరోపించారు. సుప్రీం కోర్టు లోకల్ బాడీ ఎన్నికలు జరపమని చెప్పినప్పటికిని ప్రభుత్వం ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. తెలంగాణలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుకు అన్ని పార్టీల సమన్వయంతో కలిసి ప్రధాని మోదీతో బిల్లును అమోదం తెచ్చుకోవాలని సూచించారు. ఇజిఎస్ నిధుల కొటాకు కోత పెట్టి జిఎస్ టిని స్వల్పంగా తగించి దేశం కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నట్లు గొప్పలు చెబుతున్న మోదీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపు నిచ్చారు. జూబ్లిహిల్స్ ఎన్నికలల్లో కాంగ్రెస్ అభ్యర్థికి సిపిఐ మద్దతు ఇస్తుందని అన్నారు.

**పేదల హక్కుల కోసం నక్సలైట్లు వామపక్షాలతో కలిసి రావాలి : తక్కళ్లపల్లి**

దేశంలోని పేదల హక్కులను కాపాడుకునేందుకు అవినీతి నిర్మూలను కోసం ప్రజా సమస్యల సాధన కోసం నక్సలైట్లు అడవి బాట విడిచి వామపక్షలతో కలిసి ప్రజామస్యల కోసం పోరాటం చేసేందుకు కలిసి రావాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయకార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. సిపిఐ వంద ఏళ్లు పూర్తి చేసున్న సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మం జిల్లా కేంద్రంలో జాతీయ స్థాయిలో జరుగుసభకు ప్రపంచవ్యాప్తంగా 40 దేశాల ఎర్ర జెండ పార్టీల నాయకులు తరలి వస్తున్నారని తెలిపారు. ఈ సభలో నక్సలైట్లతో పాటు అన్ని వామపక్ష పార్టీలు దేశంలోని అవినీతి అంతం చేసేందుకు ఖమ్మం వేదికగా తగు నిర్ణయాలను తీసుకోనున్నదని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమానికి హాజరు కావాలని పిలుపు నిచ్చారు.

ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కళవేని శంకర్, కనకుట్ల శంకర్, అదరి శ్రీనివాస్, గూడ పద్మ, జిల్లా సహయ కార్యదర్శి గడిపె మల్లెశ్, హన్మకొండ జిల్లా సహయ కార్యదర్శి కర్రె బిక్షపతి, హుస్నాబాద్ నియోజకవర్గ ఇంచార్జి జాగీరు సత్యానారయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఇంజన్ వైఫల్యంవల్లే కార్గో విమానం పేలుడు

### 14కు పెరిగిన మృతులసంఖ్య


**కెంటుకీ:** అమెరికా కెంటుకీ విమానాశ్రయం నుండి హవాయ్‌కి బయలుదేరిన యుపిఎస్ కార్గో (సరుకు రవాణా) పేలిపోవడానికి ప్రధాన కారణం ఇంజన్ వైఫల్యమే అని వెల్లడైంది. 34 ఏళ్ళ క్రితం సర్వీసులు ప్రారంభించిన ఈ ఎండి 11–ఎఫ్ కార్గో విమానలో మూడు ఇంజన్లు ఉంటాయి. అత్యంత ఘోరమైన ఈ ప్రమాదంలో ముగ్గురు విమాన సిబ్బందితోపాటు మృతులసంఖ్య 14కు పెరిగింది. సహాయ బృందాలు గాలించి బ్లాక్‌బాక్సును వెలికితీసి అందులోని సమాచారాన్ని విశ్లేషించినపుడు ఇంజన్ వైఫల్యంవల్లే ప్రమాదం జరిగిన విషయం బయటపడింది. బుధవారం ఉదయం 10.30 గంటలకు ఈ ఘటన జరిగింది. హవాయ్ వరకూ దాదాపు 6,420 కి.మీ ఈ విమానం ప్రయాణించి వెళ్ళాల్సి ఉంది. ధ్వంసమైన విమాన భాగాలు కింద ఒక చమురు శుద్ధికేంద్రంమీద, ఒక ఆటో విడిభాగా వ్యాపార కేంద్రంపైన పడటంతో ప్రమాదం తీవ్రత భారీ ఎత్తున విస్తరించి మంటలు



భయానకంగా విస్తరించాయి. ఈ ప్రమాదంవల్ల 16 వేరు వేరు కుటుంబాలకు చెందిన వ్యక్తులు గల్లంతయ్యారు. విమానంలో భారీ పరమాణంలో ఇంధనం ఉన్నందువల్ల కూడా మంటలు భారీగా పైకి ఎగసిపడ్డాయి. కార్గో విమానం కూలిపోయినప్పుడు విమానంలో 38,000 గ్యాలన్స్ (1.44 లక్షల లీటర్లు) ఇంధనం ఉంది. ఈ ప్రమాదం షిప్పింగ్ వ్యాపారంపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. విమానంలో ఎలాంటి ప్రమాదకరమైన సరుకులను రవాణా చేయడం లేదని ఈ సందర్భంగా కెంటుకీ గవర్నర్ ఆండీ బేషియర్ ఒక ప్రకటన చేశారు. ఘటన జరిగిన వెంటనే ఎన్‌టిబిఎస్ బృందం ప్రమాద ఘటన ప్రదేశానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించింది. లూయిస్ విల్లే ముహమ్మద్ అలీ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి విమానం బయలుదేరిన వెంటనే ఈ ఘటన జరిగింది. ప్రమాదప్రాంతంలో ఆకాశం అంతటా నల్లని పొగలు కమ్ముకున్నాయి.

## కొత్త శిఖరం అధిరోహించిన నేపాల్–ద.కొరియా పర్వతారోహకులు

**కఠ్మండు:** నేపాల్–దక్షిణ కొరియాలకు చెందిన పర్వతారోహకులు ఇప్పటివరకూ ఎవ్వరూ అధిరోహించని కొత్త శిఖరాన్ని కేవలం పది గంటల వ్యవధిలో అధిరోహించి రికార్డు సృష్టించారు. శిఖరాగ్రానికి చేరుకుని తమ తమ జాతీయ జెండాలను ఎగురవేశారు. నామ్‌డో గ్రామానికి సమీపంలో ఉన్న చువామా–3 శిఖరాన్ని పర్వతారోహకులు అధిరోహించారు. 2025 జెజు అంతర్జాతీయ పర్వతారోహణ యాత్ర' బృందం ఈనెల రెండో తేదీ తెల్లారురుఝామున రెండు గంటలకు బేస్ క్యాంప్ నుండి బయలుదేరి 10 గంటలు ప్రయాణం చేసి 6,268 మీటర్ల ఎత్తులో ఉన్న శిఖరాగ్రానికి చేరుకుందని నేపాల్ ట్రెక్కింగ్ క్యాంప్ మేనేజింగ్ డైరెక్టర్ వోంగ్చు షెర్పా చెప్పారు. నేపాల్‌కు చెందిన ఇద్దరు పర్వతారోహకులు దావా ఫుర్టెన్ భోటే, మింగ్మార్ షెర్పా, దక్షిణ కొరియాకు చెందిన ముగ్గురు పర్వతారోహకులు కిమ్ డోంగ్జిన్, కిమ్ హ్యోన్ చుల్, ఓ నామ్యోంగ్ ఈ ఉమ్మడి బృందంలో ఉన్నారు.



## సుడిగాలి విధ్వంసం
(మొదటి పేజీ తరువాయి)

అధికారులతో కలిసి పరిశీలించారు. పలిమెల మండలం లెంకల గడ్డ శివారు అటవీ ప్రాంత పంట పొలాలలో మంగళవారం బారి సుడిగాలి ప్రభావానికి పంటలు, అడవిలో చెట్లు కూలిపోగా సుమారు 30 నుండి 40 ఎకరాలలో పత్తి, మిర్చి, వరి పంటలు ధ్వంసం అయ్యాయని తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన వన శాఖ అధికారులు ప్రాథమికంగా పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికలు అందించాలి అని అధికారులను ఆదేశించారు. అధికారులు అందించిన నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామని రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం వాహనం వెళ్ళడానికి అవకాశం లేకపోగా మోటార్ సైకిల్ పై అటవీ శాఖ అధికారులతో కలిసి వెళ్లి నేలకొరిగిన వృక్షాలను పరిశీలించారు. అటవి ప్రాంతంలో విరిగిన చెట్లను లెక్కించి నివేదిక అందించాలని సూచించారు. చెట్లు నేలకొరిగిన చోట నూతన ప్లాంటేషన్ చేపట్టి అడవుల పునరుద్ధరణ కు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి సునీల్, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, తహసీల్దార్ సునీల్, ఎంపిడిఓ సాయి పవన్ ఇతర శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎరుపెక్కిన జెఎన్‌యు
(మొదటి పేజీ తరువాయి)

లింగ సమానత్వం, క్యాంపస్‌లో ప్రజాస్వామికబద్ధ చర్చలకు విద్యార్థుల ఆదరణ సుస్పష్టమైంది.

**అధ్యక్షురాలిగా అదితీ మిశ్రా**

అదితీ మిశ్రా జేఎన్‌యూఎస్‌యూ అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. 1,861 ఓట్లు సాధించారు. ఆమె సమీప ప్రత్యర్థి ఏబీవీపీ అభ్యర్థి వికాశ్ పటేల్‌కు 1,447 ఓట్లు రాగా 414 ఓట్ల తేడాతో అదితీ మిశ్రా విజేతగా నిలిచారు.

**ఉపాధ్యక్షురాలిగా కె.గోపికా బాబు**

కె.గోపికా మొత్తం 2,966 ఓట్లు పొందారు. ఉపాధ్యక్ష స్థానాన్ని కైవసం చేసుకున్నారు. గోపికతో పోటీ పడ్డ ఏబీవీపీ అభ్యర్థి తాన్య కుమారికి 1,730 ఓట్లు పోలయ్యాయి. అంటే 1,236 ఓట్లతో గోపిక ఘన విజయం సాధించారు.

**ప్రధాన కార్యదర్శిగా సునీల్ యాదవ్**

ప్రధాన కార్యదర్శి పదవి కోసం పోటీ హోరాహోరీగా సాగింది. వామపక్ష అభ్యర్థి సునీల్ యాదవ్ 1,951 ఓట్లు పొందగా, ఏబీవీపీ అభ్యర్థి రాజేశ్వర్‌కు 1,841 ఓట్లు వచ్చాయి. అంటే 110 ఓట్లతో సునీల్ గెలుపొందారు.

సంయుక్త కార్యదర్శిగా దానిష్ అలీ

సంయుక్త కార్యదర్శిగా వామపక్ష అభ్యర్థి దానీష్ అలీ ఎన్నికయ్యారు. ఆమెకు మొత్తం 1,991 ఓట్లు రాగా సమీప ప్రత్యర్థి, ఏబీవీపీ అభ్యర్థి అనుజ్ దమారాకు 1,762 ఓట్లు వచ్చాయి. అంటే 229 ఓట్లతో దానిష్ అలీ గెలుపొందారు.

## నిర్లక్ష్యం వహించొద్దు
(మొదటి పేజీ తరువాయి)

రోజుల పాటు నియోజక వర్గంలోని పలు డివిజన్లలో రోడ్ షోలు నిర్వహించడంతోపాటు కార్నర్ సమావేశాలు నిర్వహించారు. పోలింగ్ తేదీ దగ్గర పడుతుండడంతో క్షేత్ర స్థాయి పరిస్థితులు, సర్వే నివేదికలు, పార్టీ నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాలు, ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలు, వ్యూహ, ప్రతి వ్యూహాలు తదితర అంశాలపై సిఎం సమీక్ష చేసి పార్టీ నేతలకు పలు సూచనలు చేశారు. మొత్తం మంత్రులందరికి బాధ్యతలు అప్పగించిన సిఎం రేవంత్ రెడ్డి, ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీపై ప్రజలు విశ్వాసం కోల్పోయారని, అందువల్ల కాంగ్రెస్ పార్టీ గెలుపు తథ్యమని ఆయన అంచనా వేశారు. అయినప్పటికీ ఏలాంటి నిర్లక్ష్యం లేకుండా ప్రచారం నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. పోలింగ్ తేదీ దగ్గర పడుతుండటంతో వ్యక్తిగతంగా ఓటర్లను కలవడం, రోడ్ షోలతో పాటు సోషల్ మీడియాను కూడా ప్రభావవంతంగా ఉపయోగించుకోవాలని ఆయన పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు.

**ఉప ఎన్నికను ఆషామాషీగా తీసుకోవద్దు**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ఆషామాషీగా తీసుకోవద్దని మంత్రులకు సిఎం రేవంత్ రెడ్డి మరోమారు స్పష్టం చేశారు. ఈ ఎన్నిక ఫలితంతో తనతోపాటు మంత్రులందరి భవిష్యత్తు ముడిపడి ఉందని వ్యాఖ్యానించినట్టు తెలిసింది. ఉప ఎన్నిక ఫలితం సానుకూలంగా వస్తుందనే ధీమాతో ఉండొద్దని, మంత్రులు ఈ ఎన్నికను చాలా సీరియస్‌గా తీసుకోవాలని ఆదేశించినట్టు సమాచారం. జూబ్లీహిల్స్ ఎన్నిక జరుగుతున్న తీరును అధిష్ఠానం కూలంకషంగా పరిశీలిస్తోందని, డివిజన్ల వారీగా బాధ్యతలు తీసుకున్న మంత్రులు, ఎంఎల్ఏలు, కార్పొరేషన్ల చైర్మన్ల పనితీరు గురించి ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటోందని చెప్పారు. ఈ ఉపఎన్నిక ఫలితం ప్రభావం కేవలం జూబ్లీహిల్స్ వరకే పరిమితం కాదని, రాష్ట్ర వ్యాప్తంగా ఉంటుందని ఆయన మంత్రులను అప్రమత్తం చేసినట్లు తెలిసింది. అందువల్ల 'దూ ఆర్ డై' తరహాలో ఈ ఎన్నికను తీసుకోవాలి. మీ సొంత ఎన్నికలా తీసుకుని పనిచేయండి. మంచి మెజార్టీతో ఈ ఉప ఎన్నికలో గెలవాలి' అని ఆయన దిశానిర్దేశం చేశారు.

**ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పికొట్టాలి**

ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పికొట్టడంతో పాటు సోషల్ మీడియా ప్రచారంలో మంత్రులు మరింత చురుకుగా పని చేయాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించినట్లు తెలిసింది. బిఆర్ఎస్ పదేళ్లలో చేసిన విధ్వంసాన్ని అధిగమిస్తూ రాష్ట్ర ప్రజలకు అవసరమైన అన్ని కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని, హైదరాబాద్ నగరంలో గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నామని, ఈ విషయాలను జూబ్లీహిల్స్ ఓటర్లకు వివరంగా చెప్పాలని మంత్రులకు సిఎం సూచించారు. బిఆర్ఎస్, బిజెపి విమర్శలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని, సోషల్‌మీడియాలో బిఆర్ఎస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు ఎప్పటికప్పుడు పార్టీ సోషల్ మీడియా వారియర్లను అప్రమత్తం చేయాలని సిఎం ఆదేశించారు.

## ఇప్పుడైనా ఎరువులివ్వండి
(మొదటి పేజీ తరువాయి)

చొప్పున సరఫరా చేయాలని ఇదివరకే కోరినట్టు వివరించారు. రాష్ట్రానికి రావాల్సిన ఎరువులను ముందుగానే తెప్పించే ఏర్పాట్లు చేస్తున్నట్టు గోపి మంత్రి తుమ్మల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ రాష్ట్రానికి కేటాయించిన ఎరువులలో 70 శాతం వరకు ముందస్తుగా తెప్పించుకుంటే, ఆ తర్వాత నిరంతరం వచ్చే ఎరువులతో కలిపి రైతులకు అవసరమైన మేరకు సరఫరా చేయవచ్చని, గత యాసంగి, అంతకుముందు వానాకాలంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ చేసినట్టుగానే యాసంగిలో కూడా చేయవచ్చని అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కోరినట్టు కేంద్రం ప్రభుత్వం నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించిందని, కానీ గత నెలలో ఇంకా 37 వేల మెట్రిక్ టన్నుల యూరియా, ఓడరేవుల నుండి రాష్ట్రానికి చేరుకోవాల్సి ఉందని వివరించారు. ప్రస్తుత నెలలో ఇప్పటికే 25 వేల మెట్రిక్ టన్నులు రాష్ట్రానికి చేరుకున్నదని, మొత్తంగా అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు 1.88 లక్షల మెట్రిక్ టన్నులు యూరియా సరఫరా అయిందన్నారు.

వరంగల్ రేక్ పాయింట్ వద్ద గూడ్స్‌ను మూసి, దానిని చింతలపల్లి పాయింట్ కు మార్చాలని రైల్వే శాఖ నిర్ణయించిందని, తద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఎరువుల సరఫరాలో ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని మంత్రి తుమ్మల ఆందోళన వ్యక్తం చేశారు. ఎరువుల సరఫరాలో తలెత్తే సమస్యను దృష్టిలో పెట్టుకుని 4 నుండి 5 నెలల పాటు వరంగల్ రేక్ పాయింట్‌ను కొనసాగించాలని తుమ్మల కేంద్ర రైల్వే మంత్రిని కోరారు. రాష్ట్రంలో యూరియా వినియోగం డిసెంబర్ మూడో వారం నుండి ఉంటుందని,ఆ సమయంలో మక్క జొన్న, వరి పంటలతో గరిష్ట స్థాయికి చేరుకుంటుందని, ఈ సమయంలో ఎరువుల కొరత రాకుండా ఉండేందుకు కేంద్రం వెంటనే 0.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించడంతో పాటు, సిఐఎల్ ద్వారా త్వరితగతిన రవాణ చేయాలని కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రిని తుమ్మల కోరారు.

## మాటలొద్దు.. కార్యాచరణే
(మొదటి పేజీ తరువాయి)

ఉత్పత్తికి, గ్రీన్ హైడ్రోజన్ ఎనర్జీకి బ్రెజిల్ పెద్ద పీట వేసిందని, తాము కార్యాచరణ చేస్తున్నామని చెప్పారు. ప్రతిసారీ వాతావరణ సదస్సులలో అనేక వాగ్దానాలు చేస్తున్నాం, వాటిని నెరవేర్చలేకపోతున్నాం, ఇక అలా వీలుకాదు, మాటలు చాలించి కార్యాచరణలోకి దిగాల్సిందే...అని లులా డసిల్వా అన్నారు.

ప్రపంచశాంతిని కాపాడాల్సి ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఈనాడు విఫలమైందని, యుద్ధాలను నివారించలేకపోయిందని బహుముఖ ప్రపంచ వ్యవస్థ కష్టాల్లో పడిందని అన్నారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో ప్రతిసారీ ఈ అంశాలను చర్చించేవిధంగా ముడిపెట్టి ఒక వాతావరణ మార్పుల మండలి (క్లైమేట్ ఛేంజ్ కౌన్సిల్)ను ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని ఆయన ప్రతిపాదించారు.

ప్రపంచవ్యాప్తంగా 200 కోట్లమంది ప్రజలకు క్లీన్ టెక్నాలజీ అందుబాటులో లేదని, అదేవిధంగా మరో 673 మిలియన్ల ప్రజలు (67.30 కోట్లు) మంది ప్రజలు ఆకలితో ఛస్తూ బతుకుతున్నారన్నారు.

## తొలిదశలో 64 శాతం
(మొదటి పేజీ తరువాయి)

పోలింగ్ నమోదుకాగా, సమస్థిపూర్‌లో 66.65 శాతం, మాధేపురలో 65.74 శాతం పోలింగ్ నమోదైనట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కాగా ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, ఇండియా కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వి యాదవ్, కేంద్రమంత్రులు గిరిరాజ్ సింగ్, రాజీవ్ రంజన్ సింగ్ 'లలన్' సహా పలువురు ప్రముఖులు తొలిదశ పోలింగ్ పరిధిలో ఉన్న తమ తమ నియోజకవర్గాలలో వేరు వేరు చోట్ల ఓటుహక్కు ఉపయోగించుకున్నారు. నితీశ్ కుమార్ తన సొంత ఊరు భక్తియార్‌పూర్‌లో ఓటు వేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు. "ఓటు కేవలం ఒక హక్కు మాత్రమే కాదు, ప్రజాస్వామ్యంలో పౌరుల ప్రధాన విధి" అని వ్యాఖ్యానం కూడా పెట్టారు. ఇక తేజస్వి యాదవ్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యులందరూ పాట్నాలోని వెటర్నరీ కాలేజీలో ఉన్న బూత్‌లో ఓటు హక్కు ఉపయోగించుకున్నారు. "ఒక కొత్త ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడం ద్వారా రాష్ట్రంలో గొప్ప మార్పు తీసుకురావాలని యువతీ యువకులను కోరుతున్నా" అంటూ తేజస్వి యాదవ్ సోషల్ మీడియాలో పోస్టింగ్ పెట్టారు. తేజస్వి యాదవ్ తల్లి, బిహార్ మాజీ ముఖ్యమంత్రి రబ్రీదేవి కూడా సోషల్ మీడియా ద్వారా ప్రజలకు ఒక విజ్ఞప్తి చేస్తూ, ఓటు హక్కు ఉపయోగించి రాష్ట్రంలో మార్పు తీసుకురావాలని పేర్కొన్నారు. ఇక ప్రజలతో దాడికి గురైన ఉపముఖ్యమంత్రి సిన్హా తారాపూర్‌లో ఓటు హక్కు ఉపయోగించుకున్నారు. నితీశ్ ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి వస్తుందని, తాము ప్రభుత్వంలో కొనసాగుతామని అన్నారు. రాష్ట్రంలో పరివర్తన తీసుకురావడానికి మేం ఎంతో కృషి చేశామని, ఆ కృషి, అభివృద్ధిని ఈనాడు మనం చూస్తున్నామన్నారు.

అధికార ఎన్‌డిఎ కూటమి, ప్రతిపక్ష 'ఇండియా' కూటమి ఎవరికివారే తొలి దశ పోలింగ్ ప్రక్రియలో తమదే పైచేయి అనీ, తామే గెలుస్తామంటూ ధీమా వ్యక్తం చేశాయి. 'ఇండియా' కూటమి తరపున ముఖ్యమంత్రి అభ్యర్థి, ఆర్‌జెడి నాయకుడు తేజస్వి యాదవ్, ప్రస్తుత ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌధురి, విజయ్ కుమార్ సిన్హా, ఇంకా అనేకమంది మంత్రులు తొలిదశ పరిధిలో ఉన్న 121 నియోజకవర్గాలలో ఓటర్ల పరీక్షను ఎదుర్కొన్నారు. మధ్యమధ్యలో కొద్దిపాటి విరామం మినహా గడచిన 20 సంవత్సరాలుగా ఎన్‌డిఎ కూటమి బిహార్‌లో అధికారంలో కొనసాగుతున్నది. సుశాసన్ (సుపరిపాలన) అనే ఇమేజ్‌ను నిలబెట్టుకునేందుకు ప్రయత్నం చేస్తోంది. రాష్ట్రంలో అంతకుముందు ఆర్‌జెడి–కాంగ్రెస్ ఉమ్మడిగా పదిహేనేళ్ళు రాష్ట్రంలో జంగిల్ రాజ్ చేశాయని ఎన్‌డిఎ కూటమి విమర్శిస్తున్నది.

కాగా లఖిసరాయ్ నియోజకవర్గం నుండి పోటీలో ఉన్న ఉపముఖ్యమంత్రి సిన్హా కారుపై చెప్పులు, రాళ్ళు, పేడతో ప్రజలు దాడి చేశారు. ఆయన కారు ముందుకు వెళ్ళకుండా అడ్డుకున్నారు. ముర్దాబాద్ సిన్హా అంటూ నినాదాలు చేశారు. లాలూ ప్రసాద్ యాదవ్‌కు చెందిన గూండాలే తన కారుపై దాడి చేశారని సిన్హా ఆరోపించారు. తాము మరోసారి రాష్ట్రంలో అధికారంలోకి వవస్తామని, అప్పుడు ఈ గూండాలకు "బుల్ డోజర్ ట్రీట్‌మెంట్" ఇస్తామని ఆయన అన్నారు. పోలీసులు చూస్తూ కూర్చున్నారంటూ వారిపై విమర్శలు చేశారు. లాలూప్రసాద్ యాదవ్ గూండాలు నియోజకవర్గంలో అలజడి సృష్టిస్తున్నారని, వారు పోలింగ్ అధికారులను కూడా బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఆయన లఖిసరాయ్ నియోజకవర్గం నుండి వరుసగా నాలుగోసారి పోటీ చేస్తున్నారు.

**కొత్త ప్రభుత్వం నా కొడుకుదే : లాలూ ధీమా**

తన చిన్న కుమారుడు తేజస్వి యాదవ్ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేస్తాడని మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్ పెట్టారు. ఒక కొత్త బిహార్‌ను నిర్మించాలంటే తేజస్వి యాదవ్ ప్రభుత్వాన్ని అనివార్యంగా ఏర్పాటు చేయాల్సిందేనని ఆయన అన్నారు. తేజస్వి యాదవ్ తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారని ఆయన ఘంటాపథంగా చెప్పారు. మరోవైపు ఆర్‌జెడి ఎక్స్‌వేదికగా పోస్టింగ్ పెడుతూ ఉద్దేశపూర్వకంగానే రాష్ట్రంలో పోలింగ్ ప్రక్రియ మెల్లిగా నడుస్తోందని విమర్శించింది.

**డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని ప్రజలు ఓడిస్తారు : రోహిణీ ఆచార్య**

బిహార్ ప్రజలు రాష్ట్రంలో ఈసారి డబుల్ ఇంజన్ ప్రభుత్వాన్ని ఓడిస్తారని ఇండియా కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వి యాదవ్ సోదరి రోహిణీ ఆచార్య విశ్వాసం వ్యక్తం చేశారు. "ఈసారి రాష్ట్ర ప్రజలు తేజస్వి యాదవ్‌నే ముఖ్యమంత్రిగా ఎంచుకుంటారు, ఆయన ఉద్యోగాలు ఇస్తారు, మన రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులైన సోదరులందరికీ ఉద్యోగాలు వస్తాయి, దీంతో వాళ్ళంతా ఇతర రాష్ట్రాలకు వెళ్ళి ఎక్కడెక్కడో తిరిగి చాకిరీలు చేసుకోవాల్సిన అవసరం లేదు, రాష్ట్రంలోనే ఉద్యోగాలు సంపాదించుకునా ఉపశమనం పొందవచ్చు" అని రోహిణీ ఆచార్య అన్నారు. "బిహార్‌లో ప్రతి ఒక్క ఓటరూ ముఖ్యమైనవారే, ప్రతి ఒక్క ఓటూ ముఖ్యమైనదే" అని లాలూ ప్రసాద్ పెద్ద కుమారుడు, జనశక్తి జనతా దళ్ అధ్యక్షుడు తేజ్ ప్రతాప్ అన్నారు. ఆయన పాట్నాలోని వెటర్నరీ కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు ఉపయోగించుకున్న తర్వాత మీడియాతో మాట్లాడారు. ఈసారి పరిస్థితులన్నీ నాకు చాలా సానుకూలంగా ఉన్నాయన్నారు. తన గెలుపు తథ్యమన్నారు. ప్రపంచంలో ఏదీ సులభంగాలభించదని అన్నారు. ఈ విషయం దృష్టిలో ఉంచుకుంటే కష్టపడటం పెద్ద కష్టమేమీ కాదు, ఆదేమీ భారంగా అనిపించదన్నారు. నేను ప్రతిదాన్నీ నిర్మించాలని కోరుకుంటాను, కేవలం రామాలయాన్ని మాత్రమే కాదు, ప్రజలకు కావాల్సిన అన్ని అవసరాలను ఏర్పాటు చేయాలని కోరుకుంటానన్నారు.

ఇక కేంద్ర హోంశాఖ సహాయమంత్రి, బిజెపి ఎంపి నిత్యానంద్ రాయ్ కూడాబీహార్ ప్రజలకు ఒక విజ్ఞప్తి చేస్తూ ప్రతి ఒక్కరూ ఓటు వేసి ఎన్‌డిఎకు అధికారం ఇవ్వాలన్నారు. బిహార్ మంత్రి అశోక్ చౌధురి పాట్నాలో ఓటు వేశాక మాట్లాడుతూ, కులమతాలకు అతీతంగా ప్రజలు అభివృద్ధికి ఓటు వేశారన్నారు. కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్ కూడా ఒక విజ్ఞప్తి చేస్తూ బిహార్‌ను వేగంగాఅభివృద్ధి చేయడానికి వీలుగా ఎన్‌డిఎను గెలిపించాలన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## 8,9న హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి కవులు, కళాకారుల శిక్షణ తరగతులు

ప్రజాపక్షం/హైదరాబాద్: సిపిఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా అరసం, తెలంగాణ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కవులు, కళాకారుల శిక్షణ తరగతులను ఈనెల 8,9 తేదీలలో హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యాలయం సత్యనారాయణరెడ్డి భవన్‌లో నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ తెలిపారు. శిక్షణ తరగతుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్ హాజరవుతారని ఒక ప్రకటనలో తెలిపారు. సిపిఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా సమాజంలో మనిషి ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కార మార్గాలు, రైతులు, కూలీలు, ఉద్యోగులు, నిరుద్యోగులు, సంఘటిత, అసంఘటిత కార్మికుల హక్కులు, సబండ వర్గాల బాధలను పాటల ద్వారా, నాటికలు, వివిధ కళారూపాల ద్వారా తెలంగాణ ప్రజానాట్యమండలి ప్రజలను చైతన్యం చేసేందుకు వందేళ్ల సంబరాలు ఖమ్మంలో జరుగుతున్నాయని వివరించారు.

## సిఎంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?

బిఆర్‌ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్



ప్రజాపక్షం/హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగాలు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించే విధంగా ఉన్నాయని బిఆర్‌ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ ఆరోపించారు. కోడ్‌ను ఉల్లంఘించిన సిఎంపైన ఎన్నికల కమిషన్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎంఎల్‌ఎ శశిధర్ రెడ్డి, భరత్ కుమార్‌తో కలిసి వినోద్ కుమార్ మాట్లాడుతూ దూరదృష్టశావత్తు కేంద్ర ఎన్నికల సంఘం కూడా పక్షపాత వైఖరితో పని చేస్తోందన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేయకపోతే పథకాలు బంద్ అవుతాయని సిఎం అనడం కోడ్ ఉల్లంఘన కాదా అని ప్రశ్నించారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న సిఇఒ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపైన ఫిర్యాదు చేసినప్పటికీ ఎందుకు స్పందించడం లేదని బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. ఇప్పటికైనా ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా పని చేయాలని కోరారు.

**ముస్లింలపై జరుగుతున్న దాడులపై చర్యలు తీసుకోండి: బిఆర్‌ఎస్**
ముస్లింలపై జరుగుతున్న దాడులపై చర్యలు తీసుకోవాలని బిఆర్‌ఎస్ శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ ఎంఎల్‌ఎలు జీవన్ రెడ్డి, షకీల్ తదితరులు హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డికి గురువారం ఫిర్యాదు చేశారు. ముస్లింలపై సిఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## 8న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం ఈ నెల 8వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని రాజ్ బహదూర్ గౌర్ హాల్‌లో జరుగుతుందని సంఘం అధ్యక్షులు కలకొండ కాంతయ్య తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, బికెఎంయు జాతీయ కార్యవర్గ సభ్యులు టి.వెంకట్ రాములు హాజరుకానున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలియజేశారు.


ఫారం-సి
నోటిఫికేషన్
(చట్టంలోని సెక్షన్-11 కింద 10A మినహాయింపు ఇవ్వబడింది)
(రూల్ 6/12 చూడండి)
తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (LA) విభాగం

గెజిట్ నెంబర్: GHMC-47 తేది: 25.10.2025
No. C/665/2025. తేది: 25.10.2025

తెలంగాణ ప్రభుత్వం / స్పెషల్ కలెక్టర్ (LA) & కమిషనర్, GHMCకి ప్రజా ప్రయోజనం కోసం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కూకట్‌పల్లి గ్రామం & మండలంలో మొత్తం **7572.99 చదరపు గజాల** భూమి అవి H-CITI కింద EPC మోడ్ కింద కూకట్‌పల్లి 'Y' జంక్షన్ వద్ద NH-65 యొక్క LHSపై (అమీర్‌పేట్ వైపు) మూడు లేన్ల నిర్మాణం మరియు NH-65 యొక్క RHS పై (మియాపూర్ వైపు )మూడు లేన్ల నిర్మాణం అవసరం కనిపిస్తోంది.

అందువల్ల కూకట్‌పల్లి గ్రామం & మండలం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో పైన పేర్కొన్న ప్రాజెక్ట్ కోసం **7572.99 చదరపు గజాల**కు ఎక్కువ లేదా తక్కువ ప్రామాణిక కొలత వివరాల వివరణ ఈ క్రింది విధంగా ఉన్నది, అక్విజీషన్ కోసం ప్రతిపాదించబడింది.

| క్ర. సం. | సర్వే నెం. | టైటిల్ రకం | భూమి రకం | విస్తీర్ణం చ.గ.లలో | ఆసక్తిగల వ్యక్తి పేరు & చిరునామా | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు | | నిర్మాణములు రకం | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| కూకట్‌పల్లి సర్కిల్-24 | | | | | | | | | | | | | |
| 1 | - | - | - | 1733.75 | కాశి అన్నపూర్ణ & ఇతరులు 5-5-34/2 | | | | | - | - | - | - |
| 2 | - | - | - | 97.22 | శ్రీకాంత్ 419(పి) | | | | | - | - | - | - |
| 3 | - | - | - | 33.52 | యజమాని / ఆక్రమణదారు 5-5-32-2/1 | | | | | - | - | - | - |
| 4 | - | - | - | 321.18 | మసీదు - | | | | | - | - | - | - |
| 5 | - | - | - | 158.75 | Md. కుతాబుద్దీన్ ఖోస్రో 5-5-32/1/A | | | | | - | - | - | - |
| 6 | - | - | - | 169.16 | R.V.S.రఖిలా ప్రసాద్ 5-5-34 | | | | | - | - | - | - |
| 7 | - | - | - | 15.25 | R.V.S.రఖిలా ప్రసాద్ 5-5-33 | | | | | - | - | - | - |
| 8 | - | - | - | 48.16 | ఎన్.జె.లలిత 5-5-32 | | | | | - | - | - | - |
| 9 | - | - | - | 32.79 | ఎన్.జె.లలిత 5-5-31 | | | | | - | - | - | - |
| 10 | - | - | - | 122.66 | రేఖాంశం-అక్షాంశం 17.478058, 78.420825 ఓపెన్ ప్లాట్ (సర్వేనం: 121, 122, 123, 124, 139 & 665, 666 & 667) | | | | | - | - | - | - |
| 11 | - | - | - | 41.08 | రేఖాంశం-అక్షాంశం 17.478231, 78.420432 ఓపెన్ ప్లాట్ (సర్వేనం: 121, 122, 123, 124, 139 & 665, 666 & 667) | | | | | - | - | - | - |
| 12 | - | - | - | 468.41 | రేఖాంశం-అక్షాంశం 17.478743, 78.419886 ఓపెన్ ప్లాట్ (సర్వేనం: 121, 122, 123, 124, 139 & 665, 666 & 667) | | | | | - | - | - | - |
| 13 | - | - | - | 173 | రేఖాంశం-అక్షాంశం 17.4795017, 78.4191051 ఓపెన్ ప్లాట్ (సర్వేనం: 121, 122, 123, 124, 139 & 665, 666 & 667) | | | | | - | - | - | - |
| 14 | - | - | - | 54.88 | రేఖాంశం-అక్షాంశం 17.479554, 78.418684 ఓపెన్ ప్లాట్ (సర్వేనం: 121, 122, 123, 124, 139 & 665, 666 & 667) | | | | | - | - | - | - |
| 15 | - | - | - | 167.59 | రేఖాంశం-అక్షాంశం 17.479921, 78.418296 ఓపెన్ ప్లాట్ (సర్వేనం: 121, 122, 123, 124, 139 & 665, 666 & 667) | స్కెచ్ ప్రకారం | | | | - | - | - | - |
| 16 | - | - | - | 290.27 | భూపతి రాజు రవిశంకర్ రాజు 5-7-54, 5-7-71/1 & 5-7-71 | | | | | - | - | - | - |
| 17 | - | - | - | 104.27 | రాజేష్ 5-7-68/సి | | | | | - | - | - | - |
| 18 | - | - | - | 104.19 | రమా రాణి 5-7-68/బి | | | | | - | - | - | - |
| 19 | - | - | - | 122.5 | నగేష్ కాంతారావు 5-7-68/ఎ | | | | | - | - | - | - |
| 20 | - | - | - | 165.37 | రత్నమాల 5-7-68/NR | | | | | - | - | - | - |
| 21 | - | - | - | 257.45 | పద్మాదేవి, మూర్తి 5-7-65 | | | | | - | - | - | - |
| 22 | - | - | - | 70.78 | అప్పారావు 5-7-63 | | | | | - | - | - | - |
| 23 | - | - | - | 58.25 | సంగమేశ్వర్, జి. వీర రాఘవ 5-6-1/3/NR | | | | | - | - | - | - |
| 24 | - | - | - | 74.12 | వి వసంత 5-6-1 | | | | | - | - | - | - |
| 25 | - | - | - | 324.07 | విజయ్ కుమార్, పవన్ కుమార్ 5-6-1/1 | | | | | - | - | - | - |
| 26 | - | - | - | 1198.46 | గ్రేవ్ యార్డ్ - | | | | | - | - | - | - |
| 27 | - | - | - | 58.68 | రాజమణి 5-6-11 | | | | | - | - | - | - |
| 28 | - | - | - | 421.54 | సురేందర్ రావు 5-5-30 | | | | | - | - | - | - |
| 29 | - | - | - | 211.82 | అనంత రెడ్డి 5-5-25 | | | | | - | - | - | - |
| 30 | - | - | - | 16.14 | శ్రీనివాస్ 5-1-65 | | | | | - | - | - | - |
| 31 | - | - | - | 37.81 | కృష్ణా రెడ్డి 5-1-64/5/2 | | | | | - | - | - | - |
| 32 | - | - | - | 33.05 | దామోదర్ 5-1-64/7 | | | | | - | - | - | - |
| 33 | - | - | - | 29 | వీరా రెడ్డి 5-1-64/5 | | | | | - | - | - | - |
| 34 | - | - | - | 124.28 | గోకుల్ ఎన్‌క్లేవ్ 5-1-64/4 | | | | | - | - | - | - |
| 35 | - | - | - | 233.54 | పి. శ్రీనివాస్ రావు & ఇతరులు 5-1-64/3/A & 5-1-5-64/3/B | | | | | - | - | - | - |
| మొత్తం | | | | 7572.99 | | | | | | | | | |

ఈ నోటిఫికేషన్ భూసేకరణ పునరావాసం, పునరావాసంలో న్యాయమైన పరిహారం, పారదర్శకత హక్కుచట్టం 2013 (కేంద్ర చట్టం నెం. 30/2013)లోని సెక్షన్- 11 (1)లోని నిబంధనల ప్రకారం చేయబడింది. ఇది సంబంధించిన వారందరి కోసం భూసేకరణ, పునరావాసం, పునరావాసంలో న్యాయమైన పరిహారం పారదర్శకత హక్కు (తెలంగాణ సవరణ) చట్టం, 2016 (2017 చట్టం నెం. 21) ద్వారా సవరించబడింది.

భూమి యొక్క ప్లాన్‌ను స్పెషల్ కలెక్టర్ (LA) &కమిషనర్, GHMC, హైదరాబాద్ కార్యాలయంలో తనిఖీ చేయవచ్చు. తెలంగాణ ప్రభుత్వం / స్పెషల్ కలెక్టర్ (LA) & కమిషనర్ GHMC, హైదరాబాద్-కమ్-ఆథరైజ్ ఆఫీసర్ అనగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, భూసేకరణ, GHMC, హైదరాబాద్ మరియు అతని సిబ్బంది ల్యాండ్‌లోకి ప్రవేశించి సర్వే చేయడం, ఏదైనా భూమిని చదును చేయడం, భూగర్భంలో తవ్వడం లేదా బోర్ వేయడం పరిశీలించి, ఆ చట్టంలోని నిర్దిష్ట సెక్షన్ -12 అందించిన మరియు పేర్కొన్న విధంగా వారి పనిని సరిగ్గా అమలుచేయడానికి అవసరమైన అన్ని ఇతర చర్యలను చేస్తారు.

ఈ చట్టంలోని సెక్షన్ 11 (4) ప్రకారం, హైదరాబాద్‌లోని స్పెషల్ కలెక్టర్ (LA) & కమిషనర్ GHMC నుండి ముందస్తు అనుమతి లేకుండా ఏ వ్యక్తి కూడా అటువంటి నోటిఫికేషన్ ప్రచురించబడిన తేదీ నుండి అటువంటి భూమిపై ఎటువంటి లావాదేవీలు చేయకూడదు లేదా ఏదైనా లావాదేవీకి కారణం కాకూడదు. అంటే అమ్మకం / కొనుగోలు మొదలైనవి చేయకూడదు. లేదా అటువంటి భూమిపై ఏదైనా భారాన్ని సృష్టించకూడదు.

ఈ భూసేకరణ కోసం ఏవైనా అభ్యంతరాలు ఉంటే, పరిహారం చర్చల ద్వారా పరిష్కారం కోసం ఆసక్తిఉన్న /ప్రభావితమైన వారందరి నుండి వచ్చే క్లెయిమ్‌లను చట్టంలోని సెక్షన్ 15 కింద అందించిన విధంగా ఈ నోటిఫికేషన్ ప్రచురించబడిన తేదీ నుండి 60 (అరవై) రోజుల లోపు ప్రత్యేక కలెక్టర్ (LA) & కమిషనర్, GHMC, హైదరాబాద్ / అధీకృత అధికారి ముందు దాఖలు చేసుకోగలరు.

సం/- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ , LA, GHMC, హైదరాబాద్.
సం/- స్పెషల్ కలెక్టర్ (LA) & కమిషనర్, GHMC,హైదరాబాద్.

DIPR RO NO. 802/LA/PP/ADVT/AGENCY/2025-26


# భారత గడ్డపై సిపిఐ 100ఏళ్ల ప్రస్థానం

డిసెంబర్ 26న ఖమ్మంలో ముగింపు ఉత్సవాలు

లక్షలాది మందితో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయండి : పల్లా వెంకట్‌రెడ్డి



ప్రజాపక్షం/దేవరకొండ : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించి నేటికి భారత గడ్డపై 100 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో లక్షలాది మందితో జరిగే సిపిఐ ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం దేవరకొండ పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో జరిగిన సిపిఐ నియోజకవర్గ సమితి సభ్యుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని మొట్టమొదటిగా గర్జించిన పార్టీ సిపిఐ అని అన్నారు. 100 ఏళ్ల ఉత్సవాల సందర్భంగా పార్టీ ఆవిర్భవించిన కాన్పూర్‌లో గత సంవత్సరం 26న ప్రారంభమై దేశవ్యాప్తంగా ఉత్సవాలు ఉత్సాహంగా జరుగుతున్నాయని అన్నారు. బ్రిటిష్ వారి నుండి దేశ విముక్తికి రాజీలేని పోరాటాలు చేస్తున్నందునే ఆనాడు పార్టీపై నిషేధం విధించాలని అన్నారు. ఎన్ని నిర్బంధాలు చేసిన జైలలో పెట్టిన అలుపెరగకుండా కార్మిక విద్యార్థి యువజన రైతు, మహిళా, ప్రజా సంఘాలను నిర్మించి వెట్టిచాకిరి విముక్తి కొరకు కార్మికులు కర్షకులను దోపిడి నుండి విముక్తి చేయడానికి రాజీలేని పోరాటాలు సిపిఐ నిర్వహించిందని ఆయన అన్నారు. దశాబ్ద కాలంలో ఎన్నో పోరాటాలు ఎన్నెన్నో త్యాగాలు ఎంతో మంది అమరుల రక్త తర్పణంతో ఎన్నో విజయాలు సాధించి భారతదేశ రాజకీయ చరిత్రలో సిపిఐ తనకంటూ ఒక ప్రత్యేకస్థానం సంపాదించుకున్నదని ఆయన అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి గద్దె దించడానికి జరిగిన మహోత్తర తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగ్గర వేల మంది ప్రాణత్యాగాలతో మూడు వేల గ్రామాల విముక్తి, పదిలక్షల ఎకరాల భూమిని పంచిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదని ఆయన గుర్తు చేశారు. ఆనాటి సాయుధ పోరాటమే అనేక ఉద్యమాలకు నెలవై అనేకమంది వీరులకు జన్మనిచ్చిందని ఆ స్ఫూర్తితోనే నేటికి పోరాట గడ్డగా బాసిల్లుతున్నదని అన్నారు. పాలకులు భూసంస్కరణ చట్టం గరీబి హటావో బ్యాంకుల జాతీయాకరణ అనేక సంస్కరణలను చేయాల్సి వచ్చిందని పోరాటాల ద్వారా దేశంలో అనేక కార్మిక సంక్షేమ చట్టాలను సాధించింది కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. నాగార్జునసాగర్, శ్రీరామ్‌సాగర్, సీతారామ ప్రాజెక్ట్ లాంటి అనేక ప్రాజెక్టుల సాధనలో అలుపెరుగని పోరాటం సిపిఐ చేసిందని, తెలంగాణకు తలమానికమైన సింగరేణి సంస్థను పరిరక్షించేందుకు కార్మికుల సమస్యలపైన అలుపెరుగని పోరాటాలు నిర్వహించింది సిపిఐ అని అన్నారు. ఆరు దశాబ్దాలుగా ప్రజల, కార్మికుల త్యాగాలతో నిర్మించిన ప్రభుత్వరంగ సంస్థలను ఎల్‌ఐసి, బ్యాంకులు, టెలికాం, గనులు చివరికి రక్షణ రంగ పరిశ్రమలను సైతం ప్రైవేట్‌కు కట్టబెడుతున్నారని అన్నారు. దేశ సంపదను అంబానీ, కార్పొరేట్ పెట్టుబడిదారులకు దోచిపెడుతూ సంపన్నులు మరింత సంపన్నులు అవుతుంటే పేదలు మరింత పేదలుగా అవుతున్నారని, రైతులు, కార్మికులను పెట్టుబడిదారులకు కట్టు బానిసలుగా మార్చే చట్టాలు బిజెపి తెచ్చిందని వీటి రద్దు కొరకు సిపిఐ నిరంతరం పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. దేశంలో కమ్యూనిస్టులు ఐక్యత వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల ఐక్యత కోసం సిపిఐ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ దేశంలో నెలకొన్న పరిస్థితులలో కమ్యూనిస్టులు మరింతగా బలపడాలని అందుకోసం నల్గొండ జిల్లాలో పార్టీ బలోపేతానికి గ్రామశాఖల బలోపేతం చేసి నిర్మాణం దిశగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని అన్నారు. శత వసంతాల ముగింపు సభకు ఖమ్మం నగరం వేదిక కావడం జరిగిందని ఈ సభకు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశం నలుమూలల నుండి దక్షిణాది రాష్ట్రాల నుండి వేలాదిగా ప్రజలు పాల్గొంటున్నారని, సిపిఐ నల్గొండ జిల్లా పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎంఎల్‌ఎ ఉజ్జిని యాదగిరి రావు, జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు, సిపిఐ మండల కార్యదర్శులు వెంకటరమణ, కనకాచారి, సుదర్శన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటయ్య, జయరాములు, పట్టణ కార్యదర్శి ఆంజనేయులు పాల్గొన్నారు.

## గీత వృత్తిదారుల సమస్యలు పరిష్కరించేందుకు
# వెంటనే చర్యలు తీసుకోవాలి





గీత పని వారల సంఘం రాష్ట్ర సమితి పిలుపు

ఎక్సైజ్ శాఖ జాయింట్ కమిషనర్‌కు మెమోరాండం అందజేత

ప్రజాపక్షం/హైదరాబాద్: గీత వృత్తిదారుల సమస్యలు పరిష్కరించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర గీత పని వారల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గీత పని వారల సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు గీత కార్మికులు గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కార్యాలయం ఆబ్కారీ భవన్ వద్ద గీత పని వారల సంఘం నాయకులు, కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు. మరణించిన గీత కార్మికుల కుటుంబాలకు రూ.13 కోట్ల ఎక్స్‌గ్రేషియా బకాయిలను తక్షణం విడుదల చేయాలని, ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు, పెన్షన్‌ను రూ.5వేలకు పెంచాలని, గీత వన పెంపకానికి 500 జీఓ ప్రకారం పది ఎకరాల భూమి ఇవ్వాలని వృత్తిని ఆధునికరించాలని, ఏజెన్సీ ఏరియాలలో కల్లు గీస్తున్న వృత్తిదారులకు సొసైటీలు ఎల్‌ఎఫ్‌టిలు ఇవ్వాలని గీత కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి డి.జి.సాయిల్ గౌడ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ జాయింట్ కమిషనర్ ఆర్.సురేష్‌కు ఒక విజ్ఞాపన పత్రాన్ని అందజేసింది. కార్యక్రమంలో సంఘం సమన్వయ కార్యదర్శి బొమ్మగాని నాగభూషణం, నాయకులు కెవిఎల్, పి.రాములు, యాదయ్య, టి.రాములు, సుదర్శన్‌గౌడ్, పి.పర్వతాలు, శ్రీశైలం, పొలగాని రవికుమార్, డి.జి.నరేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంఘం అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కరించకపోతే తమ ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రధాన కార్యదర్శి డి.జి. సాయిల్ గౌడ్ ఈ నెలలో సంఘధం రాష్ట్ర సదస్సును నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

**రంగారెడ్డి జిల్లా సూపరిండెంట్‌కూ మెమోరాండం**
గీత పనివారల సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లా సరూర్ నగర్ డివిజన్ సూపరిండెంట్ ఉజ్వలా రెడ్డికి సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పి.రాములు నేతృత్వంలో విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పర్వతాలు గౌడ్, ఉడతల మల్లేష్ గౌడ్, ఎం.శ్రీశైలం గౌడ్, ఎం.సుధాకర్ గౌడ్, పి.వెంకటేష్ గౌడ్, పరమేష్‌లతో కూడిన ప్రతినిధి బృందం పాల్గొన్నారు.

## రూ.67 కోట్లు విడుదల చేయాలని మంత్రి ఉత్తమ్‌కు చాడ లేఖ



ప్రజాపక్షం/చిగురుమామిడి: ఇటీవల కురిసిన భారీ మొంథా తుఫాన్‌తో వరద కాలువ తెగిపోయాయని, వాటివల్ల తీవ్ర నష్టం జరిగిందని, కాలువ పనులకు సంబంధించి ప్యాకేజీ 3లో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని, భూసేకరణ కోసం రూ.67 కోట్ల నిధులు విడుదల చేయాలని సిపిఐ జాతీయ మాజీ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి బుధవారం నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డికి లేఖ రాశారు. శ్రీరామ్ సాగర్ వరద కాలువ ద్వారా రైతులకు సాగునీరు అందించేందుకు గాను చిగురుమామిడి మండలం ఇందుర్తి కెనాల్ నుంచి భీమదేవరపల్లి మండలం వరకు ప్యాకేజీ 3లో చేపట్టాల్సిన పనుల కోసం నిధుల విడుదల మూలంగా జాప్యం జరిగి పనులు నిలిచిపోయాయన్నారు. ఫలితంగా ఇందుర్తి, ముదిమాణిక్యం, ముల్కనూరు, లంబాడిపల్లి, సీతారాంపూర్, పీచుపల్లి, రేకొండ గ్రామాల మీదుగా సైదాపూర్ మండలం, భీమదేవరపల్లి మండలంలోని గ్రామాల వరకు కెనాల్ పనులు చేయడానికి భూసేకరణ కోసం రూ.67 కోట్లు అవసరమవుతాయని ఎస్టిమేట్లు వేయబడ్డాయని తెలిపారు. రాష్ట్ర స్టాండింగ్ కమిటీలోనూ ఉన్నాయని, సూపర్ స్ట్రక్చర్స్, బ్రిడ్జిలు, కల్వర్టులు నిర్మించడం వల్ల అవి వరదలకు కొట్టుకుపోయి గండ్లు పడుతున్నాయన్నారు. నూతన స్ట్రక్చర్లు, కల్వర్టులు, నిర్మాణం పూర్తి చేయడానికి ప్రతిపాదనలు పంపారని తెలిపారు. ఇసుక మేటలు పెట్టడం వల్ల రైతులు తీవ్రంగా నష్టాలపాలయ్యారని వాపోయారు. ప్యాకేజీ త్రీలో నిలిచిపోయిన పనులు పూర్తి చేయుటకు యుద్ధ ప్రాతిపదికన భూసేకరణకు ఆరు కోట్లు, కొత్తగా భూసేకరణకు రూ.10 కోట్ల రూపాయలు విడుదల చేయాలన్నారు. ఇది వరకు పనిచేస్తున్న ఏజెన్సీ ఇంకా రూ.15 కోట్లు పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. కొత్తగా మంజూరు చేయబడిన రూ.42 కోట్లకు టెండర్లు పిలవాలని చాడ వెంకటరెడ్డి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి లేఖ రాశారు.

## ఓటమి భయంతోనే కెటిఆర్ దిగజారుడు వ్యాఖ్యలు

ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం ఖాయం : మంత్రి జూపల్లి కృష్ణా రావు



ప్రజాపక్షం/హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటమి భయంతోనే బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు, ఆ పార్టీ నేతలు దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఎర్రగడ్డ డివిజన్‌లోని మూసాపేటలో ఫంక్షన్ హాల్‌లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో స్థిరపడిన కొల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఓటర్లతో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌తో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారని, అధికారంలోకి వచ్చిన రేండేళ్లలోనే ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేశారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎవరూ చేయని అప్పులు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ చేశారని విమర్శించారు. ఆయన చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏడాదికి రూ.75 కోట్ల వడ్డీలు చెల్లిస్తుందన్నారు. సిఎం రేవంత్ రెడ్డిపై కెటిఆర్ వ్యాఖ్యలు దివాలా కోరుతనాన్ని చాటుతున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు ఓటు వేయడమే కాకుండా, ఇంటింటికి తిరుగుతూ నవీన్ యాదవ్‌కు మద్దతుగా నిలబడి ఓట్లు వేయించాలని కోరారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమైందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీయే విజయం సాధిస్తుందని జూపల్లి కృష్ణారావు ధీమా వ్యక్తం చేశారు.

# కెటిఆర్ అహంకారం, అవినీతిని ప్రజలు తిప్పికొడతారు

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి. నరసింహ



ప్రజాపక్షం/హైదరాబాద్ : బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు అహంకారంతో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను రౌడీషీటర్‌గా పేర్కొనడం అత్యంత దుర్మార్గమని సిపిఐ రాష్ట్ర సహాయక కార్యదర్శి ఇ.టి.నరసింహ అన్నారు. గత 10 సంవత్సరాలుగా బిఆర్‌ఎస్ హయంలో మంత్రిగా ఉన్న కెటిఆర్ లక్ష కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డ 'గజదొంగ' అని విమర్శించారు. కెటిఆర్ తన తీరు మార్చుకోకపోతే బస్‌స్టాండ్‌లు, పోలీస్ స్టేషన్‌లలో ఆయన ఫొటోలను ప్రజలు పెట్టాల్సిన వస్తారని హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కృష్ణానగర్, శ్రీలక్ష్మి నరసింహనగర్, ఇంద్రానగర్ ప్రాంతాల్లో పార్టీ శ్రేణులు కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించాయి. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నరసింహ మాట్లాడుతూ, హైదరాబాద్ చరిత్ర తెలియని కెటిఆర్ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారన్నారు. కుస్తీ పహిల్వాన్‌లను రౌడీలుగా చూపించడం తెలంగాణ సమాజం ఎప్పటికీ క్షమించదన్నారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం ఇలాంటి నాయకుడిని గెలిపించడం ప్రజల బాధ్యత అని ఈ.టి.నరసింహ అన్నారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ మాట్లాడుతూ సిపిఐ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా కాంగ్రెస్ అభ్యర్థి మద్దతుగా ప్రచారాన్ని విస్తృతంగా కొనసాగిస్తూ, కరపత్రాలు ముద్రించి ఇంటింటికీ పంపిణీ చేస్తున్నామన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ప్రజల ఓట్లతో స్పష్టమైన మెజారిటీ సాధించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.ఎస్. బోస్, కార్యవర్గ సభ్యులు ఎస్. ఛాయాదేవి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయక కార్యదర్శి కమతం యాదగిరి, కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్, మామిడి చెట్ల వెంకటస్వామి, కౌన్సిల్ సభ్యులు మహమూద్, కొమురెల్లి బాబు, చెట్టుకింది శ్రీనివాస్, బాలకృష్ణ, అనిల్, నరసింహ, గౌస్, అరుణ్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం, రోడ్లు మరియు భవనాల శాఖ
"e"procurement Notice No.10/AEE/SEJSB/2025-26, తేది: 30.10.2025
1. ములుగు జిల్లాలో 04 పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లను ఆహ్వానించడమైనది. టెండరుదారులు టెండర్ షెడ్యూళ్లను ఇ-మార్కెట్ ప్లేస్ అనగా www.eprocurement.gov.in నుండి 06.11.2025న మ.3.30గం.లకు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పైన పేర్కొన్న పనులకు టెండర్ల స్వీకరణకు ఆఖరి తేది మరియు సమయం: 13.11.2025న మ.3.30గం.ల వరకు లేదా అంతకు ముందు. 2. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా https://tender.telangana.gov.in/లో చూడవచ్చు.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (R&B), సర్కిల్, జెఎస్ భూపాలపల్లి.
DIPR R.O. No. : 10309-PP/CL/ADVT/1/2025-26, Date: 06-11-2025



గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ GHMC
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, డివిజన్-14, జిహెచ్ఎంసి, 5వ అంతస్తు, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, హైదరాబాద్.

RFQ.No. 17/EE/C14/GHMC/KZ/2025-26 ప్రకటన తేది: 06.11.2025

జిహెచ్ఎంసి హైదరాబాద్, కెజెడ్, సర్కిల్-14, గోషామహల్‌కు సప్లయి & డెలివరీ ఆధారంగా రోడ్ బాండ్ (బ్యాగ్స్) మరియు ఆర్ఎస్1 (ప్యాకేజ్డ్) సరఫరా కొరకు కొటేషన్లను అభ్యర్థించడమైనది. పని కోసం కొటేషన్లకు అభ్యర్థన.

| | |
|---|---|
| టెండర్ నోటిఫికేషన్/బిడ్ కాల్ తేదీ/ ప్రాజెక్ట్ పనుల వివరాలు పొందడం | 07.11.2025 @ 03.00 PM |
| బిడ్ సమర్పణ గడువు తేదీ మరియు సమయం /(లేదా) సీల్డ్ కొటేషన్ అందుకోవడానికి గడువు | 10.11.2025 @ 03:00 PM |
| ప్రీక్వాలిఫికేషన్ & టెక్నికల్ బిడ్లను తెరచిచూసే సమయం | 10.11.2025@ 03:30 PM |

గమనిక:
1) ఆఫ్‌లైన్ టెండర్ :- పనుల వివరాలను ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్ 14, 5వ అంతస్తు, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్ కార్యాలయం నుండి పొందవచ్చు మరియు సీల్డ్ కొటేషన్లను ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్ 14, 5వ అంతస్తు, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్ కార్యాలయంలో సమర్పించవచ్చు.
(లేదా)
2) ఆన్‌లైన్ టెండర్:- ఇ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ (tender.telangana.gov.in)లో పాల్గొనవచ్చు.
కాబట్టి అర్హత కలిగిన ఏజెన్సీలు పైన పేర్కొన్న గడువులోపు అవసరమైన అన్ని వివరాలతో తమ బిడ్‌ను సమర్పించవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సర్కిల్-14, జిహెచ్ఎంసి
DIPR R.O. No. : 10306-PP/CL/ADVT/1/2025-26, Date: 06-11-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ఆటోడ్రైవర్ల సంఘాల జెఎసి రాష్ట్ర ప్రభుత్వాన్ని, రవాణా శాఖను డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆటో జెఎసి నేతలు బి.వెంకటేశం, ఎం.ఎ.సతీం, ఎ.సతి రెడ్డి, ఎం.శ్రీనివాస్, మొబిన్ తదితరులతో కూడిన ప్రతినిధి బృందం గురువారం తెలంగాణ రాష్ట్ర జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (జెటిసి) రమేష్‌ను కలసి వినతి పత్రం అందజేసింది. ఆటో మీటర్ చార్జీలు పెంచాలని, కొత్త ఆటోలకు పర్మిట్లు ఇవ్వాలని, ఆటో డ్రైవర్ల ఇతర సమస్యల పరిష్కారం కోసం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని వారు జెటిసిని కోరారు.



## ప్రైవేట్ లెక్చరర్ల సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్తా

### జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలి

### టిపిసిసి ప్రచారక కమిటీ ఛైర్మన్ మధుయాష్కి గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంలో తెలంగాణ లెక్చరర్స్ ఫోరమ్స్ లాంటి సంఘాల కృషి ఎంతో ఉందని టిపిసిసి ప్రచార కమిటీ ఛైర్మన్, మాజీ ఎంపి మధుయాష్కి గౌడ్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా వెంగళరావు నగర్‌లో ప్రైవేట్ లెక్చరర్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో తెలంగాణలో అన్ని రంగాలు ధ్వంసమయ్యాయన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.3,000 కోట్లకు పైగా ఉన్నాయని, లెక్చరర్లకు కేవలం 10 నెలల జీతాలే ఇవ్వడం దారుణమన్నారు. అది కూడా చాలీచాలని జీతాలు చెల్లించడం బాధాకరం ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థలు దోపిడీ లక్ష్యంగా పనిచేస్తున్నాయని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు ఆ సంస్థలు తగ్గుతాయని అనుకున్నా, బిఆర్‌ఎస్ పాలనలో మరింత విస్తరించాయని తెలిపారు. తెలంగాణ వాసులు ఏర్పాటు చేసుకున్న చిన్న కళాశాలల పరిస్థితి దారుణంగా మారిందన్నారు. ప్రైవేట్ లెక్చరర్ల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున, జూబ్లీహిల్స్‌లో పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం ద్వారా అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని తెలిపారు. సమస్యల పరిష్కారం త్వరగా సాధ్యమవుతుందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మధుయాష్కి గౌడ్ పిలుపునిచ్చారు. అనంతరం మధురానగర్‌లో జరిగిన గౌడ్ కులస్తుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. నవీన్ యాదవ్ గెలుపుతో బడుగు వర్గాల ప్రాతినిధ్యం చట్టసభల్లో బలపడుతుందని తెలిపారు. అందరూ ఏకమై ఆయన విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్స్ ఫోరమ్ అధ్యక్షుడు కత్తి వెంకటస్వామి, సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ ఝాన్సీ రెడ్డి పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఫొటో గుర్తింపు కార్డు తప్పనిసరి

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఈనెల 11న జరగనున్న జూబ్లీహిల్స్ శాసన సభ నియోజకవర్గ ఉప ఎన్నికలో ఓటు వేయాలంటే ప్రతి ఓటరు తప్పనిసరిగా ఫొటో గుర్తింపు పత్రం తీసుకురావాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి తెలిపారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి ఓటరు పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి ముందు తమ ఫొటో ఐడి కార్డు చూపించాల్సి ఉంటుందని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. విదేశీ (ఓటర్లు ప్రజాప్రతినిధ్య చట్టం 1950లోని సెక్షన్ 20ఎ ప్రకారం నమోదు అయిన వారు) తమ మూల భారత పాస్‌పోర్ట్‌ను చూపించాల్సి ఉంటుందన్నారు. ఓటరు సమాచారం చీటిలు పోలింగ్‌కు కనీసం ఐదు రోజుల ముందుగానే పంపిణి చేస్తామన్నారు. అవి గుర్తింపు పత్రాలుగా పరిగణించరాదన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఓటర్లు తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో ముందుగా ధృవీకరించుకోవాలని సూచించారు. చెల్లుబాటు అయ్యే ఫొటో ఐడితో పోలింగ్ కేంద్రాలకు వచ్చి నవంబర్ 11న తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకోవాలని సుదర్శన్ రెడ్డి కోరారు. ఓటరు గుర్తింపు కార్డులు లేని వారు కింది 12 ఫొటో గుర్తింపు పత్రాలలో ఏదైనా ఒకదాన్ని చూపించవచ్చు అని తెలిపారు. ఆధార్ కార్డు, ఎంఎన్‌ఆర్‌ఈజిఎ ఉద్యోగ కార్డు, బ్యాంకు లేదా పోస్టాఫీస్ జారీ చేసిన ఫొటో పాస్‌బుక్, హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు (ఆయుష్మాన్ భారత్ కార్డు సహా), డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, నేషనల్ పాప్యులేషన్ రిజిస్టర్ (ఎన్‌పిఆర్) కింద జారీ చేసిన స్మార్ట్ కార్డు, భారత పాస్‌పోర్ట్, ఫొటోతో ఉన్న పెన్షన్ పత్రం, ప్రభుత్వ, పిఎస్‌యు లేదా పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఉద్యోగి గుర్తింపు కార్డు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అధికార గుర్తింపు కార్డు, సామాజిక న్యాయశాఖ జారీ చేసిన వికలాంగుల యూనిక్ ఐడి కార్డులు చూపించవచ్చు అన్నారు.

## ప్రభుత్వ వైద్య వ్యవస్థపై నమ్మకాన్ని పెంచేలా పని చేయాలి

### మంత్రి దామోదర రాజనర్సింహ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ వైద్య వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని మరింత పెంచేవిధంగా పని చేయాలని ఇటీవల నూతనంగా నియమితులైన గ్రూప్ అధికారులకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. వైద్య ఆరోగ్య శాఖలో ఇటీవల నియమితులైన గ్రూప్1 అధికారులు హైదరాబాద్,సచివాలయంలో మంత్రి దామోదర రాజనర్సింహను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిదామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రులకు అత్యంత పేద ప్రజలు వస్తుంటారని, వారిని అప్యాయంగా ప్రేమగా చూసుకోవాలన్నారు. హాస్పిటల్స్ పనితీరు, ఆరోగ్య రంగంలో టెక్నాలజీ, గ్రామీణ ప్రాంత ప్రజల చెంతకు స్పెషాలిటీ వైద్య సేవలు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను మంత్రి వివరించారు. ప్రస్తుతం లైఫ్ స్టైల్ డిసీజెస్ ( నాన్ కమ్యునికేబుల్ డిసీజెస్) సమస్య పెరిగిందని, దీనిపైన అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి జిల్లాలోనూ డే కేర్ కేన్సర్ సెంటర్స్, ఎన్‌సిడి క్లినిక్స్‌ను ఏర్పాటు చేశామని, తద్వారా ఎన్‌సిడి పేషెంట్లకు వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. ఆధునికత, టెక్నాలజీని జోడించి వైద్య సేవలు మెరుగుపర్చే విధండా చూడాలన్నారు.

## 24న వంట కార్మికుల చలో హైదరాబాద్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న వంట కార్మికులకు మెస్ బిల్లులు, కోడిగుడ్ల బిల్లులు, కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24న చలో హైదరాబాద్ కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్ యూనియన్ (ఎఐటియుసి) ప్రకటించింది. వంట కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ బిల్లులు తక్షణం విడుదల చేయాలని 8న నల్ల రిబ్బన్లు ధరించి వంట కార్మికులు విధుల్లో పాల్గొంటారని, 10వ తేదీన నల్ల రిబ్బన్లు ధరించి కలెక్టర్ కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేస్తారని రాష్ట్ర అధ్యక్షురాలు పి.ప్రేంపావని, ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్, ఉప ప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.

## గ్రామపంచాయతీలలో ఉండే అభివృద్ధి కూడా.. జూబ్లీహిల్స్ బస్తీలలో లేదు

### ‘మీట్ ది ప్రెస్’లో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఒక గ్రామ పంచాయతీలో ఉండే అభివృద్ధి కూడా జూబ్లీహిల్స్ బస్తీలలో లేదని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన ‘మీట్ ది ప్రెస్’ కార్యక్రమంలో ఆయన పాల్గొని, జర్నలిస్టులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్ట్ ఎన్.రహుల్ సమన్వయకర్తగా వ్యవహరించగా, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి ఉపాధ్యాక్షులు అరుణ, ప్రధాన కార్యదర్శి రమేష్‌లు పాల్గొన్నారు. కిషన్ రెడ్డి మాట్లాడుతూ సింగపూర్, ఇస్తాంబుల్, డల్లాస్, న్యూయార్క్ నగరాల మాదిరిగా అభివృద్ధి చేస్తామని పెద్ద పెద్ద మాటలు మాట్లాడిన వాళ్లు కనీస అభివృద్ధి కూడా చేయలేక పోయారని విమర్శించారు. కెసిఆర్ బోరబండలో పాదయాత్ర చేస్తే ఎంత మేర అభివృద్ధి జరిగిందో తెలుస్తుందన్నారు. డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌ను సింగపూర్‌గా మార్చుతామని చెప్పిన బిఆర్‌ఎస్ కొన్ని రోడ్‌లకు రంగులు వేసి అభివృద్ధి అని చెప్పిందని విమర్శించారు. జిహెచ్‌ఎంసి, జల మండలి వంటి సంస్థలు ఆర్థిక సంక్షోభంలో ఉన్నాయన్నారు. బిఆర్‌ఎస్ మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజలను మోసం చేస్తోందన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయడం లేదని విమర్శించారు. వాటి గురించి చెప్పకుండా కాంగ్రెస్ నేతలు రాజకీయ విమర్శలకు దిగుతున్నారన్నారు. రేవంత్ రెడ్డి పాలన వ్యక్తిగత విమర్శలకే పరిమితమైందని, మజ్లిస్ నేతల మెప్పు పొందడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని అన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలు రిఫరెండం కాదని, వాళ్లు రేఫరెండం అంటే తాము అంటామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో 8 స్థానాలు గెలుపొందిన తాము, పార్లమెంట్ ఎన్నికల్లో తమకు 8 సీట్లు గెలించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 58 నియోజకవర్గాల్లో లీడింగ్ వచ్చిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై ప్రస్తుతం హైకోర్టులో విచారణ కొనసాగుతోందన్నారు. రేవంత్ రెడ్డి సిఎం ఉండటం రహుల్ గాంధీకి ఇష్టం లేదని కెటిఆర్ అన్నారని, బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య ఢిల్లీ స్థాయిలో ఒప్పందం కుదిరిందని కెటిఆర్ వ్యాఖ్యల ద్వారానే స్పష్టమవుతోందని ఆరోపించారు. ఎపి సిఎం చంద్రబాబు నాయుడు బిజెపికి మద్దతు ఇవ్వాలని సూచించారని, టిడిపి నేతలు కూడా తమకు మద్దతు ఇస్తున్నారన్నారు. బిసిలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి న్యాయం చేయలేదన్నారు. రిజర్వేషన్‌లను ముస్లింలకు మళ్లించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా రాష్ట్రానికి వచ్చిన నిధులు, ప్రాజెక్టులు, సంస్థల వివరాలను ఆయన వివరించారు.

**జూబ్లీహిల్స్‌లో బిజెపి ఎప్పుడు గెలవలేదు..**

జూబ్లీహిల్స్ నియోజకవర్గం స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి బిజెపి గెలవలేదని, అయితే గత పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం బిజెపి రెండవ స్థానంలో నిలిచిందని తెలిపారు. ప్రస్తుతం త్రిముఖ పోరు జరుగుతోందన్నారు. తాము సర్వేలను విశ్వసించడం లేదని తెలిపారు. జూబ్లీహిల్స్ ప్రజలు ఎవ్వరికి ఓటు వేయాలి అనేదానిపై ఇంకా స్పష్టమైన ఆలోచనకు రాలేదని చెప్పారు.

**‘కాంగ్రెస్ గ్యారంటీలు కాగితాలపైనే’**

కాంగ్రెస్ పార్టీ రెండు సంవత్సరాల్లో ఎన్ని హామీలు నెరవేర్చిందని ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్ ఎక్కడ?, మహిళలకు వాగ్దానం చేసిన రూ.2,500 సహాయం ఎక్కడ?, నిరుద్యోగులకు ఇస్తామన్న రూ.4,000 భృతి ఏమైంది?, పెన్షన్‌ను రూ.4,000కు పెంచుతామని చెప్పి మాట తప్పారు అని విమర్శించారు.

## సి.ఆర్.పాలీ క్లినిక్‌ను సందర్శించిన... అంతర్జాతీయ రోటేరియన్ల బృందం



ప్రజాపక్షం / హైదరాబాద్ : కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ ఫర్ ప్రోగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న సిఆర్ పాలీ క్లినిక్ & డయాగ్నస్టిక్ సెంటర్‌ను గురువారం అంతర్జాతీయ రోటేరియన్ల బృందం సందర్శించింది. మెక్సికోకు చెందిన నెస్టోర్ జావిద్, రీయిన్ లీపాలు (నార్త్ జర్మనీ), నార్‌బెర్ట్ ఊల్ఫ్ (జర్మనీ), హర్షరణ్‌సింగ్ (ముంబయి) నాయకత్వంలో మెక్సికో, జర్మనీ, స్విట్జర్లాండ్, హంగేరీ నుండి రోటేరియన్లు సిఆర్ పాలీ క్లినిక్ మరియు డయాగ్నస్టిక్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భనను రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డెక్కన్‌కు చెందిన డాక్టర్ జయంత్ సమన్వయం చేశారు. కాగా,ఈ ప్రతినిధి బృందానికి సి ఆర్ ఫౌండేషన్ పాలిక్లినిక్ డైరెక్టర్ డాక్టర్ కె.రజని, సలహా బోర్డు సభ్యుడు డాక్టర్ బి.రంగారెడ్డి స్వాగతం పలికారు. వారు సిఆర్ ఫౌండేషన్ లక్ష్యం, క్లినిక్‌లో అందించే సేవల గురించి బృందానికి విపులీకరించారు. సిఆర్ పాలీ క్లినిక్ నామమాత్రపు రుసుంతో విశ్వసనీయమైన ఆరోగ్య పరీక్షలు, సదుపాయాలు అందించడం ద్వారా కొండాపూర్ సమీప ప్రాంతాల పేద సమాజానికి సేవలు అందిస్తోందని వివరించారు.రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డెక్కన్ సౌజన్యంతో రోటరీ గ్లోబల్ గ్రాంట్ ద్వారా డయాగ్నస్టిక్ పరికరాలను సి ఆర్ ఫౌండేషన్ లో ఏర్పాటు చేశారు.ఫౌండేషన్ లోని సౌకర్యాలను, క్లినిక్ లో ఉన్న కన్సల్టేషన్ సేవల గురించి రోటరీ బృందం తెలుసుకుంది. క్లినిక్ నాయకత్వం రాబోయే సంవత్సరాల్లో అన్ని రాష్ట్రాలలో ఈ నమూనాను పునరావృతం చేయడానికి ప్రణాళికలను వివరించింది, రోజుకు 300 మంది రోగులను లక్ష్యంగా చేసుకుని, రోటరీతో భాగస్వామ్యంలో డయాలసిస్ కేంద్రాన్ని కూడా ప్రణాళికలో చేర్చుకున్నారు. లిఫ్ట్ సదుపాయం కల్పించేందుకు కూడా చురుకైన ఏర్పాట్లు చేస్తున్నారు.సి.ఆర్. పాలీ క్లినిక్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ విజయలక్ష్మి , పాలీ క్లినిక్ కమిటీ సభ్యుడు కె. శ్రీనివాసరావు, సి.ఆర్.ఫౌండేషన్ కోశాధికారి, వృద్ధాశ్రమం డైరెక్టర్ చెన్నకేశవరావు, సి.ఆర్. ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ కె.అజయ్ కుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రోటరీ క్లబ్ అందించిన పరికరాలను సద్వినియోగం చేసుకోవడంపట్ల బృందం నిర్వాహకులను ప్రశంసల్లో ముంచెత్తింది. భవిష్యత్తులోనూ తమ పూర్తి సహకారం కొనసాగుతుందని ప్రకటించారు.

## పట్టపగలే కత్తిపోటు కలకలం..

### ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రౌడీ షీటర్ మృతి

### నిందితులు అరెస్ట్



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** పట్టపగలే జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్ ప్రాంతంలో రౌడీల మధ్య జరిగిన ఘర్షణ రక్తపాతానికి దారి తీసింది. బుధవారం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం రోషన్ సింగ్ (26) అనే రౌడీ షీటర్‌పై కత్తులతో బాలశౌరెడ్డి అనే మరో రౌడీ షీటర్ అతని అనుచరులు ఆదిల్, మహమ్మద్‌లు కలిసి బహిరంగంగానే కత్తితో దాడి చేయడం స్థానికంగా సంచలనంగా మారింది. హత్య అనంతరం నిందితులు బులెట్ బైక్‌పై పారిపోయారు. ఈ ఘటన చూసిన స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. భయాందోళనకు గురైన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకున్నారు. అనంతరం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆర్థిక లావాదేవీల వివాదం నేపథ్యంలోనే ఈ హత్యాయత్నం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. వీరిమధ్య జరిగిన వాగ్వాదం ఘర్షణకు దారితీయగా మహమ్మద్ వెనుకనుంచి రోషన్ సింగ్‌ను పట్టుకోగా, బాలశౌరెడ్డి కత్తితో దారుణంగా పొడిచాడు. అనంతరం ముగ్గురు అక్కడి నుంచి పారిపోయారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన విజువల్స్ ఆధారంగా పోలీసులు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. తీవ్ర గాయాలపాలైన రోషన్‌సింగ్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడు రోషన్ సింగ్, నిందితులు బాలశౌరెడ్డి, ఆదిల్, మహమ్మద్‌లపై ఇప్పటికే పలు క్రిమినల్ కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు మేడ్చల్ ఇన్‌చార్జ్ డీసీపీ కోటిరెడ్డి వెల్లడించారు.



## దేశంలోనే ఫస్ట్‌ప్లేస్ మనదే

### ఆ స్థాయిని నిలిపే బాధ్యత పోలీసు అధికారులదే

### డిజిపి బి.శివధర్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలోనే తెలంగాణ పోలీస్ శాఖ ప్రథమ స్థానంలో ఉందని, ఆ స్థాయిని నిలుపుకోవలసిన బాధ్యత ప్రొబేషనరీ ఎఎస్‌పి లపై కూడా ఉందని డిజిపి బి.శివధర్ రెడ్డి అన్నారు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్, సిఐ సెల్, టిజిసిఎస్‌బి, ఈగిల్ వంటి ప్రత్యేక సంస్థల ద్వారా తెలంగాణ పోలీస్ ఆధునిక పోలీసింగ్‌లో దేశానికి ఆదర్శంగా నిలిచిందని, కమాండ్ కంట్రోల్ సెంటర్, షీ టీమ్స్, భరోసా సెంటర్స్, కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలు ప్రజలతో మమేకమయ్యే ప్రయత్నాలకు నిదర్శనమన్నారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో గురువారం జరిగిన ప్రొబేషనరీ డిప్యూటీ సూపరింటెండెంట్ల శిక్షణ ప్రారంభ కార్యక్రమానికి డిజిపి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్ట్, టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్, ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా, శాంతి భద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఎం.భగవత్, పోలీస్ కమిషనర్లు వి.సి.సజ్జనార్, సుధీర్ బాబు, అవినాష్ మహంతి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రొబేషనరీ డిఎస్‌పిలనుఉద్దేశించి డిజిపి ప్రసంగిస్తూ దేశంలోనే అగ్రగామిగా నిలిచిన తెలంగాణ పోలీస్ కుటుంబంలోకి అడుగుపెడుతున్న 112 మంది ప్రొబేషనరీ డిఎస్‌పిలతో కూడుకున్న అతి పెద్ద బ్యాచ్ ఇదేనని వెల్లడించారు. శిక్షణ కాలం నాయకత్వ పయనానికి అకాడమీ పునాది వేస్తుందని, క్రమశిక్షణ, సమయపాలన, దృక్పథంలో మార్పు తీసుకొస్తుందని పేర్కొన్నారు. పోలీస్ అధికారి నిష్పాక్షికత, ఓర్పు, సహానుభూతి వంటి విలువలే ఒక అధికారిని ఉత్తమంగా తీర్చిదిద్దుతాయన్నారు. ప్రజలు పోలీసులను అధికారులుగా కాదు న్యాయప్రతినిధులుగా చూస్తారన్నారు. కార్యక్రమంలో శిక్షణ పొందుతున్న ట్రైనీలు వారి అనుభవాలను పంచుకున్నారు. ఐజిపిలు ఎస్.చంద్రశేఖర్ రెడ్డి, ఎం.రమేష్, రమేష్ నాయుడు, అకాడమీ డిప్యూటీ డైరెక్టర్లు ఎన్.వెంకటేశ్వర్లు, మురళీధర్, జి.కవిత తదితరులు పాల్గొన్నారు.

## మాగంటి గోపీనాథ్ చావుకు కెటిఆరే కారణం

### బోరబండలో బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాగంటి గోపినాథ్ చావుకు కెటిఆరే కారణమని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖలు చేశారు. ఇది గోపినాథ్ తల్లి చెప్పిన మాట అన్నారు. సిఎం రేవంత్ రెడ్డికి దమ్ముంటే సమగ్ర విచారణ జరిపించాలని సవాల్ విసిరారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డికి మద్దతుగా బోరబండలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కెటిఆర్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ‘కెటిఆర్‌కు వావి వరసల్లేవు, చిన్నా పెద్దా ముసలి ముతక అనే తేడా లేనే లేదు. సిఎం అవ్వాలంటే ఏమైనా చేసే రకం. కవిత.. మీ తండ్రి వద్దకు వెళ్లి అప్పుడప్పుడు బాగోగులు చూసుకో’ అని బండి సంజయ్ అన్నారు. ‘నేను హిందువును..., టోపీ పెట్టి దొంగ నమాజ్ చేసి ఇతర మతాలను కించపరచను. టోపీ పెట్టుకునే రోజు వస్తే తల నరుక్కుంటా’ ఏనుగులు తినేవాడు పోయి, పీనుగలు పీక్క తినేవాడు వచ్చిండు. ఎంఐఎం నాయకులు చైన్ స్నాచర్స్, వాళ్లతో జాగ్రత్త. పొరపాటున కాంగ్రెస్ గెలిస్తే ఆడవాళ్ల మెడలో ఉన్న మంగళసూత్రం కూడా గుంజుకుపోతారు. ‘కాళేశ్వరంలో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని అంటున్నారు. మరి రూ.9 వేల కోట్లపైనే సిబిఐ విచారణ ఎందుకు కోరారు? నిజంగా దమ్ముంటే రూ.లక్ష కోట్ల అవినీతిపై సిబిఐ విచారణ కోరండి. ‘లక్ష ఓట్ల కోసం ఒవైసీ సంకు తున్న కాంగ్రెస్. రావు వచ్చినా, రెడ్డి వచ్చినా ఒవైసీ చెప్పినట్లు వినాల్సిందే. పౌరుషం లేని దద్దమ్మలు కాంగ్రెసోళ్లు’ టోపీ పెట్టుకున్న రేవంత్ రెడ్డిని చూస్తే సినిమా యాక్టర్ వేణుమాధవ్ గుర్తొస్తాడు. అజహరుద్దీన్ చేత గణేష్ మంత్రం చదివించే దమ్ముందా? ఒవైసీ సోదరులను భాగ్యలక్ష్మి ఆలయానికి తీసుకెళ్లి బొట్టు పెట్టించి అమ్మ వారి పాట పాడించే ధైర్యం ఉందా’? అని బండి సంజయ్ విమర్శలు గుప్పించారు. 70 శాతం ఓట్ల సత్తా ఏందో చూపించండన్నారు. ఈ సభలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, ఎంపి డి.కె.అరుణ, నగర మాజీ మేయర్ బండ కార్తీక చంద్రా రెడ్డి మాట్లాడారు.

## తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు దొంతి రెడ్డి తిరుపతమ్మ మృతి







**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు దొంతి రెడ్డి తిరుపతమ్మ హైదరాబాదులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో మరణించారు. తెలంగాణ సాయుధపోరాట యోధులు దొంతి రెడ్డి శంభిరెడ్డి భార్య తిరుపతమ్మ. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో 1948వ సంవత్సరంలో హుజూర్‌నగర్ ప్రాంతంలో చింతలమ్మ గూడెంలో రజాకార్ల ఆకస్మిక దాడిని తిప్పి కొట్టడంలో వీర మరణం పొందిన దొంతి రెడ్డి శంభి రెడ్డి అడుగుజాడల్లో ఆయన సతీమణి తిరుపతమ్మ చివరి శ్వాస వరకు ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించారు. స్వాతంత్ర సమరయోధుల పెన్షన్ పొందుతూ సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం చీదేళ్ల గ్రామంలో తన పుట్టినింట్లో జీవితాన్ని కొనసాగిస్తూ పశ్య కన్నమ్మ సహచర్యం, బంధువర్గం, గ్రామ ప్రజల మధ్య సత్సంబంధాలను కలిగి ఉండి ఆదర్శ మహిళగా జీవితాన్ని కొనసాగించారు. తిరుపమ్మ మరణించిన వార్త తెలియగానే సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బెజవాడ వెంకటేశ్వర్లు, గన్నా చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొప్పోజు సూర్యనారాయణ ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్ సీనియర్ కమ్యూనిస్టు నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, మునగాల మండల కార్యదర్శి చిల్లంచర్ల ప్రభాకర్, సిపిఐ(ఎం) నాయకులు గ్రామ మాజీ సర్పంచ్ గుర్రం గోపాల్ రెడ్డి మైనంపాటి చిన్న వెంకటరెడ్డి సిపిఐ(ఎం) గ్రామ శాఖ కార్యదర్శి కొండ మీది రాములు, డాక్టర్ కొప్పోజు వెంకటేశ్వర్లు, హుజూర్‌నగర్ ప్రభుత్వ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ వేమారెడ్డి, ప్రియదర్శిని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పశ్య శ్రీనివాస్ రెడ్డి, జూలకంటి అరుణ, చింతకుంట్ల విజయ ప్రమీల దొంతి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, దొంతి రెడ్డి శంభిరెడ్డి, చింతకుంట్ల కోటిరెడ్డి, శంబిరెడ్డి కృష్ణారెడ్డి, తిరుపతమ్మ పెంచుకున్న అమ్మాయి విమల, అల్లుడు వెంకట్ రెడ్డి మనవరాలు శోభ గ్రామ ప్రజలు తరుపతమ్మ అంతిమయాత్రలో పాల్గొని నివాళులు అర్పించారు.

## గాంధీ ఆసుపత్రిని సందర్శించిన మానవ హక్కుల కమిషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఛైర్‌పర్సన్ జస్టిస్ షమీమ్ అఖ్తర్ నేతృత్వంలోని కమిషన్ బృందం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిని గురువారం సందర్శించింది. కమిషన్ బృందం మొదట ఎమర్జెన్సీ వార్డును పరిశీలించి, విధుల్లో ఉన్న వైద్యులతో మాట్లాడారు. అనంతరం జెరియాట్రిక్ (వయోవృద్ధుల) విభాగం, పిడియాట్రిక్ (పిల్లల) విభాగం,పిడియాట్రిక్ సర్జరీ విభాగం, ఇతర విభాగాలను సందర్శించి, సంబంధిత రికార్డులను పరిశీలించింది. కమిషన్ సభ్యులు శివాది ప్రవీణ, ) డా. బి. కిషోర్ పాల్గొన్నారు.



తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని రామోజీ గ్రూప్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్.కిరణ్ గురువారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 16న జరగనున్న ‘రామోజీ గ్రూప్ ఫౌండేషన్ డే’ వేడుకల్లో భాగంగా నిర్వహించే ‘రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవ’ కార్యక్రమానికి సిఎంను ఆహ్వానించారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## మరో మహిళా మావోయిస్టు లొంగుబాటు..

**రాయ్‌పూర్ :** ఛత్తీస్‌గఢ్‌లో యాంటీ నక్సల్ ఆపరేషన్ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మహిళా మావోయిస్టు కమలా సోడి గురువారం పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఉంగి అలియాస్ తరుణగా పేరొందిన కమలా సోడిపై రూ. 17 లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. రాజ్‌నంద్‌గావ్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ అభిషేక్ శాండిల్య, ఎస్‌పి లక్ష్య శర్మతో పాటు ఇతర పోలీసు ఉన్నతాధికారుల ఎదుట కమలా లొంగిపోయారు. ఆమె లొంగుబాటుతో మిగతా మహిళా మావోయిస్టులు కూడా అడవిని, ఆయుధాలను వీడి జనస్రవంతిలోకి వస్తారని పోలీసులు విశ్వసిస్తున్నారు. పునరావాస చర్యల్లో భాగంగా తక్షణ సాయం కింద ఆమెకు రూ. 50 వేలు అందించారు. సుక్మా జిల్లాలోని కుంట ప్రాంతానికి చెందిన సోడి.. సిపిఐ(మావోయిస్టు) పార్టీతో 2011 నుంచి సంబంధాలు కొనసాగిస్తున్నారు. మహారాష్ట్ర – మధ్యప్రదేశ్ – ఛత్తీస్‌గఢ్ జోన్ పరిధిలో జరిగిన మావోయిస్టు కార్యకలాపాల్లో కమల చురుకుగా పాల్గొన్నారు. ఈ మూడు రాష్ట్రాల్లో జరిగిన మావోయిస్టుల దాడుల్లో కమల కీలకపాత్ర పోషించారు.

## చొరబాటుదారుల పట్ల కాంగ్రెస్ సానుకూల వైఖరి

### ఓటు రాజకీయాల వల్ల రాముడంటే ఆ పార్టీకి ఇష్టం లేదు : మోదీ




**భగల్‌పూర్/అరారియా :** బిహార్‌లో ప్రతిపక్ష ఆర్‌జెడి–కాంగ్రెస్ కూటమి చొరబాటుదారుల పట్ల సానుకూల వైఖరి అవలంబిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. అయితే ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా రాముడు, ఛట్ పూజను అవమానిస్తున్నారన్నారు. గురువారం మోదీ భగల్‌పూర్, అరారియా జిల్లాల్లో నిర్వహించిన వరుస ర్యాలీల్లో ప్రసంగించారు. నిషాద్ రాజ్, మాతా శబ్రీ, మహర్షి వాల్మీకిలకు అంకితం చేయబడిన పుణ్యక్షేత్రాలను దర్శనం చేసుకోవడానికి, ప్రతిపక్ష నాయకులు అయోధ్యను సందర్శించడానికి ఇష్టపడకపోవడం దళితులు, వెనుకబడిన తరగతుల పట్ల వారి ద్వేషాన్ని సూచిస్తుందని ఆరోపించారు. 15 సంవత్సరాల ఆటవిక రాజ్యం కాలంలో బిహార్‌లో సునాన అభివృద్ధి, అని, రహదారులు, వంతెనలు నిర్మించబడలేదని, ఉన్నత విద్యా కేంద్రాలు ఏర్పాటు చేయబడలేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నాయకత్వంలోని ఎన్‌డిఎ రాష్ట్రాన్ని ఆ యుగం నుండి బయటకు తీసుకురావడానికి చాలా కష్టపడి పనిచేసిందన్నారు. దేశం నుండి ప్రతి చొరబాటుదారులను తరిమికొట్టడానికి ఎన్‌డిఎ కట్టుబడి ఉందని, కానీ కాంగ్రెస్– ఆర్‌జెడి వారికి రక్షణ కల్పిస్తున్నాయన్నారు. వారికి అనుకూలంగా రాజకీయ యాత్రలు నిర్వహిస్తాయని, తప్పుదారి పట్టించే కథనాలతో ముందుకు వస్తాయని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఓటరు అధికార్ యాత్ర, ఓటు దొంగతనం ఆరోపణలను పరోక్షంగా ప్రస్తావిస్తూ ప్రధాని ఆరోపించారు. ఆర్‌జెడి–కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడల్లా వారు చొరబాటుదారులకు వెనుక ద్వారం గుండా ప్రవేశం కల్పించడానికి ప్రయత్నిస్తాయని, ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా అలా చేస్తారన్నారు. కానీ ఇది ఈ దేశ ప్రజలపై ప్రభావం చూపుతుందని, చొరబాటుదారులు పౌరులకు చెందిన ప్రతిదానిలో వాటాను పొందుతారన్నారు. రాహుల్ గాంధీ ఛట్ పూజను డ్రామాగా అభివర్ణించారని, వారు రాముని దర్శనం చేసుకోవడానికి అయోధ్యను ఎప్పుడూ సందర్శించరని పేర్కొన్నారు. 'కట్ట' (దేశ నిర్మిత ఆయుధాలు), 'క్రోర్త' (క్రూరత్వం), 'కటుట' (చేదు), 'కుశాసన్' (దుష్పరిపాలన), అవినీతి 15 సంవత్సరాల అడవి రాజ్ ముఖ్య లక్షణాలు అని మోదీ అన్నారు. ఆర్‌జెడి పాఠ్యాంశాల్లో, 'ఎ' అంటే 'అఫరన్' (కిడ్నాప్), 'ఎఫ్' అంటే 'ఫిరౌతి' (విమోచన క్రయధనం), 'పి' అంటే 'పరివర్వాద్' (రాజవంశ పాలన) అని మోదీ పేర్కొన్నారు. కాంగ్రెస్ నిఘంటువులో 'స్వదేశీ' (స్వదేశీ), 'ఆత్మనిర్భరత' (స్వయం సమృద్ధి) వంటి పదాలు లేవని మోదీ విమర్శించారు. జాతి హింసకు ఆర్‌జెడినిని, భగల్‌పూర్ (1989) లో జరిగిన అప్రసిద్ధ మత అల్లర్లకు కాంగ్రెస్‌ను నిందించడం ద్వారా రెండు కూటమి భాగస్వాములు సామాజిక కలహాలను రెచ్చగొట్టాయని ప్రధాని ఆరోపించారు. ఇది 1984 లో సిక్కు వ్యతిరేక హింస వలె చెరగని మచ్చగా ఉందన్నారు.

## పెరుగుతున్న నిరుద్యోగంతో ప్రజల్లో తీవ్ర ఆందోళన

### సమస్యలు పరిష్కరించడానికి బదులు ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ బిజీ : కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** దేశంలో రోజు రోజుకు నిరుద్యోగం పెరుగుతోందని, ఈ విషయం ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తుందని కాంగ్రెస్ ఆవేదన వ్యక్తం చేసింది. అయితే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ సమస్యను పరిష్కరించడానికి బదులుగా, ఎల్లప్పుడూ ఎన్నికల బిజీలో ఉంటున్నారని, ప్రజల దృష్టిని మళ్లించడానికి కొత్త ప్రసంగాలను కనిపెట్టడంలో క్షణం కూడా తీరిక లేకుండా ఉన్నారని ఎద్దేవా చేసింది. గత 11 ఏళ్ల ఎన్‌డిఎ సర్కార్ దుష్టపాలన సమాజంలోని అన్ని వర్గాలను దెబ్బతీసిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ఆరోపించారు. 'విద్యార్థులు, యువత, రైతులు, కార్మికులు, కార్మికులు, దుకాణదారులు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలు ఒక్క వర్గం కూడా ఈ ప్రభుత్వంతో సంతోషంగా లేరు. ద్రవ్యోల్బణం ఆకాశాన్ని అంటుతోంది, రూపాయి విలువ నిరంతరం తగ్గుతోంది . ధనిక, పేదల మధ్య అంతరం నిరంతరం విస్తరిస్తోంది. పేద, మధ్య తరగతి కుటుంబాల జీవితాన్ని కష్టతరం చేస్తోంది' అని రమేష్ ఎక్స్‌లో హిందీలో తన పోస్ట్ చేశారు. పెరుగుతున్న నిరుద్యోగం తీవ్ర ఆందోళన కలిగించే విషయంగా మారిందన్నారు. తాజా సిఎంఐఇ నివేదికను ఉటంకిస్తూ, దేశంలో నిరుద్యోగిత రేటు అక్టోబర్ 2025లో 7.5 శాతానికి పెరిగిందని, ఇది గత ఆరు నెలల్లో అత్యధిక స్థాయి అని అన్నారు. నిర్మాణం, ఐటి బ్యాంకింగ్‌తో సహా అనేక రంగాలలో లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోయారని, నిర్మాణ పరిశ్రమలో 90 లక్షలకు పైగా ఉద్యోగాలు కోల్పోయారని, జీతాలు పొందే ఉద్యోగాల సంఖ్య 25 లక్షలు తగ్గిందన్నారు. 11 ఏళ్లుగా ప్రతి సంవత్సరం ఆందోళనకరమైన గణాంకాలు వెలువడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ, మోదీ జీకి దేశ యువత పట్ల ఎలాంటి శ్రద్ధ లేదన్నారు. ఎల్లప్పుడూ ఎన్నికల వాతావరణంలో, నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి బదులుగా ప్రజల దృష్టిని మళ్లించడానికి కొత్త ప్రసంగాలను కనిపెట్టడంలో ఆయన బిజీగా అన్నారన్నారు. కాగా, ఆర్థిక వ్యవస్థను నిర్వహించడంపై కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ తరుచూ విమర్శలు చేస్తోంది. ధరలు పెరగడం, తగ్గుతున్న ప్రైవేట్ పెట్టుబడులు, స్తబ్దత వేతనాలు సామాన్య ప్రజలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని ఆరోపిస్తోంది.

## ఎన్‌డిఎను దించితేనే ఉద్యోగాలు

### ఎస్‌పి చీఫ్ అఖిలేశ్ యాదవ్



**పాట్నా :** బిహార్‌లో మహాఘట్బంధన్ విజయం ఎప్పుడో ఖాయమైందని, రాష్ట్రంలోని యువత ఎన్‌డిఎను అధికారం నుంచి దించి జమ్ము కాకుండా ఉద్యోగాలు ఇచ్చే ముఖ్యమంత్రిని ఎన్నుకోవాలని నిర్ణయించుకున్నారని సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి) చీఫ్ అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం తూర్పు చంపారన్ జిల్లాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఇండియా కూటమిఅభ్యర్థులకు మద్దతుగా అఖిలేశ్ పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలంతా అధికార ఎన్‌డిఎకు వ్యతిరేకంగా ఉన్నారన్నారు. బిజెపి, దాని మిత్రపక్షాలు ఉపాధి కల్పించడంలో, ద్రవ్యోల్బణాన్ని అరికట్టడంలో, రైతుల సంక్షేమాన్ని నిర్ధారించడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. ప్రజలు జవాబుదారీతనం అడుగుతున్నారని యాదవ్ అన్నారు. ఢిల్లీ (బిజెపి నేతృత్వంలోని కేంద్రం) ప్రభుత్వంలో 10 సంవత్సరాలు, బిహార్ ప్రభుత్వంలో 20 సంవత్సరాల్లో ఎంత మంది యువతకు ఉద్యోగాలు వచ్చాయో చెప్పాలని, రైతుల ఆదాయం రెట్టింపు అవుతుందని వారు హామీ ఇచ్చారని, ఎవరికైనా రెట్టింపు అయ్యిందా? అని ర్యాలీలో పాల్గన్న ప్రజలను ప్రశ్నించారు. బిజెపి నాయకుల అభివృద్ధి వ్యాఖ్యలపై స్పందిస్తూ, గోరఖ్‌పూర్ నుండి దూర ప్రాంతాలకు ఎక్స్‌ప్రెస్‌వేలు నిర్మిస్తున్నట్లు ఢిల్లీకి చెందిన ప్రొఫెసర్‌మాట్లాడటంతానుఇటీవల విన్నానని అన్నారు. తాము ఉత్తరప్రదేశ్ నుండి వచ్చామి, అయితే ఎక్కడాఅలాంటిఎక్స్‌ప్రెస్‌వేను చూడలేదని ఎద్దేవా చేశారు. వారు గాలిలో ఎక్స్‌ప్రెస్‌వేలను నిర్మిస్తున్నారన్నారు. బిజెపిని ఓట్ల దొంగగా పేర్కొంటూ వారికి ఎన్నికల కమిషన్ పార్టీ అనే 'సి' టీమ్ ఉందన్నారు. ఓట్లు దొంగిలించడానికి వారికి సహాయపడే మరొక పార్టీ 'పి' టీమ్ ఉంది. కాబట్టి ఇండియా కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ప్రశాంత్ కిషోర్ జన్ సూరజ్ పార్టీనుద్దేశించి పరోక్షంగా ప్రస్తావించారు. కేంద్రంలో, బిహార్‌లో ఎన్‌డిఎ పాలనలో నిత్యావసర వస్తువులకు పెరుగుతున ధరలపై ఎస్‌పి చీఫ్ తీవ్రంగా విమర్శించారు. ఉత్తరప్రదేశ్‌లోని తన ప్రత్యర్థి, ఎప్పుడూ కాషాయ దుస్తులు ధరించే ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను లక్ష్యంగా చేసుకుని 'ఏకరంగు' అనే పదాన్ని కూడా ఆయన ఉచ్చరించారు. యువత 'ఏకరంగు' అంటే ఏమిటో గూగుల్‌లో శోధిస్తే, తాను ఆ పదాన్ని ఎందుకు పునరావృతం చేయకూడదో వారికి అర్థమవుతుందని, వారు సమాజాన్ని విభజిస్తున్నారని, ప్రజలను మోసం చేస్తున్నారని, కలలను అమ్ముతున్నారని ఆరోపించారు. బిజెపిని అధికారం నుండి దించినప్పుడే ఉద్యోగాలు వస్తాయని, బిహార్ డబ్బు రాష్ట్రానికి ఖర్చు చేయబడుతుందన్నారు.

## 'నవంబరు విప్లవం' ఏమీ లేదు

### 2028లో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వచ్చినప్పుడే విప్లవం : డికె



**న్యూఢిల్లీ :** కర్నాటకలో గత కొద్దికాలంగా ముఖ్యమంత్రి మార్పుపై పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్నది. త్వరలోనే డికె శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తారని పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి. నవంబర్‌లో విప్లవం పేరుతో వస్తున్న ఊహాగానాలను కర్నాటక డిప్యూటీ కిఎం డికె శివకుమార్ తోసిపుచ్చారు. నవంబర్, డిసెంబర్‌లో విప్లవం ఉండదని.. 2028లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు మాత్రమే జరుగుతుందన్నారు. తాను పార్టీకి క్రమశిక్షణ కలిగిన సైనికుడినని.. సిఎం సిద్ధరామయ్యతో కలిసి పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఉంటానన్నారు. ఇటీవల సిఎం మార్పు జరిగే అవకాశం ఉందని.. దీన్ని కొందరు నవంబర్ విప్లవం అంటూ వ్యాఖ్యానించారు. దీనిపై శివకుమార్ స్పందిస్తూ.. తాను ఎవరినీ కలవబోవడం లేదని.. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై ఎలాంటి చర్చజరుగలేదన్నారు. ఇది ముఖ్యమంత్రి హక్కని.. పార్టీ ఏది నిర్ణయించినా అదే జరుగుతుందన్నారు. పార్టీ ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉంటారని చెబితే.. ఆయన అలాగే ఉంటారని.. ఆయన పదేళ్లు, పదిహేనేళ్లు ఉండాలనుకుంటే అన్ని సంవత్సరాలు కొనసాగుతారన్నారు. మీడియాలో వస్తున్న ఊహాగానాలను ఆయన తోసిపుచ్చారు. నవంబర్, డిసెంబర్, జనవరిలో విప్లవం రాదని.. 2028లో కాంగ్రెస్ తిరిగి వచ్చినప్పుడు ఆ విప్లవం జరుగుతుందన్నారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై ప్రశ్నించగా.. ఢిల్లీ హైకమాండ్ దీనిపై నిర్ణయం తీసుకుంటుందని శివకుమార్ వ్యాఖ్యనించారు. ఇదిలా ఉండగా.. ఇటీవల సిద్ధరామయ్య ఇటీవల తన ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేస్తానని, అయితే తుది నిర్ణయం పార్టీదేనని స్పష్టం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత.. సిఎం పదవి కోసం సిద్ధరామయ్య, శివకుమార్ పోటీపడ్డ విషయం తెలిసిందే. సిద్ధరామయ్య, శివకుమార్ చెరో రెండున్నరేళ్లు సిఎంగా కొనసాగే అవకాశం ఉందని వార్తలు వచ్చాయి.

## వరదనీటిలో మునిగిన రోడ్లపై ఓటర్ల ప్రయాణం,నాయకులపై విమర్శలు



**దర్భాంగ్/ముంగేర్:** బిహార్ తొలి దశ ఎన్నికల్లో రాజకీయపార్టీలు ఒకవైపు భారీ అంచనాలు వేసుకుంటూ ఉండగా, మరోవైపు ఓట్లు వేసేందుకు వెళుతున్న ఓటర్లు కనీసం రోడ్లు కూడా సరిగ్గా లేక పోవడంతో ఆయన నాయకులపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. దర్భాంగ్‌లోన కుషేశ్వర్ అస్థాన్ నియోజకవర్గంలో ఓటర్లు వరదనీటిలో నిండి కంటికి కనిపించనిరోడ్లపైనేప్రయాణం చేస్తూ పోలింగ్ బూత్‌లవైపు ప్రయాణం చేశారు. ఇరవైయేళ్ళుగా ప్రభుత్వాలు ప్రజల కనీస అవసరాలు కూడా తీర్చలేదని ఓటర్లు విమర్శిస్తూ ఆ దారిలో నడిచి వెళ్ళడం కనిపించింది. పిల్లలను కూడా పెద్దలు వెంటబెట్టుకుని వస్తూ, ఎక్కడ గుంతలు ఉన్నాయో కూడా కనిపించని పరిస్థితుల్లో ఆ నీటి మడుగుల్లోంచి నడిచి వెళ్ళారు. "ఏమిటిఈ పరిస్థితి? చూశారా ఈ నీళ్ళన్నీ? ఎవరి కాలైనా మెలిక పడితే పడిపోతారు, కాలు విరుగుతుంది, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? వాళ్ళకు ఓట్లు కావాలి, రాజకీయ నాయకులను ఇక్కడికి రమ్మనండి, చూడమనండి, ఇక్కడ డ్రైనేజీ ఏర్పాట్లు కూడా లేవు, ఇక్కడ పరిస్థితిని కళ్ళతో చూశాక ఆ తర్వాత మమ్మల్ని ఓట్లు అడగమనండి'' అని పిటిఐ వీడియోస్‌కు ఒక ఓటరు ఆగ్రహంగా చెప్పారు. మరో నివాసితుడు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఆదరాబాదరాగా ఈ ప్రాంతంలో కొన్ని రాళ్ళు వేస్తారు నడిచి వెళ్ళడానికి, మిగిలిన సమాయాల్లో వారికి ఈ రోడ్లు బాగుచేయాలనే ఆలోచన కూడా రాదు, పోలింగ్ రోజు రాగానే ముందు రోజున ఆదరాబాదరాగా నడిచి వెళ్ళడం కోసం కొన్ని రాళ్ళు వేస్తారు'' అని విమర్శించారు. "ఇక్కడ ఎన్నో సమస్యలున్నాయి, మా కొడుకులు పనులకోసం ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాలకు వెళుతున్నారు, వాళ్ళని ఎవ రు పట్టించుకుంటారు? ఈ రాష్ట్రంలో ఉద్యోగాలు లేవు, ప్రభుత్వం ఇక్కడే ఏదైనా ఉపాధి కల్పిస్తే, వాళ్ళంతా మా కళ్ళ ఎదుటే మా గ్రామాల్లోనే ఉంటారు'' అని మరో ఓటరు ఆవేదనగా చెప్పారు. మా దగ్గర డబ్బులు లేవు, తిండి లేదు, ఇక్కడే ఉంటున్నాం, బయటకు వెళ్ళలేం, మేం ఏం చెయ్యాలి? అని మరో ఓటరు ప్రశ్నించారు. ఇక ముంగేర్ లోని భీంబంధ్ ప్రాంతం నక్సల్ ప్రాబల్యం ఉన్న ప్రాంతం. ఇక్కడ తారాపూర్ నియోజకవర్గంలో ప్రజలు లైన్లలో నిలబడి ఓట్లు వేశారు. 20 సంవత్సరాల తర్వాత ఎక్కువమంది ఓటర్లు సొంత ప్రాంతాలకు వెళ్ళి ఓట్లు వేశారు. ఈ నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలను నక్సల్ ప్రాబల్యం కారణంగా ఇతర ప్రాంతాలకు తరలించారు. 2005 తర్వాత మళ్ళీ ఇప్పుడే ఇక్కడ పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు.

## ఇద్దరు రాజ్యసభ సభ్యుల ప్రమాణం



**న్యూఢిల్లీ :** రాజ్యసభకు కొత్తగా ఎన్నికైన సభ్యులు గురువారం ప్రమాణం చేశారు. రాజిందర్ గుప్తా, సత్ పాల్ శర్మలతో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ గురువారం ప్రమాణ స్వీకారం చేయించారు. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి చెందిన గుప్తా పంజాబ్ నుంచి ఎంపిగా ఎన్నికయ్యారు. బిజెపికి చెందిన శర్మ జమ్ముకశ్మీర్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపిగా ప్రమాణ స్వీకారం చేశారు. పార్లమెంట్ హౌస్‌లో జరిగిన కార్యక్రమంలో గుప్తా పంజాబీలో ప్రమాణ స్వీకారం చేయగా, శర్మ హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు. పారిశ్రామికవేత్త అయిన గుప్తాను పంజాబ్‌లో అధికారంలో ఆప్ నామినేట్ చేసింది. శర్మ బిజెపి జమ్ముకశ్మీర్ యూనిట్ అధ్యక్షుడు. ఆయన వృత్తిరీత్యా చార్టర్డ్ అకౌంటెంట్, గతంలో జమ్ముకశ్మీర్ ప్రభుత్వంలో క్యాబినెట్ మంత్రిగా పనిచేశారు. 2014లో జమ్ము వెస్ట్ నియోజకవర్గం నుండి శాసనసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. అప్పుడు ఆయన 51,000 ఓట్ల తేడాతో గెలుపొందగా, అప్పటికి అత్యధిక ఓట్ల తేడా అదే కావడం గమనార్హం. కాగా, ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బిజెపి అధ్యక్షుడు జె. పి. నడ్డా, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, బిజెపి జమ్ముకశ్మీర్ ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్ కూడా హాజరయ్యారు. ఇద్దరు ఎంపిల కుటుంబ సభ్యులు ప్రమాణ స్వీకారానికి హాజరయ్యారు. పంజాబ్ నుంచి రాజ్యసభకు పోటీలో ఉన్న ఏకైక అభ్యర్థిగా గుప్తా ఎన్నికయ్యారు. అక్టోబర్ 24న జరిగిన రాజ్యసభ ఉప ఎన్నికకు గుప్తాను అభ్యర్థిగా నామినేట్ చేసిన ఆప్, 117 మంది సభ్యుల రాష్ట్ర అసెంబ్లీలో 93 మంది సభ్యులతో అఖండ మెజారిటీని కలిగి ఉంది. ఆప్‌కు చెందిన సంజీవ్ అరోరా రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికైన తర్వాత ఎగువ సభ నుండి వైదొలిగిన తర్వాత ఆ స్థానం ఖాళీ అయింది. అప్పటి నుండి ఆయన పంజాబ్ మంత్రివర్గంలోకి చేరారు. ట్రైడెంట్ గ్రూప్ ఎమెరిటస్ చైర్మన్ గుప్తా ఇటీవల రాష్ట్ర ఆర్థిక విధానం, ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్ష పదవికి, కాళీ దేవి ఆలయ సలహా కమిటీ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. జమ్ముకశ్మీర్‌లో ఎన్నికలు జరిగిన నాలుగు రాజ్యసభ స్థానాల్లో ఒక దాన్ని శర్మ గెలుచుకున్నారు.

## పార్థ్ పవార్ రూ.300 కోట్ల భూ ఒప్పందంపై... దర్యాప్తునకు ఆదేశించిన మహారాష్ట్ర సిఎం

### దేవేంద్ర ఫడ్నవీస్
### రెవెన్యూ అధికారిని సస్పెండ్ చేసిన ప్రభుత్వం
### అదనపు ప్రధానకార్యదర్శి (రెవెన్యూ) వికాస్‌ఖర్గే నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు



**పుణే :** పుణేలో జరిగిన ఒక భారీ భూకుంభకోణం మహారాష్ట్ర ప్రభుత్వంలో రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ కుమారుడు పార్థ్ పవార్ ప్రమేయం ఉందని ఆరోపిస్తూ పుణేలో జరిగిన రూ.300 కోట్ల భూ ఒప్పందంపై మహారాష్ట్ర ప్రభుత్వం ఒక రెవెన్యూ అధికారిని సస్పెండ్ చేసి, దానిపై దర్యాప్తు చేయడానికి ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసిందని గురువారం అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సూచనల మేరకు ఏర్పాటుచేసిన దర్యాప్తు కమిటీకి అదనపు ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ) వికాస్‌ఖర్గే నేతృత్వం వహిస్తారని వారు చెప్పారు. ఈ భూలావాదేవీని 'ప్రాథమికంగా తీవ్రమైనది' అని ఫడ్నవీస్ పేర్కొన్నారు. పార్థ్ పవార్ వ్యాఖ్యల కోసం 'పిటిఐ' ఫోన్ ద్వారా ఆయనను సంప్రదించాలని ప్రయత్నించింది. అయితే ఆయన దీనిపై స్పందించలేదు. బిజెపి, అజిత్ పవార్ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ, ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలతో కూడిన పాలకమహాయుతిని లక్ష్యంగా చేసుకోవడానికి ప్రతిపక్షాలను ప్రేరేపించిన వివాదాస్పద ఒప్పందంపై పుణేకు చెందిన తహసీల్దార్ సూర్యకాంత్ యెవాలేను తక్షణమే సస్పెండ్ చేశారు. ఒక అధికారి వెల్లడించిన ప్రకారం...పుణేలోని అప్ మార్కెట్ ముంధ్వా ప్రాంతంలో 40 ఎకరాల 'ప్రభుత్వానికి చెందిన మహార్ వతన్‌భూమి' పార్థ్ పవార్ భాగస్వామిగా ఉన్న అమేడియా ఎంటర్‌ప్రైజెస్ ఎల్‌ఎల్‌పికి రూ.300 కోట్లకు విక్రయించారు. దానిపై స్టాంప్ డ్యూటీని రద్దు చేశారు. 'ప్రభుత్వ భూమి కాబట్టి ఆ ప్లాట్‌ను ఒక ప్రైవేట్ సంస్థకు అమ్మలేం' అని ఆయన చెప్పారు. ప్రభుత్వ భూమిని ప్రైవేట్ సంస్థకు ఎలా విక్రయించారో, నిబంధనల ప్రకారం మినహాయింపు ఇవ్వబడిందా లేదా అనేది ఉన్నత స్థాయి కమిటీ నిర్ధారిస్తుందని రిజిస్ట్రేషన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ రవీంద్ర బిన్వాడే 'పిటిఐ'కి తెలిపారు. 'మినహాయింపును క్లెయిమ్ చేయడానికి సంబంధించిన పత్రాలను తనిఖీ చేస్తారు. రిజిస్ట్రేషన్ సమయంలో ఎలాంటి పత్రాలు సమర్పించబడ్డాయో కూడా కమిటీ పరిశీలిస్తుంది. కానీ తక్షణ చర్యగా మేము సబ్ రిజిస్ట్రార్ ర్యాంక్ అధికారిని సస్పెండ్ చేశాం. ఒకవేళ అది ప్రభుత్వ భూమి అయితే రిజిస్ట్రేషన్ జరుగకూడదు' అని ఆయన చెప్పారు. కీలకమైన ప్రాపర్టీ డాక్యుమెంట్ 7/12 ఎక్స్‌ట్రాక్ట్ లో భూమి ముంబయ్ సర్కార్ పేరు మీద ఉందని రెవెన్యూ శాఖ వర్గాలు తెలిపాయి. పార్థ్ పవార్ పేరుతో పాటు రిజిస్ట్రేషన్ జరిగిన పేరు మీద దిగ్విజయ్ పాటిల్ కూడా సంస్థలో సహ భాగస్వామిగా ఉన్నారు. అంతకుముందు రోజు ఫడ్నవీస్ నాగ్‌పూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ప్రాథమికంగా చూస్తే సమస్య తీవ్రంగా కనిపిస్తోంది. కేసుకు సంబంధించిన మొత్తం సమాచారాన్ని సంబంధిత విభాగాల నుంచి కోరాను. దర్యాప్తునకు ఆదేశాలు ఇవ్వబడ్డాయి. ఆ విషయం గురించి, వివరాలు వచ్చిన తర్వాత తీసుకోవాల్సిన చర్యల గురించి నేను మాట్లాడగలను. సమాచార హక్కు కార్యకర్త విజయ్‌కుంభార్ ప్రకారం... మార్కెట్ రేటు గణనీయంగా ఎక్కువగానే ఉన్నప్పటికీ పార్థ్ పవార్‌తో సంబంధం ఉన్న ఒక కంపెనీకి ఈ భూమిని దాదాపు రూ.300 కోట్లకు కొనుగోలు చేసిందని ఆరోపించబడింది. 'ఈ ఒప్పందంపై రూ. 21 కోట్ల స్టాంప్ డ్యూటీని రద్దు చేశారు' అని కూడా ఆయన చెప్పారు. 'కొంతమంది ఇతరుల కన్నా ఎందుకు ఎక్కువగా ఉంటారు' అని ఆయన బుధవారం ఒక సోషల్ మీడియా పోస్ట్ లో అడిగారు. ఈ భూమి లావాదేవీపై విచారణ జరపాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు విజయ్ వాడెట్టివార్ డిమాండ్ చేశారు. శివసేన యుబిటి నాయకుడు అంబదాస్‌దన్వే మాట్లాడుతూ రూ.1800 కోట్ల విలువగల ఆ ప్రైవేట్ కంపెనీ కోసం భూమిని తీసుకున్నారని ఆరోపించారు. ఏప్రిల్ 22న కంపెనీ ఐటి పార్కు ఏర్పాటు కోసం తీర్మానం చేసి, రూ. లక్ష కోట్ల మూలధనం కుంభకోణం జరిగినప్పటికీ ప్రభుత్వానికి ప్రతిపాదన సమర్పించిందని అంబదాస్ దన్వే ఆరోపించారు.

## నేను ఇండియాలో ఫేమస్ అయ్యా!

### రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై స్పందించిన బ్రెజిల్ మోడల్

**న్యూఢిల్లీ :** హర్యానాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బ్రెజిల్ మోడల్ ఓటేసినట్లు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వెల్లడించిన విషయం తెలిసిందే. ఆ మోడల్ పేరుతో 22 ఓట్లు ఉన్నాయని ఆయన బుధవారం మీడియా ముందు వివరించారు. అయితే ఆ మోడల్ ఎవరన్నది తెలిసింది. ఆమెను లారిసా నేరిగా గుర్తించారు. ప్రెస్‌కాన్ఫరెన్స్‌లో రాహుల్ గాంధీ వాడిన తన ఫోటో గురించిఆమోడల్‌స్పందించింది. తాను 20 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు ఆ ఫోటో దిగినట్లు ఆమె చెప్పింది. తన పాతఫోటోను వాడారని, 20 ఏళ్ల వయసులో ఆ ఫోటో దిగానని, ఇండియాలో ఓటింగ్ కోసం వాడినట్లు తెలిసిందని, ప్రజల్ని మోసం చేసేందుకు తనను ఇండియన్‌గా చూపిస్తున్నారని, ఇదేం వెర్రితనం, ఇంత పిచ్చా, మనం ఏం ప్రపంచంలో జీవిస్తున్నాని ఆ మహిళ తన వీడియోలో పేర్కొన్నది. తన ఫోటో మీడియాలోరాగానేతనతోమాట్లాడేందుకు ఓ జర్నలిస్టు ప్రయత్నించినట్లు ఆమె చెప్పింది. ఓ ఫ్రెండ్ కూడా తనతో ఈ అంశంపై మాట్లాడేందుకు ఆసక్తి చూపినట్లు పేర్కొన్నది. మోడల్ లారిసా నేరి తన ఇన్‌స్టాగ్రామ్‌లో కూడా ఓ పోస్టు పెట్టింది. ఇది చాలా క్రేజీగా ఉందని, తానుఇండియాలో ఫేమస్ అయ్యానని, ఓ అదృశ్య బ్రెజిల్ మోడల్‌గా ఫేమస్ అయినట్లు ఆమె పేర్కొన్నది. వాస్తవానికి లారిసా మోడల్ కాదు. ఆమె సాధారణ మహిళే అని తెలుస్తోంది. హెయిర్ డ్రెస్సర్‌గా పనిచేస్తున్నది. ఓ ఫ్రెండ్ కోసం ఫోటో దిగితే దాన్ని ఆన్‌లైన్‌లో అందరూ వాడుకుంటున్నట్లు తెలుస్తోంది. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో లారిసా లాంటి ఫేక్ ఓట్లతో బిజెపి గెలిచినట్లు రాహుల్ గాంధీ పేర్కొన్నారు.


SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS36T 0223 | Srinu Soudabaina | AL DOST | 2018 |
| 2 | TS30 9554 | Shanker Gajula | JOHN DEERE 5310 HARVESTER | 2017 |
| 3 | TS05UA 2829 | Namala Akhila | CHEVROLET TAVERA NEO-P | 2014 |
| 4 | TG27 7287 | Jeedi Niranjan | ZEST 1.3LXE QUADRAJET 75PS DIESEL 5 SEATER | 2017 |
| 5 | TS27D 7039 | Praveena Dudekula | EICHER 380 | 2018 |
| 6 | TS16EN 5372 | Jamandla Usha Sri | JOHN DEERE 5310 HARVESTER | 2017 |
| 7 | TS03EH 3726 | Pradeep Bandi | SONILIKA DI 42 RX | 2015 |

AUCTION DATE:08-11-2025
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : వేలం తేది ప్రకటన నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును
SHRIRAM FINANCE LIMITED
H.No.6-2-7/35-B, 3rd Floor, Hyderabad Raod, Jangaon. Cell - 9985217519 , 98499 11793



SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS05UF 1175 | Devika Pallapu | MARUTHI ERTIGA BS6 CNG-P | 2022 |
| 2 | TS30T 1678 | Nirmala Badavath | MAHINDRA JEETO-11HP | 2017 |
| 3 | TS25T 1975 | Alakumtlla Raju | AL 2518T IL FBT-T | 2018 |
| 4 | AP27TU 3195 | Subhash Jerupothuls | MAN CLA 25.250 FBT-T | 2012 |
| 5 | TS25A 2622 | Sampath Alakunta | TIAGO XZ PLUS REVOTRON PETROL 5 SEATER | 2017 |
| 6 | TS03EU 9257 | Mandala Mahender | SWARAJ 963 COMBINE HARVESTER | 2018 |
| 7 | AP36AE 6927 | Rajesh Jakkula | JOHN DEERE 5310 | 2009 |
| 8 | TS24T 0639 | K Narasimha Swamy | AL 3116 IL FBT-T | 2016 |

AUCTION DATE: 08-11-2025
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును
SHRIRAM FINANCE LIMITED
D.NO : 24-7-29,1st Floor, Fathima Complex, Fathimanagar, Kazipet, Cell :9989809938, 9989313186

ప్రజాపక్షం
శుక్రవారం, 07 నవంబరు

# ట్రంప్‌కు తొలి హెచ్చరిక

అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో నవంబర్ 5 అర్ధరాత్రికి వెలువడిన 4 ఎన్నికల ఫలితాలు డెమొక్రాట్లను వరించాయి. ఫలితాల్లో ఎటువంటి గందరగోళం లేదు. న్యూజెర్సీ, వర్జీనియా గవర్నర్‌లుగా, అతిపెద్ద న్యూయార్క్ నగరం మేయర్‌గా డెమొక్రాటిక్ అభ్యర్థుల నిర్ణయాత్మక విజయంతోపాటు, కాలిఫోర్నియాలో జిల్లాల పునర్విభజనకు డెమొక్రాట్ల ప్రతిపాదనను, పెన్సిల్వేనియా కీలకమైన సుప్రీంకోర్టు సీట్లను వారు నిలుపుకోవటం అధ్యక్షుడు డోనాల్డ్ రెండవ టరం ఆర్థిక, వలస ప్రజలపట్ల విధానాలకు, ఒంటెత్తుపోకడలకు చెంపపెట్టు. నెలరోజులపైబడి కొనసాగుతున్న 'షట్ డౌన్' (బడ్జెట్ ఆమోదం పొందనందున ప్రభుత్వ ఆర్థిక కార్యకలాపాలు బంద్)కూడా ఓటర్లను ప్రభావితం చేసింది. వీటన్నిటిలోనూ న్యూయార్క్ మేయర్‌గా జొహ్రాన్ మమ్‌దానీ గెలుపునకు విశేష ప్రాధాన్యత ఉంది. ఆయన, వర్జీనియాలో గవర్నర్‌గా ఎన్నికైన ఘజాలా హష్మి భారతీయ మూలాలు గలవారు కావటం, పైగా ముస్లింలు కావటం భారతీయులందరికీ (ముస్లింలను ద్వేషించే మోదీ అండ్ కో కు తప్ప) సంతోషదాయకం. 2024 అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ వర్జీనియాను 5.7 పాయింట్లతో, న్యూజెర్సీని 5.9 పాయింట్లతో కోల్పోయారు. కాగా ఈ ఎన్నికల్లో డెమొక్రాట్లు వర్జీనియాను 15శాతంపైగా పాయింట్లతో, న్యూజెర్సీని 13శాతం పాయింట్లతో నిలుపుకోవటం ట్రంప్ ప్రతిష్ట ఎంతగా దిగజారిందో ఊహించుకోవచ్చు. మమ్‌దానీకి 'కమ్యూనిస్టు' ముద్రవేస్తూ అతన్ని గెలిపిస్తే న్యూయార్క్‌కు ఫెడరల్ నిధులు నిలుపు చేస్తానని ట్రంప్ హెచ్చరించినప్పటికీ ఓటర్లు బెదిరిపోలేదు. 20లక్షలకుపైగా ఓట్లు పోలైన న్యూయార్క్‌లో పోటీ డెమొక్రటిక్ అభ్యర్థి క్యూమోపై మమ్‌దానీ ఆధిక్యత 9శాతం. రిపబ్లికన్ అభ్యర్థిది సుదూర మూడవస్థానం.

న్యూయార్క్‌లో చారిత్రక విజయం సాధించిన యువకుడు జొహ్రాన్ మమ్‌దానీ డెమొక్రటిక్ సోషలిస్టు అభ్యర్థి. అతని విజయం డెమొక్రటిక్ పార్టీలో బెర్నీ శాండర్స్ గ్రూపుకు చెందిన వామపక్షవాదులకేగాక, యూరప్, లాటిన్ అమెరికాల్లోని వామపక్ష పార్టీలకు కూడా పెద్ద ప్రోత్సాహంగా పనిచేస్తుంది. న్యూయార్క్‌లో ఎన్నికల ప్రచారం ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. యూరప్, లాటిన్ అమెరికాల్లోని అనేక వామపక్ష పార్టీలు ప్రచారాన్ని చూడటానికి, 34ఏళ్ల చిచ్చరపిడుగు జొహ్రాన్ మమ్‌దానీతో అభిప్రాయాలు ఇచ్చిపుచ్చుకోవటానికీ తమ నాయకులను పంపాయి. పార్టీ ప్రైమరీలో పార్టీ అభ్యర్థిగా మమ్‌దానీ ఎన్నికైన రోజునుంచే మితవాదులు దాడి ఎక్కుపెట్టారు. అయితే తాను ముస్లింనని, సోషలిస్టునని ఆయన దాపరికం లేకుండా, నిర్మొహమాటంగా చెప్పుకున్నాడు. తన కార్యక్రమం ప్రాతిపదికపై మమ్‌దానీ విజయం యూరప్‌లో బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ లెఫ్ట్‌కు పెద్ద ప్రోత్సాహం. బ్రిటన్‌లో జెరిమీ కోర్బిన్, జరా సుల్తానా పాలక లేబర్ పార్టీ నుంచి బయటకు వచ్చి సొంత పార్టీ పెడుతున్నారు. దాని తాత్కాలిక పేరు 'యువర్ పార్టీ'. ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థకు అతిపెద్ద పీఠమైన న్యూయార్క్‌లో మమ్‌దానీ విజయం తమ లెఫ్ట్ కార్యక్రమంతో ముందుకెళ్లటానికి కోర్బిన్, జరాల్లో విశ్వాసం పెంపొందిస్తున్నది. అదేవిధంగా జర్మనీలోని లెఫ్ట్‌పార్టీ డి లింకే(మాజీ కమ్యూనిస్టుల పార్టీ) తమ నాయకులను న్యూయార్క్‌కు పంపింది. ఫ్రెంచి కమ్యూనిస్టులు, సోషలిస్టులకు మమ్‌దానీ గెలుపు ఉత్సాహం కలుగజేసింది. రాజకీయ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ఫ్రాన్స్‌లో 2027లో అధ్యక్ష ఎన్నికలు జరుగుతాయి. అధ్యక్షుడు ఇమాన్యూల్ మక్రాన్ పోటీ చేయటం లేదు. స్పెయిన్, ఆస్ట్రియా, పోర్చుగల్ కమ్యూనిస్టుల కార్యక్రమం మమ్‌దానీ కార్యక్రమంతో సారూప్యత కలిగి ఉన్నందున వారూ ప్రేరణ పొందుతున్నారు.

ప్రజల్లో అసంతృప్తి ఉన్నప్పుడు వారికి నచ్చే విధాన ప్రకటనలతో ఎన్నికల్లో విజయం సాధించటం వేరు, ఆ వాగ్దానాలను అమలు జరపటం ఓ సవాలు. సంపన్నులపై, కార్పొరేట్‌లపై పన్నుల పెంపుదల వాగ్దానం, ట్రంప్ ఆర్థిక సహాయ నిరాకరణ పరిస్థితుల్లో మమ్‌దానీకి కూడా అటువంటి స్థితి ఎదురుకానుంది. సొంత పార్టీలోని అసమ్మతివాదులను ఒక తాటిపైకి తేవటం మరో పరీక్ష. డెమొక్రాట్లకు అసలైన పరీక్ష 2026 మధ్యంతర ఎన్నికల్లో రానున్నది. ప్రస్తుతం ప్రతినిధుల సభలో రిపబ్లికన్‌లు 220, డెమొక్రాట్లు 215; సెనేట్‌లో బలాబలాలు అదే వరుసలో 53; 47. జీవనవ్యయాన్ని పెంచిన ట్రంప్ విధానాలపట్ల ఓటర్లలో అసంతృప్తి కూడా డెమొక్రాట్లకు తోడ్పడింది. వచ్చే సంవత్సరంలో ట్రంప్ తన విధానాల్లో కొన్ని మార్పులు ప్రవేశపెట్టనూవచ్చు. మమ్‌దానీ తన వాగ్దానాలను – ఇళ్ల అద్దెలు స్తంభింపజేయటం, ఉచిత బస్ ప్రయాణం, కార్మిక కుటుంబాల జీవన వ్యయం తగ్గుదల అమలు చేయగలిగితే అవి ప్రగతిశీలురకు దేశవ్యాప్తంగా నమూనా అవుతాయి. ఏది ఏమైనా ఒకటి మాత్రం స్పష్టం. ఏడాదిక్రితం అధ్యక్ష ఎన్నికల్లో కమలా హారిస్ ఓటమి తర్వాత డెమొక్రటిక్ పార్టీ నావికుడులేని ఓడగా స్తబ్ధతలో ఉంది. ప్రస్తుత ఎన్నికల ఫలితాలు పార్టీని ఉత్సాహపరుస్తాయి. ఓటర్లలో వచ్చిన తరం మార్పును గమనించి యువతరాన్ని ప్రోత్సహిస్తే పార్టీ త్వరగా కోలుకుంటుంది.

# ముట్టడిలో సమానత్వం.. ప్రమాదంలో ప్రజాస్వామ్యం...



డి.రాజా
సిపిఐ ప్రధాన కార్యదర్శి

1917లో జరిగిన రష్యన్ విప్లవం కేవలం రష్యా రాజకీయ పటాన్ని తిరగరాయడమే కాకుండా, ఖండాంతరాలలో ప్రకంపనలను సృష్టించింది. శతాబ్దాలుగా దోచుకోవడం, అణచివేత, నిమ్నోన్నత సామాజిక నిబంధనలపై ఆధారపడిన వలస సామ్రాజ్యాల పునాదులను కదిలించింది.

మానవాళిలో అధిక భాగం విదేశీ పాలన లేదా సామ్రాజ్య ఆధిపత్యంలో నివసించిన సమయంలో, విముక్తి, విమోచన, సమానత్వం సాధించడానికి విప్లవంలో కలిసిరావాలనే స్పష్టమైన పిలుపు పెట్రోగ్రాడ్ వీధులను దాటి చాలా దూరం ప్రయాణించింది.

వలస ప్రపంచంలో, అది బలహీనమైన నాడిని తాకింది. 1900ల ప్రారంభ దశాబ్దాల నాటికి, యూరోపియన్ వలసవాదం ప్రపంచంలోని 80 శాతం భూభాగానికి విస్తరించింది. ప్రపంచ జనాభాలో అత్యధికులు వలస పాలన పీడనలో బలవంతంగా ఉండటాన్ని ఆ ఆధిపత్యం సూచిస్తుంది. బానిసత్వంలో ఉన్న ఈ పరిస్థితులు సామాన్యమైనవి కావు. అలాంటివారు ఆసియా, ఆఫ్రికా, కరేబియన్ అంతటా కోట్లమంది నివసించారు. ఆ సందర్భంలో రష్యన్ విప్లవం ప్రపంచాన్ని కుదిపేసిన భూకంపంలా అనిపించింది, పాత వ్యవస్థను తారుమారు చేసి, అణచివేతకు గురైన వారికి ఆశను అందించింది.

అదే సమయంలో, విప్లవం లోతైన ప్రతిధ్వని విదేశీ పాలనను మాత్రమే కాకుండా వలసవాదంలో వృద్ధి చెందిన నిర్మాణాత్మక ఆధిపత్య శ్రేణులను కూడా సవాలు చేస్తుందనే వాగ్దానంలో ఉంది. భారతదేశంలో దశాబ్దాల బ్రిటీష్ పాలన అంటే ఆర్థిక దోపిడీ మాత్రమే కాదు, మానవ శ్రమను పీల్చిపిప్పిచేయటం, వనరులను స్వాధీనం చేసుకోవడం, కుల, మత, పితృస్వామ్య వ్యవస్థలతో చేతులు కలపడం. అది వలసపాలనలో మగ్గుతున్న ప్రజల హృదయాల్లో విప్లవ జ్వాల రగిలింది. భారతదేశ ప్రజలు బాహ్య పాలకుల కొరడా దెబ్బతో మాత్రమే కాకుండా, లోతుగా పాతుకుపోయిన సామాజిక ఆధిపత్య శ్రేణుల కింద కూడా బాధలు పడుతున్నారు. భారతదేశంలో కుల పీడన, వివక్ష, హింస మన గణతంత్రానికి కళంకంగానే ఉంది

2023లో నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) నివేదిక ప్రకారం, 2023లో షెడ్యూల్డ్ కులాల (ఎస్‌సి) వ్యక్తులపై నేరాలకు పాల్పడినందుకు 57,789 కేసులు నమోదయ్యాయి. ఇవి ప్రతి సంవత్సరం పెరుగుతున్నాయి. షెడ్యూల్డ్ తెగల (ఎస్‌టిల)పై నేరాలు గత సంవత్సరంతో పోలిస్తే 28.8 శాతం పెరిగాయి, 2023లో 12,960 కేసులు నమోదయ్యాయి.

ఇవి కేవలం సంఖ్యలు మాత్రమే కాదు, ఇవి కుల పీడన రోజువారీ జీవితాన్ని విషపూరితం చేస్తున్న సమాజానికి సామూహిక సాక్ష్యం. వలస పాలన మన దేశంలో అధికారికంగా ముగిసి ఉండవచ్చు. కానీ అణచివేత వ్యవస్థలు, అంటరానితనం, కుల వివక్ష, హింస ఇంకా కొనసాగుతున్నాయి. మన దేశంలో కుల ఆధారిత విద్వేషం ఎంతగా పెరిగిందంటే, ఒక వ్యక్తి సాక్షాత్తు భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్ పై బూటు విసిరాడు. గవాయ్ దళిత సమాజానికి చెందినవారు. ఆ చర్యను సనాతన ధర్మాన్ని కాపాడుకోవడానికి తనకు వచ్చిన దైవిక పిలుపుకు ప్రతిస్పందనగా దాడికి పాల్పడిన వ్యక్తి సమర్థించుకున్నాడు. ఇది భారతదేశంలో మితవాద ఫాసిస్ట్ శక్తులు సమర్థిస్తున్న మనువాది అణచివేత వ్యవస్థకు రుజువు.

కార్పొరేట్ లాభం కోసం గిరిజనులను పారద్రోలటం, వనరులను స్వాధీనం చేసుకోవడం కూడా అంతే దుర్భరమైనది. ఇది వలస పాలన రోజులను పోలి ఉంటుంది. ఆదివాసుల భూమిని దొంగిలించినప్పుడు, అడవులను నాశనం చేసినప్పుడు, హక్కులను విస్మరించినప్పుడు విముక్తి వాగ్దానం నిరాకరించబడుతుంది. ఈ సమాజాలు భారతదేశంలో నిర్మూలనను సూచిస్తాయి, అడవులు కొద్దిమంది లాభాలు పొందే, అధిక శాతం ప్రజలు తొలగించబడే స్థలాలుగా మారతాయి. వారి అణచివేత క్రమపద్ధతిలో పాతుకుపోయింది. తరచుగా 'అభివృద్ధి' అనే భాషలో సమర్థించుకోబడుతుంది.నిర్లజ్జగా చేసే ఈ దోపిడీకి వ్యతిరేకంగా మాట్లాడే వారిని నక్సల్స్, మావోయిస్టులుగా ముద్రవేస్తూ, కార్పొరేట్లను రక్షిస్తున్నారు. దీని అర్థం వలసపాలన దోపిడీ తర్కం సజీవంగా ఉంది. కాకపోతే దానికి కొత్త పూతపూశారు.

మహిళలపై హింస, సంప్రదాయం, సంస్కృతి,'భారతీయత' పేరుతో పితృస్వామ్య గృహిణి పాత్రలలో మహిళలను పరిమితం చేయాలనే సైద్ధాంతిక ఒత్తిడి సమానత్వాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుంది. 2023 లో మహిళలపై 4.48 లక్షల నేరాలు జరిగినట్లు ఎన్‌సిఆర్‌బి నివేదించింది. ఇది దాదాపు ప్రతి నిమిషం మహిళలపై జరుగుతున్న నేరాలను సూచిస్తుంది! ఇవి హింసకు సంబంధించిన వేర్వేరు సందర్భాలు కావు, అవి వ్యవస్థాగతమైనవి, సంస్థాగతీకరించబడినవి. అవి మానవాళిలో సగం మంది ఇప్పటికీ పూర్తిస్థాయి పౌరసత్వం, స్వయంప్రతిపత్తి కోసం అర్రులు చాస్తున్న ప్రపంచాన్ని ప్రతిబింబిస్తాయి.



**కామ్రేడ్ లెనిన్ మార్గదర్శకత్వంలో జరిగిన చారిత్రక విప్లవాన్ని గుర్తుచేసుకుంటూ, 2025 నవంబర్ 18న సామాజిక న్యాయం, సమానత్వం కోసం ప్రారంభించబడే ప్రచారంలో పాల్గొనాలని, ఇందుకు నడుం బిగించాలని దేశ ప్రజలకు సిపిఐ పిలుపునిస్తోంది.**

ప్రస్తుత కాలంలో మతపరమైన మైనారిటీలకు భయం, అనిశ్చితి సాధారణం. వివక్ష, హత్యాకాండ, ''బుల్డోజర్ జస్టిస్'' అని పిలవబడేవి సాధారణీకరించబడడం ఆందోళన కలిగించే విషయం. మైనారిటీ వర్గాలను లక్ష్యంగా చేసుకున్న మూకహత్యలు, గోరక్షణకు కాపలా పేరుతో హింసాకాండ, హింసకు పాల్పడేవారికి శిక్ష విధించబడకపోవడం గురించి వార్తలు వినవస్తున్నాయి. రాజ్యం ప్రేరేపించే లేదా వ్యూహాత్మకంగా ప్రోత్సహించే హింస సమానత్వం హృదయాన్ని బలంగా తగిలింది. ఒక సముదాయం మరొక సముదాయంపై ఆధిపత్యం చెలాయించడానికి, హింసించడానికి లేదా బెదిరించడానికి అనుమతించే సమాజం నిజమైన అర్థంలో గణతంత్రం కాజాలదు. ఇది ఆధిపత్యం కొత్త ముసుగులో పునరుత్థానం అవ్వడమే అవుతుంది. ఈ నిమ్నోన్నత క్రమం జీవన భౌతిక పరిస్థితులు, జీవనోపాధి, గౌరవంలో పాతుకుపోయాయి. శ్రమ, ఉత్పత్తి, ఆలోచనలు, జ్ఞానం చివరకు మానవజాతి కూడా క్రమానుగతంగా వర్గీకరించబడింది. అన్యాయం అపరిమితంగా మారుతుండగా, న్యాయం చీకట్లో దారి తప్పుతుంది. నేడు మనకు తెలిసిన సత్యానంతర ప్రపంచం సమష్టి నిరాశకు సాక్ష్యమిస్తుంది. కులం, జాతి, లింగం, మతతత్వం అనే అధికార అసమానతలలో పాతుకుపోయిన ఈ అణచివేత రూపాల నుండి ఒకరు వెనక్కి తగ్గినప్పుడు, ఒక నమూనా ఉద్భవిస్తుంది. ప్రస్తుత వ్యవస్థలు సమానత్వం, సంఘీభావం, న్యాయం కంటే నిమ్నోన్నత క్రమంలో ఆధిపత్యం, మినహాయింపు, మతతత్వ నియంత్రణను బలోపేతం చేస్తున్నాయి. సమానత్వం, సంఘీభావం, న్యాయం కచ్చితంగా రష్యన్ విప్లవం ప్రకటించిన భావాలు; భారత రిపబ్లిక్ తన రాజ్యాంగంలో లిఖించిన భావాలు. ఈ రోజున ఈ భావాలతో వైరుధ్యం చాలా స్పష్టంగా కనిపిస్తున్నది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, భారతీయ జనతాపార్టీ (దుష్ట) పాలన కింద నిమ్నోన్నత ఆధిపత్య క్రమం, మినహాయింపు, మతతత్వ అనే సంస్థలు సహించబడటమేగాక, మతోన్మాద ఫాసిస్టు ఎజండాకు ఉపకరించేటట్లు వాటిని తీర్చిదిద్దుతున్నారు, ఉపయోగిస్తున్నారు, ధైర్యం నూరిపోస్తున్నారు. పెరుగుతున్న మతతత్వ విభజనతో మైనారిటీ రక్షణ బలహీనపడింది. కులం, లింగ ఆధిపత్య క్రమాలను ఎన్నికల రాజకీయాల్లో, విధాన చట్రాలలో ఆయుధాలుగా మార్చారు. సమానత్వాన్ని అమలు చేయడానికి రూపొందించబడిన నిర్మాణాలు సమానత్వాన్ని వ్యతిరేకించే వారిచే ఆక్రమించబడినప్పుడు, మన రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య ప్రాథమిక సూత్రాలు ముట్టడిలో ఉన్నట్లే. సమాజానికి, దేశానికి ఈ ప్రమాదం ఎందుకు పొంచి ఉంది? ఒక పద్ధతి ప్రకారం మినహాయింపు, నిమ్నోన్నతాల ప్రాతిపదికపై ప్రత్యేక హక్కు , ఎంపిక చేసిన న్యాయంపై నిర్మించబడిన సమాజం తనను తాను నిలబెట్టుకోలేదు. తరగతి, కులం, మతం, లింగం ప్రాతిపదికగా సామాజిక వివక్ష విశ్వాసాన్ని తగ్గిస్తుంది, సామూహిక లక్ష్యాన్ని క్షీణింపజేస్తుంది , సామాజిక ఒప్పందాన్ని బలహీనపరుస్తుంది. సమాజంలోని విస్తృత విభాగాలను వెనక్కు పెట్టినపుడు ఆర్థిక వృద్ధి డొల్లగా మారుతుంది. పౌరులు వాస్తవానికి సమాన హక్కులను అనుభవించనప్పుడు ప్రజాస్వామ్యం గుల్లగా మారిపోతుంది. అస్థిత్వం సంఘీభావానికి ఆధారం కాకుండా విభజన ఆయుధంగా మారినప్పుడు దేశం బీటలు వారుతుంది. కాబట్టి, దానిని ఐక్యంగా ప్రతిఘటించాలి, ఓడించాలి.

రష్యన్ విప్లవం చారిత్రక పాఠం కేవలం ఒక సామ్రాజ్యం పతనం కాదు. అణచివేయబడినవారు ఐక్యమైనప్పుడు, సమానత్వం ప్రత్యేక సౌకర్యంగా కంటే హక్కుగా మారినప్పుడు, అణచివేత సంస్థలను పడగొట్టవచ్చు. నవంబర్ 18న దేశవ్యాప్తంగా నిరసనలు, జన సమీకరణలకు భారత కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చింది. సామాజిక న్యాయం, సమానత్వం కోసం, కుల వివక్ష, నిమ్నోన్నత ఆధిపత్య క్రమానికి వ్యతిరేకంగా, మతతత్వానికి వ్యతిరేకంగా, మైనారిటీలను లక్ష్యంగా చేసుకోవడానికి వ్యతిరేకంగా, పితృస్వామ్య అణచివేతకు వ్యతిరేకంగా, మహిళలపై బహుముఖ హింసకు వ్యతిరేకంగా, ఈ సమీకరణలు ముఖ్యమైనవి. ఎందుకంటే అవి మన గణతంత్ర వాగ్దానాన్ని సజీవంగా ఉంచుతాయి: కులం, తరగతి, లింగం లేదా మతంతో సంబంధం లేకుండా పౌరులందరూ గౌరవం, హక్కులలో సమానంగా ఉంటారు. సమానత్వమనే రాజ్యాంగ వాగ్దానాన్ని కాపాడటానికి పెద్ద సంఖ్యలో సమీకృతులు కండి. అణచివేతకు గురైనవారు విడివిడిగా కాకుండా ఐక్య ఉద్యమంగా కలిసి నిలబడినప్పుడు, వారు మార్పుకు చోదక శక్తిగా మారతారు. **మనం తిరిగి పొందవలసిన వారసత్వం** ఇది:

విముక్తి స్ఫూర్తి ఒక శతాబ్దం క్రితం రగిలింది, అది నేటికీ మనల్ని ఆహ్వానిస్తోంది.

*ఫాసిజానికి మరణం! విప్లవం వర్ధిల్లాలి!*


*ఐక్యమైన ప్రజలు ఎల్లప్పుడూ విజయం సాధిస్తారు!*

# కేన్సర్‌ను తొలి దశలో గుర్తిస్తే చికిత్సతో పూర్తిగా కోలుకోవచ్చు!

శరీరంలోని ఏదైనా ఒక అవయవ భాగంలో కణజాలం అపరిమితంగా, నియంత్రణ లేకుండా పెరగడం, ఇతర కణజాలాలకు వ్యాపించడం కారణంగా ఆయా భాగాల్లో గడ్డలు లేదా రాచపుండు ఏర్పడడాన్ని కేన్సర్ వ్యాధిగా పిలుస్తారు. అతి ప్రమాదకర, ప్రాణాంతక కేన్సర్‌కు సరైన చికిత్స లేదు. తొలి దశలో గుర్తించడం వల్ల చికిత్సతో నయం చేయవచ్చు. కేన్సర్ రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడమే మన చేతుల్లో ఉందని గమనించాలి. కేన్సర్ పట్ల పూర్తి అవగాహన, తీసుకోవలసిన జాగ్రత్తలు, చికిత్సా మార్గాలు, తొలి దశలో గుర్తించడం లాంటి పలు అంశాలను చర్చించే వేదికగా ప్రతి ఏట 07 నవంబర్ రోజున జాతీయ కేన్సర్ అవగాహన దినం (నేషనల్ క్యాన్సర్ అవేర్నెస్ డే)ను 2014 నుంచి పాటించుట ఆనవాయితీగా మారింది.

**కేన్సర్లు పలు రకాలు:**

కేన్సర్ చికిత్సలో వినియోగపడే రేడియేషన్ థెరపీకి అవసరమైన రేడియం, పొలోనియం రేడియోధార్మిక మూలకాలను కనుగొన్న నోబెల్ బహుమతి




గ్రహీత మేడమ్ క్యూరీ జన్మదినం సందర్భంగా 07 నవంబర్ రోజునుజాతీయ కేన్సర్ అవగాహన దినంగా పాటిస్తున్నాం. కేన్సర్‌లు వందకు పైగా రకాలున్నాయి. వీటిలో రొమ్ము, నోటి, గర్భాశయ, ఊపిరితిత్తుల, క్లోమ, ప్రోస్టేట్, ఎముకలు, రక్తం లాంటి అవయవాల కేన్సర్లు ప్రధానమైనవి. కేన్సర్లలో కార్సినోమా (చర్మ, రొమ్ము, క్లోమ, ఇతర గ్రంథులకు), సర్కోమా (రక్తనాళాల, ఎముకల, కండరాల), మెలనోమా (చర్మ, పిగ్మెంట్), లింఫోమా (లింఫోసైట్స్), ల్యుకేమియా (రక్తం) అనబడే ముఖ్య వర్గాలు ఉన్నాయి. కేన్సర్లలో క్లోమ లేదా పాంక్రియాటిక్ క్యాన్సర్ అతి ప్రమాదకరమైనదిగా గుర్తించబడింది. భారత్‌లో ప్రతి రోజు 1,300మంది కేన్సర్ బారినపడి పడి మరణిస్తున్నారు. మన దేశ పురుషుల్లో ఊపిరితిత్తుల క్యాన్సర్, మహిళల్లో గర్భాశయ క్యాన్సర్లు అధికంగా నమోదు అవుతూ, ప్రాణాంతకంగా మారుతున్నాయి.

**భారత్‌ను కబళించ చూస్తున్న కేన్సర్ భూతం:**

ప్రపంచవ్యాప్తంగా అసంక్రమిత వ్యాధులతో 71 శాతం మరణాలు నమోదు కాగా భారత్‌లో మాత్రం 63శాతం మరణాలు సంభవిస్తుండగా, ఇందులో 9 శాతం మరణాలు కేన్సర్ వల్లనే నమోదు అవుతున్నాయి. 1975లో భారత ప్రభుత్వం ప్రారంభించిన జాతీయ కేన్సర్ నియంత్రణ ప్రోగ్రామ్ ద్వారా కేన్సర్‌కు వైద్య సదుపాయాలను దేశవ్యాప్తంగా నెలకొల్పడం, 1984–85 నుంచి నివారణ చర్యలు, తొలి దశలో గుర్తించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, హంగేరి, బెల్జియం, కెనడా, డెన్మార్క్, ఐర్లాండ్, అమెరికా లాంటి దేశాల్లో క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు అధికంగా ఉన్నట్లు తేలింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరాల ప్రకారం గరిష్టంగా 8.17శాతం కేన్సర్ రోగులు భారత్‌లోనే ఉన్నట్లు పేర్కొనబడింది. భారత్‌లో ప్రతి ఏట 1.1 మిలియన్ల కొత్త కేసులు బయట పడుతుండడం ప్రమాదకర హెచ్చరికగా భావించాలి. మన దేశంలో ప్రతి 8 నిమిషాలకు ఒక గర్భాశయ కేన్సర్ రోగి మరణిస్తున్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. కేన్సర్ కేసు ల్లో 66 శాతం వరకు ముదిరిన తర్వాతనే బయట పడడంతో ఆ రోగులను కాపాడడం కష్టం అవుతున్నది. భారతీయుల్లో ప్రతి 10 మందిలో ఒక్కరికి జీవితకాలం లో క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని, చనిపోయిన ప్రతి 15 మందిలో ఒక్కరు కేన్సర్ వ్యాధితో మరణిస్తున్నారని తెలుస్తున్నది. పొగాకు ఉత్పత్తుల దురలవాట్లతో నోటి, ఊపిరితిత్తుల కేన్సర్ కేసులు అధికంగా నమోదు కావడంతో పాటు భారతీయ మహిళ ల్లో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు అధికంగా కనిపిస్తున్నాయి. వీటికి తోడు ఆల్కహాల్, మాదకద్రవ్యాలు, ఆహారలేమి, పోషకాహారలోపం, కాలుష్యం లాంటి కారణాలు కూడా కేన్సర్‌కు ఆజ్యం పోస్తున్నాయి.

**కేన్సర్ లక్షణాలు, చికిత్సా మార్గాలు, జాగ్రత్తలు:**

కేన్సర్ వ్యాధికి ఎలాంటి ముందస్తు లక్షణాలు కనిపించని కారణంగా తొలి దశలో గుర్తించడం కష్టంగా తోస్తున్నది. కేన్సర్ రోగ లక్షణాల్లో విరోచనాలు, దగ్గు, చర్మంపై మచ్చలు, ఉమ్మితే రక్తం పడడం, రక్తహీనత, రొమ్ములో గడ్డలు, మూత్ర సంబంధ మార్పులు, మలం లో రక్తం పడడం, బీజాల్లో గడ్డలు లాంటివి పేర్కొనబడినవి. భారతంలో దాదాపు 50 శాతం కేన్సర్ కేసుల్లో రొమ్ము, గర్భాశయ, ఊపిరితిత్తుల, జీర్ణకోశ, పెద్ద పేగు కేన్సర్లు బయట పడుతున్నా యి. కేన్సర్ ప్రధాన చికిత్సల్లో ఇమ్యునోథెరపీ, రేడియేషన్ థెరపీ, కీమోథెరపీ, హార్మోన్ థెరపీ, టార్గెటెడ్ థెరపీ, స్టెమ్ సెల్ మార్పిడి, శస్త్ర చికిత్స, ప్రిసిషన్ మెడిసిన్ లాంటివి బహుళ ప్రచారంలో ఉన్నాయి. శరీర బరువు నియంత్రణ, పోషకాహారం, శారీరక శ్రమ, టీకాలు, క్రమం తప్పకుండా చెకప్‌లు తీవ్రమైన ఎండ పడకుండా చూసుకోవడం, పొగాకు/ఆల్కహాల్ దురలవాట్ల కు దూరంగా ఉండడం లాంటి జాగ్రత్తలు కేన్సర్ రోగం బారినపడకుండా అడ్డుకుంటాయి. శరీరంలోని ఏ భాగంలోనైనా గడ్డలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం తప్పనిసరి అని గమనించాలి. కేన్సర్ పట్ల అవగాహన కలిగి ఉండడం, జీవనశైలిని మార్చుకోవడం లాంటి చర్యలతో కేన్సర్‌ను తిప్పికొడుతూ కేన్సర్ లేని ప్రపంచాన్ని నిర్మించే ప్రయత్నాలు చేద్దాం.

**(07 నవంబర్ జాతీయ కేన్సర్ అవగాహన దినం సందర్భంగా)**

# 108 ఏళ్ల నవంబర్ విప్లవం : కొత్త వ్యూహాల ఆవశ్యకత



కృష్ణ ఝా


1917లో రష్యన్ విప్లవం విజయం సాధించిన నవంబర్ 7వ తేదీ సమీపించినందున, అనేకానేక సంవత్సరాలు, శతాబ్దాలుగా వచ్చిన మార్పులను అర్థం చేసుకోవడానికి మనకు మార్గనిర్దేశం చేసే ప్రాథమిక భావనలను పునర్నిర్వచించాల్సిన అవసరం ఏర్పడింది. శాస్త్రీయ సాంకేతిక పరివర్తన ప్రారంభంతో కొత్త ప్రపంచం ఆవిష్కృతమవుతోంది. ఈ ప్రపంచం మానవ శ్రమకు కార్ల్ మార్క్స్ చెప్పిన శాస్త్రీయ నిర్వచనాన్ని కోల్పోతోంది. సరుకు దానిలోని శ్రమ భాగాన్ని కోల్పోతోంది. విలువ సృష్టి దాని ప్రధాన ప్రాముఖ్యతను కోల్పోతోంది. ముడిపదార్థం, శ్రమకు ఉపయోగించే పనిముట్లతో వెచ్చించిన శ్రమ ప్రాతిపదికపై ఒక వస్తువును తయారు చేయటంలో శ్రమకు తక్కువ విలువ ఇవ్వబడుతున్నది. శ్రమ సాధనాలు సాధారణంగా పారిశ్రామిక విప్లవం సమయంలో అభివృద్ధి చెందుతాయి. అలాగే ఉత్పత్తి ప్రక్రియలోనే శ్రమ వాటా తగ్గుతున్నట్లు సంకేతం కనబడుతుంది. ఉత్పత్తి ప్రక్రియ కూడా సంధికాల దశలో ఉంది. కృత్రిమ మేధస్సు (ఎఐ), ఆటోమేషన్ రాజ్యమేలుతున్నాయి. ఇది పారిశ్రామిక విప్లవం మాదిరిగా లేదు. కంప్యూటర్లు , ఎలక్ట్రానిక్స్ ఆధిపత్యం చెలాయించే ప్రపంచం మన చుట్టూ ఉంది.

మనం కొత్త స్థాయిలను అభివృద్ధి చేసే ప్రక్రియలో ఉన్నాము. ప్రత్యేకించి గతితర్కంలో దానంతట అదే పరివర్తన చెంది, రూపుదిద్దుకుంటున్నది. సాఫ్ట్‌వేర్, హార్డ్ వేర్ విరుద్ధమైన స్వభావం కూడా దశలవారీగా మార్పులకు లోనవుతోంది. నెమ్మదిగా పారిశ్రామికీకరణ అనంతర ఉత్పత్తి సాధనాలు, కమ్యూనికేషన్ ప్రవేశిస్తున్నాయి. కంప్యూటర్ కూడా మారుతున్నదనే వాస్తవాన్ని అర్థం చేసుకోవడం కూడా చాలా అవసరం. అది కరిగిపోతోంది. సాఫ్ట్‌వేర్ ద్వారా నడుస్తున్నప్పటికీ కంప్యూటర్ అనేది హార్డ్‌వేర్‌తో తయారు చేయబడింది. భాష వాహకంగా, ఇది సమాజాన్ని, మానవులను, వారి చైతన్యాన్ని కూడా ప్రభావితం చేస్తూనే ఉంటుంది. దానికి ఉన్న వేగం మానవునిపై లోతైన ప్రభావాన్ని చూపుతోంది. ఇది ఇప్పుడు దాదాపు స్వతంత్ర అస్థిత్వాన్ని పొందుతోంది. తొలిసారిగా చరిత్రలో ఒక ముఖ్యమైన మలుపు తీసుకునే దిశగా సమాజం అభివృద్ధి చెందుతోంది.

ఇక్కడ మరో ఆశ్చర్యం కూడా ఉంది. దాదాపు జీవితంలో భాగంగా మారిన కంప్యూటర్, ఉపయోగంలో లేకుండా పోతోంది. మొదట కీ బోర్డు అవసరం లేనిదిగా మారింది. ఇక్కడ పరివర్తన స్పష్టంగా కనపడుతుంది. ఇందుకు మొబైల్‌లు, ట్యాబ్లెట్‌లు, ఐప్యాడ్లు ఉదాహరణలు. యంత్రం నుండి యంత్రం యేతర దిశగా పరివర్తన సాగుతుంది. వాస్తవానికి అన్ని హార్డ్‌వేర్‌లను సాఫ్ట్‌వేర్‌గా మార్చవచ్చు. కంప్యూటర్ లాగా పనిచేసే సాఫ్ట్‌వేర్ బయోఎలక్ట్రానిక్ వ్యవస్థగా మన శరీరంలో భాగమయ్యే దశ రావచ్చు, ఇది 'సమాచార విధానం ఆవిర్భావం'ను సూచిస్తుంది.

ఇది కొత్త అంశంగా సమాచారాన్ని జోడించినప్పటికీ, ఇది ఉన్నత స్థాయిలో పారిశ్రామిక విప్లవం కాదు. వాస్తవం ఏమిటంటే కొత్త పారిశ్రామిక విప్లవం.. పారిశ్రామిక విప్లవంలో పారిశ్రామిక స్వభావాన్ని మారుస్తోంది. దీని ఫలితంగా కొత్త మౌలిక అంశాలతో కూడిన సామాజిక అభివృద్ధి జరుగుతుంది. పారిశ్రామిక అనంతర పురోగతికి కొత్త క్షేత్రాలు ఉద్భవిస్తున్నాయనే అంశాన్ని ఇది తెరపైకి తెస్తుంది. ఇది కొత్త రూపాల ఆగమనానికి సన్నాహకంగా కొత్త 'బహు–కోణాల రూపాల'ను పొందుతుంది. అసాధారణ రీతిలో ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచిన అధిక , మరింత ఉత్పాదక యోగ్యతలతో కూడిన మరొక పారిశ్రామిక విప్లవంగా శాస్త్రీయ సాంకేతిక విప్లవాన్ని(ఎస్‌టిఆర్) తీసుకోవడం కూడా తప్పు అవుతుంది. ఎస్‌టిఆర్ మౌలిక అంశం ఏమిటంటే, ప్రాథమికంగా కమ్యూనికేషన్ ఎలక్ట్రానిక్‌గా మధ్యవర్తిత్వం వహించినప్పుడు, ఇది ఆలోచన, పదార్థం మధ్య, మెదడు, యంత్రం మధ్య సంబంధాన్ని మార్చివేస్తోంది.

ఇప్పటివరకు, మనం విభజించబడిన సమాజంలో జీవిస్తున్నాము. మానవ సంబంధాలు, వాటి సన్నిహిత, ప్రతికూల అంశాలు సున్నితమైన మార్పులకు లోనవుతున్నాయి. ఉత్పత్తి స్వభావంలో మార్పులతో వర్గాలు నెమ్మదిగా తమ ప్రాథమిక స్వభావాన్ని కోల్పోతున్నాయి. ఇది మొత్తం శ్రమ ప్రక్రియను



ప్రభావితం చేస్తోంది. కొత్త పరిణామాలు కార్మికుడిని (కార్మికుల నిర్వచనం ఇప్పటికీ చెల్లుబాటులో ఉన్నట్లయితే) పునరావృత , యాంత్రిక శ్రమ నుండి విముక్తి చేస్తాయనేది నిజం. కార్మికుడు తన స్వంత పాత్రను కూడా పునర్నిర్వచించుకోవాల్సి వస్తుంది. మార్పుకు అనుగుణంగా ఉండటం తప్ప వేరే మార్గం లేదు. సంక్షిప్తంగా, ఉత్పత్తి ప్రక్రియలో శ్రమ తన ప్రధాన స్థానాన్ని కోల్పోవడం అనే ఆలోచనే మార్పుల వరద ద్వారాలను తెరుస్తుంది. శ్రమ పట్ల గౌరవం ఇకపై కార్మికుడిని గర్వపడేలా చేయదు. కొత్త శ్రమ సాధనాలతో ఉత్పత్తి ప్రక్రియలో మార్పు, తద్వారా అతన్ని కఠినమైన శ్రమ నుండి విముక్తి చేయడం కొత్త ఉద్యోగంలో భాగం. వర్గ శత్రువుపై తుది దాడికి నాయకత్వం వహించడానికి శ్రమ గతంలో ఆక్రమించిన స్థానాన్ని, కార్మిక వర్గం గతంలో లభించిన ప్రాముఖ్యతలను కోల్పోతోంది.

ఈ మార్పులన్నీ చాలా వేగంగా వస్తాయి. వివిధ విలువలు, వివరాలలో పరివర్తన, అలాగే మౌలిక ఉత్పత్తి ప్రక్రియ మన చైతన్యం, జీవనశైలిని కూడా ప్రభావితం చేస్తాయి. కానీ శాస్త్ర, సాంకేతికతలు చాలా వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, సమాజం , వ్యవస్థ చాలా నెమ్మదిగా కదులుతుండటం కూడా గమనార్హం. ఆలోచనలు, ప్రపంచ దృక్పథం, విలువలు పరిణతి చెందడానికి, మారడానికి చాలా సమయం పడుతుంది. ఈ రెండింటి మధ్య గతితార్కికత ముందుకు వస్తుంది. పరివర్తనకు అన్వయించుకునేందుకు ఉన్నత నిర్మాణానికి సమయం పడుతుంది. అక్టోబర్ విప్లవం తర్వాత జరుగుతున్న మార్పులను ఇది గుర్తు చేస్తుంది. విప్లవ ప్రక్రియలో లెనిన్ మార్గదర్శకత్వంలో మొత్తం సమాజం భాగస్వామిగా మారి సోషలిస్ట్ సమాజాన్ని నిర్మించడానికి ప్రయత్నాలు ప్రారంభించబడ్డాయి. దశలవారీగా భూ సంస్కరణ, సమష్టి వ్యవసాయం, ప్రైవేట్ ఆస్తి సామాజికీకరణ, నవ సమాజాన్ని, నవ మానవుడిని నిర్మించడానికి , తప్పనిసరైన అలాంటి అనేక మార్పులకు మౌలికాంశాలను సిద్ధం చేశారు.

అయితే, భూస్వామ్య ధోరణులు దీర్ఘ కాలం పాటు కొనసాగాయి. ఇది మితవాద శక్తులు ముందుకు రావడానికి సహాయపడడమే కాకుండా సోషలిస్ట్ సమాజ నిర్మాణంలో అడ్డంకులు సృష్టించింది, బూర్జువా ప్రభావాన్ని ప్రోత్సహించింది. అలాంటి ధోరణులపై నెగ్గేందుకు, లెనిన్ సోషలిస్ట్ వ్యవస్థకు పునాదిని సృష్టించడానికి ప్రయత్నించాడు. అది బూర్జువా ప్రజాస్వామ్య విప్లవం మాత్రమే కావచ్చు. 1917 ఫిబ్రవరిలో, బూర్జువా ప్రజాస్వామ్య విప్లవం సంభవించింది. ఇది లెనిన్ చేసిన గొప్ప పనులలో ఒకటి. దాని ఆచరణాత్మకత ఆగిపోకుండా ఇంకా కొనసాగుతూనే ఉంది. నూతన ఆర్థిక విధానం (ఎన్‌ఇపి) రోజుల్లో ఈ చర్య స్ఫూర్తిని సజీవంగా ఉంచారు.

లెనిన్ మధ్య స్థాయి, చిన్నకారు రైతులకు కూడా రాయితీలు అందించారు. వారి భూమిని, ఆస్తిని ఉంచుకోవడానికి అనుమతించారు. వారి ఉత్పత్తులను ప్రత్యేకించి వారి కోసం నిర్మించిన ప్రైవేట్ మార్కెట్ (రష్యన్‌లో రెనోక్)లో విక్రయించడానికి కూడా అనుమతించారు. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు ప్రపంచవ్యాప్తంగా శ్రామిక ప్రజలకు ఆశాకిరణమైన ఏకైక జ్వాలను అణిచివేసే క్షణం కోసం వేచి ఉన్న రోజులు అవి.

## వృత్తివిద్య కోర్సులతోనే స్వయం ఉపాధి

ప్రజాపక్షం/ఎల్‌బినగర్: వృతి విద్య కోర్సుల వలన యువతకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా లభించే అవకాశం ఉంటుందని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ఇరుకూల రామకృష్ణ అన్నారు. గురువారం బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని సాహెబ్ నగర్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వాసవి క్లబ్ వనిత ప్రశాంత నగర్ తరుపున క్లబ్ అధ్యక్షులు యెండూరి కృష్ణ కుమారి, సుదర్శన రావు దంపతులు సహాకారంతో 12 లక్షల వ్యయంతో ఒకేషనల్ ట్రైనింగ్ హాల్‌ను వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రామకృష్ణ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు వృతి విద్య కోర్సుల వలన అనేక ఉపాధి అవకాశాలు ఎక్కువగా లభించే అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశంను యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు. అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వేణుమాధవ్, వాసతి క్లబ్ సభ్యులు సారాబు, శివ, నాగేశ్వరరావు, మల్లికార్జున, విట్టదురయ్య, వినయ సంతోషి, అల్లాడి పరమేశ్వరరావు, జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్, గోపాల్‌దాస్, రాము తదితరులు పాల్గొన్నారు.

## అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం

ప్రజాపక్షం/కేశంపేట: అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం పనులను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గ్యార సురేష్ ప్రారంభించారు. గురువారం మండల పరిధిలోని కోనాయపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గ్యార సురేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలు కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధిస్తున్నాయనే విషయాన్ని ప్రజలందరు గుర్తించాలని సూచించారు. ఇప్పటికే అనేక గ్రామాల్లో సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం పనులు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. మురుగు ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయించి పనులు చేపట్టే విధంగా కృషి చేస్తుందని వివరించారు. గత పాలకులు పూర్తిగా పట్టించుకోలేదని, దాంతో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని తెలిపారు. సకాలంలో నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సుప్పరి సత్యం, పోరండ్ల మహేందర్, రంగు శ్రీనివాస్, బర్కం జంగయ్య, మారేపల్లి నరసింహా, ఊరుకొండ రాజశేఖర్, రామస్వామిలు పాల్గొన్నారు.

## ఫీజులివ్వకుంటే తిరుగుబాటు

### గన్‌పార్క్ వద్ద విద్యార్థుల ధర్నాలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



ప్రజాపక్షం / ఖైరతాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు చెల్లించకొంటే నిర్లక్ష్యం వహిస్తే నేపాల్, శ్రీలంక తరహాలో విద్యార్థుల నుంచి తిరుగుబాటు తప్పదని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కమిటీల పేరిట కాలయాపన చేస్తూ రూ. 12వేల కోట్ల ఫీజులివ్వకుండా 14 లక్షల 75వేల మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడితే ఊరుకోబోమన్నారు. కాంట్రాక్టర్ల నిధుల కేటాయింపులకు కమిటీలకు అభ్యంతరం లేదన్నారు. తెలంగాణ బిసి విద్యార్థి సంఘం అధ్యక్షులు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్ద విద్యార్థులు నల్లకండువాలు వేసుకొని నిరసన ధర్నా చేపట్టారు. దీనికి శ్రీనివాస్‌గౌడ్, బిసి జెఎసి కో–ఆర్డినేటర్ గుజ్జ కృష్ణ, నందగోపాల్ మద్దతు పలికారు. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఫీజురీయింబర్స్‌మెంట్ స్కీం ఎత్తివేత కుట్రలో భాగంగానే కోతలు, ఆంక్షలు కమిటీల పేరిట ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందని ద్రాక్షగానే మారుతుందన్నారు. వెంటనే ఫీజులివ్వకపోతే రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మారుస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వందలాది మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## రచ్చకెక్కిన మాగంటి కుటుంబ పంచాయితీ

**ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ వివాదంలో రచ్చ**

**శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో విచారణకు మాగంటి మొదటి భార్య మాలినిదేవి, కుమారుడు ప్రద్యుమ్న తారక్, రెండవ భార్య సునీత కుమార్తె దిశ..**




ప్రజాపక్షం/శేరిలింగంపల్లి: మాగంటి సునీతకు మాగంటి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇవ్వడం పై మొదటిభార్య మాలినిదేవి, కుమారుడు ప్రద్యుమ్న తారక్ అభ్యంతరం తెలపడంతో రెండవ భార్య మాగంటీ సునీత కుమార్తె దిశ విచారణకు హాజరయ్యారు. గురువారం శేరిలింగంపల్లి తహసీల్దార్ ఎదుట విచారణకు హాజరు కావాలని తెలపడంతో కార్యాలయానికి మాగంటి మొదటి భార్య మాలినిదేవి, కుమారుడు ప్రద్యుమ్న తారక్, మాగంటి గోపినాథ్ తల్లి మహనందకుమారి హాజరయ్యారు. కాగా, రెండవ భార్య సునీత తరుపున మాగంటి దిశ హాజరయ్యారు. మాగంటి సునీత కుమార్తె దిశ మాట్లాడుతూ మాగంటి సునీత వివాహం 2000 సంవత్సరంలో జరిగినదని, ఆయనకు ముగ్గురు కుమార్తెలు అక్షర, వాత్సల్యా, దిశ అని తెలిపారు. మాగంటి గోపినాథ్ 15 సంవత్సరాలలో జూబ్లీహిల్స్ ఎన్నికల అఫిడవిట్‌లో మాగంటి సునిత పేరుతో పాటు అక్షర, వాత్సల్యా, దిశల పేర్లు మాత్రమే నమోదు చేశారని, మాలినిదేవి గాని ప్రద్యుమ్న తారక్‌ల పేర్లు గాని తెలుపలేదన్నారు. మాలినిదేవి, ప్రద్యుమ్న తారక్‌ల ఇంటి పేరు ఎక్కడ మాగంటి ఇంటిగా పేరు లేదని వారి ఇంటి పేరు కొసరాజు మాలినిదేవి, కోసరాజు ప్రద్యుమ్న తారక్‌లు గా మాత్రమే ఉన్నాయని, మాగంటి గోపినాథ్ మృతి చెందినప్పుడు కూడ ఎవరు రాలేదని తెలిపారు. మాగంటి సునీతతో 2000 సంవత్సరంలో వివాహం జరిగిందని, 25 సంవత్సరాల నుండి లేని వారు ఇప్పుడు కేవలం జూబ్లీహిల్స్‌లో ఎమ్మెల్యేగా పోటీలో ఉన్నారు కాబట్టి రాజకీయాల కోసం తమను రోడ్డుకీడుస్తున్నారని తెలిపారు. మాగంటి గోపినాథ్ తల్లి మహనందకుమారి మాట్లాడుతూ మాగంటి గోపినాథ్‌కు మొదటి భార్య మాలినిదేవియే అని, కుమారుడు ప్రద్యుమ్న తారక్‌లు అని, మాగంటి సునితతో వివాహం జరగలేదని వివరించారు. కనీసం మాగంటి గోపినాథ్ చనిపోయినప్పుడు కూడ ఎటువంటి సమాచారం అందించలేదని, కెటిఆర్ వచ్చిన తర్వాత మాత్రమే తెలిపారన్నారు.మొదటి భార్యను, కుమారుడుని రాకుండా బెదిరించారని తెలిపారు.

## వేధింపుల శారదను విధుల నుండి తొలగించాలి



ప్రజాపక్షం/హైదరాబాద్: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించకుండా విద్యార్థులను మానసికంగా వేధిస్తున్న ఉస్మానియా యూనివర్సిటీ డిప్యూటీ రిజిస్టర్ శారదను విధుల నుంచి తొలగించాలని ఒయు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డి,ఒఎస్‌డి ప్రొఫెసర్ జితేందర్ నాయక్‌ను ఒయు దళిత,వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం కోరింది. ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, పిడిఎస్‌యు విజృంభణ రాష్ట్ర అధ్యక్షుడు అల్లూరి విజయ్, ఎంఎస్‌ఎఫ్ జాతీయ నాయకుడు పల్లెర్ల సుధాకర్, ఎస్‌ఎఫ్‌ఐ ఒయు కార్యదర్శి అజయ్, పిడిఎస్‌యు ఒయు కార్యదర్శి ఆసిఫ్ ,మంద నవీన్, రీసెర్చ్ స్కాలర్ ఆర్. ఎల్ మూర్తి, ఎఐఎస్‌ఎఫ్ ఒయు అధ్యక్షుడు లెనిన్, కిరణ్ కుమార్, ఉదయ్ కుమార్, అశ్వన్, సుమన్, రీసెర్చ్ స్కాలర్ శశితో కూడిన ప్రతినిధి బృందం గురువారం వినతి పత్రం సమర్పించింది.వారు మాట్లాడుతూ డిప్యూటీ రిజిస్టర్ శారద విద్యార్థుల సమస్యలపై సానుకూలంగా స్పందించడం లేదన్నారు. విద్యార్థుల తరపున మాట్లాడడానికి వెళ్లిన ఎఐఎస్‌ఎఫ్ ఒయు నాయకుడు ఉప్పల ఉదయ్ కుమార్ పైన అక్రమంగా కేసు నమోదు చేయడాన్ని ఖండించారు. విద్యార్థి సంఘాల తరపున మాట్లాడే నాయకులపైన అక్రమ కేసులు నమోదు చేయిస్తున్న శారదను తొలగించాలని, ఇప్పటివరకు నమోదు చేసిన కేసులను వెనక్కి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## కార్పొరేట్ శక్తులతో క్షౌర వృత్తికి దెబ్బ : బాలకృష్ణ




ప్రజాపక్షం / ఖైరతాబాద్ : క్షౌరవృత్తిలోకి కార్పొరేట్ శక్తులు ప్రవేశించి నాయీబ్రాహ్మణుల బతుకుదెరువును దెబ్బతీస్తున్నాయని తెలంగాణ నాయీ బ్రాహ్మణ జన జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు ఉప్పునంతల బాలకృష్ణ ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జాగృతి ప్రధానకార్యదర్శి నాగిళ్ల ప్రవీణ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కులధ్రువీకరణ పత్రం ఆధారంగా క్షౌరశాలల ఏర్పాటుకు అనుమతి చేస్తూ ప్రత్యేక జిఒ తేవాలని, అప్పుడే క్షౌర వృత్తికి రక్షణ ఉంటుందన్నారు. తెలంగాణ దేవాదాయశాఖ పరిధిలోని అన్ని ట్రస్టు బోర్డుల్లో నాయీ బ్రాహ్మణులకు అవకాశమివ్వాలని కోరారు. నాయీ బ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమ బోర్డు ఏర్పాటుకు రూ.500 కోట్లు, క్షౌరశాలల ఏర్పాటుకు రూ.5 నుంచి 10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జాగృతి ఉపాధ్యక్షులు భిక్షపతి, సలహాదారు రవి, కార్యదర్శి ప్రభాకర్, కోశాధికారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## యువత అప్రమత్తంగా ఉండాలి

### కొత్తూరు సిఐ నర్సయ్య



ప్రజాపక్షం/కొత్తూరు: ఆన్‌లైన్ మోసాల పట్ల యువత, ప్రజలు అప్రమత్తంగా ఉండేందుకు కృషి చేయాలని కొత్తూరు సిఐ నర్సయ్యసూచించారు. గురువారం కొత్తూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. సిఐ నర్సయ్య మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు డబ్బులను సులభంగా సంపాధించాలనే లక్ష్యంతో ఆన్‌లైన్‌లోని అనేక రకాల యార్డ్స్‌ను తీసుకువస్తారని వివరించారు. అనేక విధాలుగా ఫోన్లు చేసి నమ్మించేందుకు కృషి చేస్తారని, సైబర్ నేరగాళ్ల మాయమాటలను నమ్మి ఎవరు మోసపోవద్దని సూచించారు. ఎంఈఓ అంగూర్‌నాయక్, ఎస్ఐలుసత్యశీలారెడ్డి,గోపాలకృష్ణ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కేశంపేటలో..**

సైబర్ కేటుగాళ్ల పట్ల ప్రజలు ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని కేశంపేట సిఐ నరహరి, ఎస్ఐ రాజ్‌కుమార్ సూచించారు.గురువారంకేశంపేట మండల కేంద్రంలో ప్రజలకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు.

## ప్రతిష్ఠాత్మకంగా వసతి గృహాల నిర్వహణ

### రంగారెడి జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్

ప్రజాపక్షం/రంగారెడ్డి:వసతి గృహాల్లోని విద్యార్థులకు విద్య, వైద్యం, ఆరోగ్యంతోపాటు పౌష్టికాహారాన్ని అందించే విషయంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటుందని జిల్లా అదనపు కలెక్టర్ కె శ్రీనివాస్ అన్నారు. గురువారం విక్టోరియా మెమోరియల్ హోం నందు జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ జిల్లాలోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, సంక్షేమ అధికారులు, గురుకులాల ఆర్‌సిఒలు, డిసిఓలు,విద్యా శాఖల అధికారులతో కలిసి ఫుడ్ సేఫ్టీ,విద్యా విధానం బోధనలు, న్యూట్రిషన్,సానిటేషన్,ఎడ్యుకేషన్,హెల్త్ పై సమీక్ష సమావేశం ప్రత్యేకంగా నిర్వహించారు.అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన మండలాలలోని వసతి గృహాలలో హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, సానిటేషన్, తదితర అంశాలపై అన్ని వసతి గృహాలను తనిఖీ చేసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా విద్య, ఆరోగ్యం,సానిటేషన్,న్యూట్రిషన్ల పై ప్రత్యేక దృష్టి పెట్టి పిల్లలకు నాణ్యమైన విద్య బోధనలు ఆహారం వసతి తరగతి గదుల నిర్వహణ నూతన విద్యావిధానం ద్వారా సాంకేతిక బోధనల ద్వారా ప్రతి సబ్జెక్టుకు అనుగుణంగా చర్యలు తీసుకొని ముందుకు సాగుతుందని, జిల్లాలోని అన్ని వసతి గృహాల నిర్వహణ ప్రతి ఒక్కరి బాధ్యతగా పని చేయాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలని, ప్రతి విద్యార్థి యొక్క హెల్త్ ప్రొఫైల్ కార్డును రూపొందించి వారి యొక్క ఆరోగ్యం పై,ఆర్ బి ఎస్ కె బృందాల ద్వారా షెడ్యూల్ ప్రకారంవైద్య పరీక్షలు నిర్వహించాలనిఆదేశించారు.అంతేకాకుండా వసతి గృహాలలో నాణ్యమైన కూరగాయలను, ఆహార పదార్థాలను మాత్రమే వినియోగించాలని, రాత్రి వేళలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, పరిసరాలు, డైనింగ్ హాల్, టాయిలెట్స్, స్టడీ రూమ్స్, కిచెన్ షెడ్, పరిసరాలలో నిత్యం సానిటేషన్ నిర్వహించాలని, ప్రత్యేక అధికారులు, తహసిల్దారులు, ఎంపి డి ఒ లు, వారి పరిధిలో ఉన్న అన్ని వసతి గృహాలను నిత్యం తనిఖీ చేయాలని సూచించారు. ఎస్‌సి వెల్ఫేర్ అధికారి రామరావు,బిసి సంక్షేమ అధికారి కేశురామ్, మైనార్టీ సంక్షేమ అధికారి కోట్ల నవీన్ కుమార్ రెడ్డి,సంబంధిత గురుకులాల ప్రిన్సిపల్స్,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ‘మాలల సమస్యపై సిఎం స్పందించాలి’



ప్రజాపక్షం / ఖైరతాబాద్ : ఎస్‌సి వర్గీకరణ చట్టాన్ని తక్షణమే సవరించాలని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జెఎసి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మాల సామాజిక వర్గానికి రిజర్వేషన్ శాతం పెంచాలని, 20లోపు రెండు రోస్టర్ పాయింట్లను కేటాయించాలని కోరింది. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జెఎసి చైర్మన్ మందాల భాస్కర్, గౌరవాధ్యక్షులు చెరుకు రాంచందర్, కన్వీనర్ నల్లాల కనకరాజు మీడియాతో మాట్లాడారు. గత ఐదు నెలలుగా వర్గీకరణతో ఎస్‌సిలోని 58 కులాలకు విద్య, ఉద్యోగ, పదోన్నతుల్లో తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఈ సమస్యపై సిఎం రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించకొంటే కాంగ్రెస్ పార్టీ మాలల పంతంగా భావించి తమ నిరసన యుద్ధాన్ని కొనసాగిస్తామని వారు హెచ్చరించారు. సమావేశంలో జెఎసి నేతలు మంత్రి నరసింహా, బేర బాలకిషన్, రాహుల్‌రావు, పి.వి.స్వామి, రమేశ్, ఆవినాశ్‌వర్మ, దిలీప్ పాల్గొన్నారు.

## మాదాపూర్‌లో అన్నమాచార్య సంగీత ఉత్సవాలు



ప్రజాపక్షం/శేరిలింగంపల్లి: తాళ్ళపాక అన్నమాచార్య సంగాత వైభవాన్ని గుర్తు చేసే లక్ష్యంతో తందాన అన్నమాచార్య అంతర్జాతీయ సంగీత పోటీలు 2025 గ్రాండే ఫినాలే డిసెంబర్ 20 తేది సాయంత్రం మాదాపూర్‌లోని హైటెక్స్ రోడ్డులో గల అన్నమయ్యపురంలో నిర్వహించనున్నట్లు అన్నమాచార్య భావన వాహిని వ్యవస్థాపక అధ్యక్షురాలు పద్మశ్రీ డాక్టర్ శోభారాజు తెలిపారు.గురువారం అన్నమచార్య భావన వాహిని కార్యలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. అన్నమచార్య భావన వాహిని వ్యవస్థాపక అధ్యక్షురాలు పద్మశ్రీ శోభరాజు, ప్రోగ్రామ్ డైరెక్టర్ జోస్న, సలహదారు వెంకట సుబ్బారావు, నందకుమార్‌రెడ్డిపాల్గొన్నారు. అనంతరం శోభరాజు మాట్లాడుతూ అన్నమయ్య రచించిన సంగీత సంపదను ప్రపంచ వ్యాప్తంగా ఉన్న యువత,కళాభిమానులు,విద్వాంసులు, చిన్నారులు పాడడం ఈ పోటీల యొక్క ప్రత్యేకత అన్నారు. డిసెంబర్ 20 న పోటీలు నిర్వహించబడునని తెలిపారు. గేలుపొందిన విజేతలకు అమరావతిలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మార్గదర్శి చిట్ ఫండ్స్ లిమిటెడ్ శైలజా కిరణ్ చేతుల మీదుగా బహుమతులను అందజేస్తామని తెలిపారు. గ్రాండ్ ఫినాలే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చిన్న జీయర్ స్వామి విచ్చేయనున్నారని తెలిపారు.

## లాభాలు చేకూర్చుతామని చేసే ఆఫర్లు నమ్మొద్దు

### సైబరాబాద్ సైబర్ క్రైమ్ డిసిపి బత్తిని సాయి శ్రీ

ప్రజాపక్షం/రంగారెడ్డి: అసాధ్యమైన లాభా లు చేకూర్చుతామని వాగ్దానం చేసే పెట్టుబడి ఆఫర్లను నమ్మవద్దని సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డిసిపి)బత్తిని సాయిశ్రీ అన్నారు. గురువారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో "సైబర్ జాగరూకత దివస్" సందర్భంగా నవంబర్ 6న మెగా సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. సైబర్ క్రైమ్ డిసిపి బత్తిని సాయి శ్రీ మాట్లాడుతూ రిజిస్టర్ కాని లేదా ధృవీకరించని యాప్‌లు,వెబ్ సైట్లుద్వారాపెట్టుబడులు పెట్టవద్దన్నారు. త్వరగా పెట్టుబడి పెట్టకపోతే అవకాశం కోల్పోతారు అనే ఒత్తిడికి లోనవ్వవద్దని తెలిపారు.వాట్సాప్,టెలిగ్రామ్ గ్రూపుల ద్వారా వచ్చే అనుమానాస్పద లింకులు, ఆహ్వానాలనుఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని సైబర్ క్రైమ్ డిసిపి సాయి శ్రీ స్పష్టం చేశారు.ప్రతి ట్రాన్సాక్షన్‌కి వేరే వేరే బ్యాంక్ అకౌంట్ నంబర్లు అడిగితే,అది మోసం అని గుర్తించాలని చెప్పారు. బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్,ఐపిఒ,స్టాక్ ట్రేడింగ్ లలో పెరుగుతున్న సైబర్ మోసాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. మెగా అవగాహన కార్యక్రమంలో భాగంగా సైబరాబాద్ పోలీసులు కమిషనరేట్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో 4.8 లక్షల మందినకి చైతన్యంకల్పించినట్లు పేర్కొన్నారు.240 మంది పోలీసు సిబ్బంది,20 మంది కార్పొరేట్ కంపెనీలకు సంబంధించిన ఎస్‌సిఎస్‌సి వాలంటీర్లు పాల్గొన్నట్లు వివరించారు. అంతేకాకుండా 93.5 రెడ్ ఎఫ్‌ఎం రేడియో,సైబరాబాద్ పోలీసులు మెట్రో రైల్‌తో భాగస్వామ్యం చేసి,రైలు ప్రయాణికులు,ప్రజల్లో ఒక లక్ష మందికి పైగా అవగాహన కల్పించినట్లు వివరించారు. ఇతర వివరాలకు సైబరాబాద్ పోలీసుల అధికారిక సోషల్ మీడియా ఛానళ్లను అనుసరించలని క్రైమ్ డిసిపి సాయి శ్రీ సూచించారు. అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమానికి సైబర్ క్రైమ్స్ రవీందర్ రెడ్డి,ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు,అలాగే ఎస్‌సిఎస్‌సి సీనియర్ మేనేజర్ భాను మూర్తి సహకరించారు.రాజేంద్రనగర్,మాధాపూర్ డిసిపిలు కూడా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నట్లు ఆమె తెలిపారు.

## 6,054 గజాల పార్కుస్థలం కబ్జా



ప్రజాపక్షం/గండిపేట: తిరుమల హిల్స్ లో ప్రజా ప్రయోజనల కొరకు వదలిన పార్కు స్థలం కబ్జాకు గురైందని బిఆర్‌ఎస్ మణికొండ అధ్యక్షుడు సీతారాం దూళిపాళ్ల అన్నారు. మణికొండ మున్సిపల్ పరిధిలోని తిరుమల హిల్స్ కాలనీ ఎచ్.ఎం.డి.ఏ లేఅవుట్ ప్రకారం పార్కు 6054 గజాల స్థలాన్ని గురువారం బిఆర్‌ఎస్ నాయకులు పరిశీలించారు.బిఆర్‌ఎస్ మణికొండ అధ్యక్షుడు సీతారాం దూళిపాళ్ల మాట్లాడుతూ ఈ స్థలం ప్రజా ప్రయోగాల కొరకు వదలడం తో అందులో కొంతభాగం కబ్జాకు గురైంది . స్థానికులు పలు మార్లు మునిసిపల్ అధికారులకు పిర్యాదుచేశారు.అధికారులుస్పందించకపోవడంతో హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతోకమిషనర్ ఆదేశాలతో హైడ్రాధికారులు ఆ స్థలాన్ని కాపాడుతూ దాదాపు 5వేల గజాల స్థలం వరకు ఫన్సింగ్ వేసి బోర్డు నాటారు. కాగా ఇప్పుడు కొంతమంది ముందుకు వచ్చి తాము మాత్రమే స్థలం కాపాడడానికి ప్రయతిస్తున్నట్లు గొప్పలు చెప్పుకోవడం చూస్తుంటే వింతగా ఉన్నదని స్థానికులు అంటున్నారని ఆయన అన్నారు. ప్రజలు లోపలకు రావడానికి వీలు లేదని వచ్చిన ఎడల చట్టరీత్యా చర్యలు తీసుకొంటామని హైడ్రా అధికారులు బోర్డు పెట్టడం ప్రపంచ ఎనిమిదవ వింతగా ఉన్నదని మణికొండ బిఆర్‌ఎస్ నాయకులు అన్నారు. సీతారాం ధూళిపాళ, కుంబగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాథ్ రెడ్డి, అందే లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, రామసుబ్బ రెడ్డి, బొడ్డు శ్రీధర్, షేక్ ఆరిఫ్, ఆరిఫ్ మహమ్మద్, సుమనళిని, బాబురావు, దేవిప్రియ, బి.ఎస్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డ వివాహానికి పుస్తెమెట్టెలు అందజేత

ప్రజాపక్షం/కేశంపేట: పేదింటి ఆడబిడ్డ వివాహానికి పుస్తెమెట్టెలు అందజేశారు. గురువారం కేశంపేట మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొంగరి చెన్నయ్య అనిత దంపతుల కుమార్తె నందిని వివాహం సందర్భంగా బిఆర్‌ఎస్ నేత ప్రేమ్‌కుమార్ గౌడ్ పుస్తెమెట్టెలు కుటుంబ సభ్యులకు అందజేశారు. గ్రామంలో ఎన్నో కుటుంబాలకు తనవంతుగా ఆర్థిక సహాయ సహకారాలు అంధిస్తున్న ప్రేమ్‌కుమార్ గౌడ్‌ను ప్రత్యేకంగా అభినంధించారు. ముందుకు మరెన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నేతలు ఉడిత్యాల వెంకటేష్, కణం కృష్ణయ్య గౌడ్, కణం సత్యం గౌడ్, కాలం ఉదయ్ గౌడ్, బుర్రి సాయిగౌడ్, శివగౌడ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



ప్రజాపక్షం/షాబాద్: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉన్నపుడే అన్నిరంగాల్లో రాణిస్తారని సిఐ కాంతారెడ్డి అన్నారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో, విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలన, సైబర్ నేరాల పై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ కాంతా రెడ్డి మాట్లాడుతూ.. యువతి, యువకులు విద్యార్థి దశ నుండి మంచి క్రమశిక్షణతో క్రీడలు, విద్య పై దృష్టి సాధిస్తే ఉన్నత శిఖరాలు అదిరోహిస్తారాని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివితే భవిష్యత్తు బంగారు బాటలో జీవితం సాగుతుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, తల్లితండ్రులు చెప్పని మాటలను శ్రద్ధగా విని వాటిని పాటిస్తే చాలు మీరు అనుకున్న లక్ష్యం సాదిస్తారని చెప్పారు. గ్రామాల్లో ఎక్కడైన అనుమానితులు కనిపిస్తే వెంటనే ప్రశ్నించి వారి గురించి తెలుసుకోని పోలీసులకు సమాచారం ఇవ్వాలని వివరించారు. విద్యార్థులు రోడ్డు పై మోటర్ సైకిలు నడిపే ముందు ట్రాఫిక్ రూల్స్ తప్పని సరిగా పాటించాలన్నారు. ఎస్సై రమేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సత్యనారాయణ వ్రతాలు

ప్రజాపక్షం/హయత్‌నగర్: మన్సూరాబాద్ శ్రీశ్రీ శ్రీ పోచమ్మ దేవి దేవాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతం జరిగాయి. ఆలయ చైర్మెన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విట్టల్ రెడ్డి స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి ఆలయ ధర్మకర్తలు నాంపెల్లి కృష్ణ శంకరయ్య పాతూరి రాజేందర్ గౌడ్ పోచబోయిన గణేష్ యాదవ్ కొప్పుల ఉపేందర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

## పెండింగ్ స్కాలర్‌షిఫ్, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి

### ఎఐఎస్‌ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్



ప్రజాపక్షం/షాద్‌నగర్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిఫ్‌లను ప్రభుత్వం తక్షణమే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్ డిమాండ్ చేశారు. గురువారం షాద్‌నగర్ ముఖ్యకూడలిలో వివిధ కళాశాలల విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆకాష్‌నాయక్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం అడుతున్న ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చినప్పటిని నుండి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిఫ్‌లు చెల్లించాలని అనేక పర్యాయాలు ప్రభుత్వానికి విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిఫ్‌లు చెల్లించకపోవడంతో వారి చదువులు ముందుకు సాగాలేని దుస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. విద్యారంగాన్ని ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తుందని మండిపడ్డారు. సకాలంలో ఫీజులు కట్టలేక విద్యార్థులు చదువులను మద్యలోనే నిలిపివేయాల్సిన దుస్థితి నెలకొంటుందని వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం సకాలంలో స్పంధించి పెండింగ్‌లో ఉన్న ఫీజులను ప్రభుత్వం చెల్లించేందుకు కృషి చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నేతలు నరేష్ రాథోడ్, అనిల్ నాయక్, పవన్ నాయక్, మనోజ్, గణేష్, మాణిర్యం, మహేష్‌తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రీడలతోనే ప్రపంచ స్థాయి గుర్తింపు

### షాద్‌నగర్ ఎసిపి లక్ష్మీనారాయణ



ప్రజాపక్షం/షాద్‌నగర్: యువత విద్యతోపాటు క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాలని, దాంతో ప్రపంచ స్థాయి గుర్తింపు లభిస్తుందని షాద్‌నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ వివరించారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం బాలికల గురుకుల పాఠశాలలో 11వ జోనల్ స్పోర్ట్స్ మీట్ క్రీడలను షాద్‌నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ, మార్కెట్ కమిటి చైర్ పర్సన్ సులోచనలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసిపి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు ఆసక్తి చూపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను యువత అందిపుచుకోవాలని సూచించారు. విద్యకు ఎంత ప్రాధాన్యత ఇస్తారో అదే తరహాలో క్రీడలకు ఇస్తే దేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు గడించేందుకు అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. 11వ జోనల్ స్పోర్స్ మీట్ క్రీడల ప్రారంభోత్సవం సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు చూపరులను ఎంతగానో అకట్టుకున్నాయి. విశిష్ట అతిధి సులోచన ఒలంఫిక్ దీప ప్రజ్వాలన చేసి క్రీడలను ప్రారంభించారు. ఈ క్రీడల్లో పాల్గొనేందుకు రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల నుండి అధిక సంఖ్యలో విద్యార్థులు తరలివచ్చారు. మౌళిక సౌకర్యాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. షాద్‌నగర్ సిఐ విజయ్‌కుమార్, తహశీల్దార్ నాగయ్య, ఎంపిడివో బన్సీలాల్, ఎస్ఐ సుశీల, ఎంఇవో మనోహర్, పిడి ఉదయ్‌కుమార్ ఉన్నారు.

## పలు పాఠశాలలను సందర్శించిన ఎంఇఒ



**ప్రజాపక్షం/దోమ :** పరిగి నియోజకవర్గంలోని దోమ మండల పరిధిలోని గంజీపల్లి తండా, కొండయ్యపల్లి, బడేంపల్లి పాఠశాలలను ఎంఇఒ వెంకట్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లైబ్రరీని సద్వినియోగం చేసుకునే విధంగా కృషి చేయాలన్నారు. సి–గ్రేడ్ విద్యార్థులను గుర్తించి టిఎల్‌ఎంతో విద్యాభోదన చేపట్టాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, పరిసరాలలో పరిశుభ్రత పాటించాలన్నారు. ఎండిఎం మెసేజ్ ఉపాధ్యాయుల విద్యార్థుల ఎఫ్ఆర్ఎస్ రోజువారీగా పంపాలన్నారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పరిపూర్ణ , శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మణ్‌కు అభినందనలు



**ప్రజాపక్షం/చర్లపల్లి:** మేడ్చల్ జిల్లా పరిపాలన న్యాయమూర్తిగా నూతనంగా నియమితులైన తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. లక్ష్మణ్‌ను మేడ్చల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ అమరేందర్‌రెడ్డి, సెక్రటరీ బాపిరెడ్డి, ట్రెజరర్ కె. మురళిలు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. జిల్లా కోర్టులో వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా కోర్టు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని, జిల్లాలో కొత్తగా న్యాయమూర్తుల నియామకం చేయాలని కోరారు.



## కాంగ్రెస్‌లోకి చేరికలు

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** ఎర్రగడ్డ డివిజన్ కార్యదర్శి అరుణ గారపాటి, వారి మిత్ర బృందం గురువారం టిపిసిసి అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్, సాంస్కృతిక, పురావస్తుశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మహిళలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో సమాన హక్కులు కల్పించేందుకు కృషి చేస్తుందని అన్నారు. రాష్ట్రంలో సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మహిళా సాధికరత దిశగా పలు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు స్వయం సమృద్ధి కలిగించే పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు.

## చెత్త వేస్తే జరిమానా తప్పదు



**ప్రజాపక్షం/దుండిగల్ :** బహిరంగ ప్రదేశాలలో చెత్త వేస్తే జరిమానా తప్పదని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్ నాయక్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని బహదూర్ పల్లిలో రోడ్డుపైన చెత్త వేస్తున్న వారిని గుర్తించి, వారికి 1000 రూపాయలు జరిమానా విధించారు. మున్సిపల్ ప్రజలందరూ బహిరంగ ప్రదేశాల్లో చెత్త వెయ్యవద్దని, అలా చెత్త వేసిన వారిని సిసి కెమెరాలలో గుర్తించి వారికి పెనాల్టీ విధిస్తామని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, తడి చెత్త, పొడి చెత్తగా వేరుచేసి మీ ఇంటి దగ్గరికి వచ్చే స్వచ్ఛ ఆటోలలో మాత్రమే వేయాలని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ పి.సాత్విక్, జవాన్ సురేందర్ పాల్గొన్నారు.

## సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు రవీందర్ సన్మానం



**ప్రజాపక్షం/దుండిగల్ :** మాధవసేవయే మానవ సేవ అని పర్యావరణ ప్రేమికులు కోల రవీందర్ ముదిరాజ్ అన్నారు.అనంతరం మాట్లాడుతూ, మనం నిత్యం చూస్తున్నాం ఎంతోమంది సమయానికి రక్తమందక వాళ్ల విలువైన ప్రాణాలు కోల్పోతున్నారనీ దానిని దృష్టిలో పెట్టుకొని స్థానిక సిఐ మల్లేశం ఒకేసారి 400 మందితో రక్తదానం చేయించడం తెలుగు రాష్ట్రాల పోలీస్ స్టేషన్ చరిత్రలో ఇది మొట్టమొదటిసారి ఇలాంటి ఎన్నో సామాజిక సంక్షేమ కార్యక్రమాలు, సిఐ మల్లేశం చేయడం గర్వకారణమని, పాఠశాలల్లో నాణ్యతలేని ప్లాస్టిక్ వాడకుండా, పర్యావరణ, కాపాడే విధంగా చెత్తను రోడ్లపై వేయకూడదని ఈత, ఒకసాధన, పిల్లలకు చెప్పాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో డిసిఎం రాజు, కనకాచారి, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.



## ట్రాఫిక్ నియమాలు పాటించి ప్రమాదాలను అరికట్టండి

**ప్రజాపక్షం/ఉప్పల్:** ఉప్పల్‌లో పెరిగిపోతున్న రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో ఉప్పల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో ఆటో, ట్రాలీ ఆటో, డిసిఎం వాహన డ్రైవర్లకు ప్రత్యేక ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాహనం నడుపుతున్న సమయంలో తప్పనిసరిగా పాటించాల్సిన రోడ్డు నియమాలు, రాంగ్ రూట్లలో ప్రయాణించడం వల్ల జరిగే ప్రమాదాలు, హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ ఉపయోగం వంటి ముఖ్య అంశాలపై అవగాహన కల్పించబడింది.పోలీసులు ప్రయాణికులకు సురక్షిత రవాణా కోసం ఉదయం 7:30 నుంచి 11:30 వరకు, సాయంత్రం 4:00 నుంచి రాత్రి 10:30 వరకు నో ఎంట్రీ సమయాల్లో పెద్ద వాహనాలు, వాణిజ్య రవాణా వాహనాలు ఆ ప్రాంతాల్లో రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నియమాలను ఉల్లంఘించే వారిపై చలాన్లు విధించడం జరుగుతుందని అన్నారు. ట్రాఫిక్ శాఖ ఈ కార్యక్రమం ద్వారా వాహనదారుల విద్య, సురక్షిత డ్రైవింగ్ అలవాట్ల పెంపుదల కోసం చర్యలు తీసుకుంటోంది, తద్వారా రోడ్డు ప్రమాదాలు తగ్గించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు.

## నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** నర్సింగ్ శిక్షణ పొందుతున్న ఓ విద్యార్థిని భవనంపై నుండి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఉదంతం మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లా తుమ్మలవాడ గ్రామానికి చెందిన పూజిత (21) ఘట్‌కేసర్ సమీపంలోని అవుషాపూర్ గ్రామంలోని అనురాగ్ యూనివర్సిటీ కాలేజి లో బిఎస్సీ నర్సింగ్ మూడవ ఏడాది శిక్షణ పొందుతోంది. గురువారం సాయంత్రం ఆమె కళాశాల భవనం 3వ అంతస్తుపై నుండి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయాన్ని గమనించిన సహచర విద్యార్థి నులు కళాశాల ఉపాధ్యాయులకు తెలియచేసారు. వెంటనే గాయాలకు గురైన విద్యార్థినిని సమీపంలోని నీలిమ ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదని, కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# శాంతియుత జగద్గిరిగుట్టకోసం ప్రతి ఒక్కరం పాటుపడదాం..

### అఖిలపక్ష నాయకుల పిలుపు



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** శాంతియుత జగద్గిరిగుట్ట కోసం ప్రతి ఒక్కరం పాటుపడదామని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం జగద్గిరిగుట్టలో జరిగిన హత్య ఘటన చాలా దారుణమని సభ్య సమాజం భయభ్రాంతులకు గురైందని, ఇలాంటి సంఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చూడాలని కోరుతూ అఖిలపక్ష నాయకులు గురువారం జగద్గిరిగుట్ట సబ్‌ఇన్‌స్పెక్టర్ అప్పారావుకు మెమొరాండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగద్గిరిగుట్ట అంటే మిని తెలంగాణగా పేరొపొంది రాష్ట్రవ్యాప్తంగా దేశవ్యాప్తంగా వలస వచ్చే కార్మికులకు నిలయంగా ఏర్పడి అందరూ కలిసిమెలసి జీవించే ప్రాంతంగా అందరూ భావించేవారని, కానీ నేడు గంజాయి కారణంగా జగద్గిరిగుట్టలో దాడులు, హత్యలు జరుగుతున్నాయని, గత మూడు సంవత్సరాల నుంచి ప్రతీ సంవత్సరం ఏదో ఒక దగ్గర ఇటువంటి హత్యలు జరుగుతున్నాయని అన్నారు. దీనివల్ల జగద్గిరిగుట్టకు చెడ్డపేరు రావడమే కాకుండా ఇక్కడికి కొత్తవాళ్లు రావడానికి ఇబ్బంది పడతారన్నారు.

రాజకీయాలకు అతీతం గా అందరూ కలిసి వచ్చి అన్ని బస్తీలలో బస్తీ పెద్దలు, యువకులు కలిసి గంజాయి నిరోధక కమిటీలు ఏర్పాటు చేసి గంజాయిని బస్తీలలోకి రాకుండా చేయాలని సూచించారు. గంజాయి నిరోధిస్తే ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో జరగవని, మంచి శాంతియుత వాతావరణం ఏర్పడి ప్రజలు సంతోషంగా కలిసిమెలిసి జీవించే పరిస్థితి ఏర్పడుతుందన్నారు.

అనంతరం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ అప్పారావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, సహాయ కార్యదర్శి హరినాథ్‌రావు, నాయకులు సదానంద్, కె.వెంకటేష్, ప్రజానాట్య మండలి అధ్యక్షులు బాబు, మైనార్టీ నాయకులు ఇమామ్, జంబు, భాస్కర్, మల్లేష్, నరసింహ, బాబు, కాంగ్రెస్ నాయకులు సాయి పంతులు, టిఆర్ఎస్ నాయకులు సాజిద్, ఎఐటియుసి, జనసేన నాయకులు సతీష్, మహాజన జర్నలిస్టు ఫోరం రాష్ట్ర నాయకులు డప్పు రామస్వామి, తొండ వెంకట్, ఎంఆర్‌పిఎస్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, జర్నలిస్టు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## పంట పొలాల సమీపంలో డంపింగ్ యార్డు ఏర్పాటు తగదు

### రైతుల ఆందోళన, కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** వ్యవసాయ సారవంతమైన తమ భూముల పక్కన చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని విరమించుకోవాలని జిల్లా రైతు సంఘ ప్రతినిధులు, వ్యవసాయదారులు డిమాండ్ చేసారు. ఈ మేరకు గురువారం వారంతా కల్సి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిని కల్సి వినతిపత్రం సమర్పించారు. అనంతరం రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు అయ్యగారు రవికిరణ్‌రెడ్డి మాట్లాడుతూ శామీర్‌పేట మండలం బొమ్మరాసిపేట గ్రామంలోని రెవెన్యూ సర్వే నంబర్ 322లో చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటు చేసేందుకు మండల రెవెన్యూ అధికారులకు తూంకుంట మున్సిపల్ అధికారులకు ఇటీవలే ప్రతిపాదనలు పంపారన్నారు. చెత్త డంపింగ్ యార్డు ప్రతిపాదించిన స్థల సమీపంలోని బొమ్మరాసిపేట, పొన్నాల గ్రామాల్లో ఉన్న పంట పొలాలన్నీ సారవంతమైన భూములని, ఇక్కడి వ్యవసాయదారులందరూ చిరకాలంగా తమ పొలాల్లో కూరగాయలతో పాటు ఇతర పంటలు వేసుకొని వస్తున్న దిగుబడిని అమ్మి తమ కుటుంబాలను పోషించుకుంటూ వస్తున్నారని తెలిపారు.

ప్రస్తుతం ప్రతిపాదించిన డంపింగ్ యార్డు స్థలం పశువుల మేత కోసం అనాదిగా వినియోగించుకుంటున్న తరుణంలో ఇక్కడ డంపింగ్ యార్డు ఏర్పాటు చేయటమనేది సరైన నిర్ణయం కాదని, దీనివల్ల సమీపంలోని వ్యవసాయ భూములన్నీ కాలుష్యం కారణంగా పాడై దిగుమతులపై తీవ్ర ప్రభావం కనపరుస్తుందని, ఫలితంగా రైతులందరూ తీవ్ర నష్టాలను చవిచూసి కుటుంబ పోషణలు చేసుకోలేని పరిస్థితులు ఎదురవుతాయని తెలిపారు. వ్యవసాయదారులకు నష్టం వాటిల్లే రీతిలో డంపింగ్ యార్డు పంట పొలాల సమీపంలో కాకుండా మరే ఇతర ప్రభుత్వ భూముల్లోనైనా ఏర్పాటు చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పొన్నాల గ్రామ మాజీ ఉప సర్పంచ్ రమేష్‌రెడ్డి, పర్వతాలు, దేవేందర్‌రెడ్డి, నరసింహారెడ్డి, కృష్ణ, గిరి తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా హైదరాబాద్ జిల్లా క్రీడోత్సవాలు ప్రారంభం



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని బిసి గురుకుల పాఠశాల జాయింట్ సెక్రటరి తిరుపతి అన్నారు. గురువారం శామీర్‌పేట మండలంలోని జ్యోతి బా ఫూలే బాలుర గురుకుల పాఠశాలలో హైద్రాబాద్ జిల్లా క్రీడోత్సవాలు అట్టహాసంగా ప్రారంభించారు. ఈ క్రీడల్లో అండర్ 14, అండర్ 17, అండర్ 19 విభాగాలకు చెందిన విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, ఖో ఖో, టెన్నికాయిట్, చెస్, అథ్లెటిక్స్ ఆటలకు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన బిసి గురుకుల పాఠశాల జాయింట్ సెక్రటరి తిరుపతి మాట్లాడుతూ గురుకుల పాఠశాలలోని విద్యార్థులు క్రీడల్లో రాణించాలనే ఉద్దేశ్యంతో హైద్రాబాద్ జిల్లా పరిధిలోని విద్యార్థులకు క్రీడలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ క్రీడల్లో 16 పాఠశాలలకు చెందిన సుమారు 1200 మంది క్రీడాకారులు పాల్గొంటారని చెప్పారు. అనంత రం ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి జెండా ఎగురవేసి క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హైద్రాబాద్ ఆర్‌సిఒ గౌతమ్‌రెడ్డి, స్పోర్ట్స్ ఒఎస్‌డి ఆఫీసర్ శ్రీనివాస్‌గౌడ్, పాఠశాల ప్రిన్సిపల్ రవికుమార్, ఎస్ఐ శశివర్ధన్‌రెడ్డి, ఎటిపి శేఖర్, హెప్సిబా, ఫిజికల్ డైరక్టర్ వెంకట్‌రెడ్డి, సాయికుమార్, సాయిబాబా, స్పోర్ట్స్ కమిటీ మెంబర్స్ నరేష్, టెండుల్కర్, తదితరులు పాల్గొన్నారు.



## బడ్జెట్ పాఠశాల సమస్యలు పరిష్కరించండి

**ప్రజాపక్షం/ఉప్పల్ :** ఉప్పల్ మండలంలో ఉన్న బడ్జెట్ స్టేట్ బోర్డ్ పాఠశాలలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను వివరిస్తూ గురువారం ఉప్పల్ మండలం ట్రస్మా అధ్యక్షుడు విజయేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడ్జెట్ పాఠశాలకు సంబంధించిన ఆస్తి చట్టం వర్గీకరణ, సమాచార హక్కు చట్టం వర్తింపు, విద్యార్థుల భద్రత కోసం పాఠశాల ఆవరణల దగ్గర స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు, ప్లే స్కూల్స్ నిబంధనలు, పర్యవేక్షణ వంటి అంశాలను పరిష్కరించాలని మంత్రులకు సూచించామని ఈ సందర్భంగా వారు స్పందిస్తూ బడ్జెట్ పాఠశాలల సంక్షేమం మరియు స్థిరత్వానికి సాధ్యమైన అన్ని సహాయాలను అందిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, కమిటీ సభ్యులు సందీప్ చందన, రాజు, తిమోతి, కలప చారి, ఇస్మాయిల్, జాన్సన్, సందీప్, శోభ దేవి, నళిని తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే యాదయ్యపై మంత్రి శ్రీధర్‌బాబుకు ఫిర్యాదు



**ప్రజాపక్షం/వికారాబాద్ :** నావబ్‌పేట్ మండల పరిధిలోని చించల్‌పేట్ గ్రామనికి చెందిన మునేగాల నాగరాజు తండ్రి జంగయ్య, 40/2020 డాక్యుమెంట్ ద్వారా నా తల్లి జంగమ్మ పేరున కొనుగోలు చేసిన నాటి నుండి ఇట్టి భూమిలో నేను కబ్జాలో ఉన్న భూమిలోకి కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నాడు . నేను వేసుకున్న కడిలను విరగొట్టి దౌర్జనంగా కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారు. నేను అడ్డు పడితే ఎమ్మెల్యే యాదయ్య, అయన అనుచారులు నాపై దౌర్జానంగా చేస్తు భాయబ్రాంతులకు గురి చేస్తున్నారని,అప్పటినుండి అక్రమంగా నాపెట్ట భూమిలో ఇంటి నిర్మాణంపనులు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని,హైకోర్టు స్టే ఉన్నందున పంచాయతీ కార్యదర్శి అట్టి భూమిలోకి వెళ్లవద్దు అని మణయ్య తెలిపినాడు. గతంలో పోలీసులకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదు కావున, సమస్య పరిష్కారం కోసం జిల్లా మంత్రి ఐటిశాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు ఫిర్యాదు చేయడం జరిగింది. చంపుతామని బేదిరిస్తున్నా ఎమ్మెల్యే, ఎమ్మెల్యే అనుచరులనుండి మాకు ప్రాణహాని వుంది కావున న్యాయం చేయాలని కోరడం జరిగింది అని నాగరాజు తెలిపారు.


## మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్థిక సహాయం



**ప్రజాపక్ష/తాండూరు:** తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి తన ఉదారతను చాటుకున్నారు. బుధవారం తాండూరు మండల పరిధి చంద్రవంచ గేటు వద్ద జరిగిన ఆటో బోల్తా ఘటనలో మృతి చెందిన యువకుడు దత్తు కుటుంబానికి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. తాండూరు మండల పరిధి చంద్రవంచ గ్రామానికి చెందిన చింతలకడి దత్తు ఆటోబోల్తా కొట్టిన ఘటనలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు గురవారం ఆయన తన అనుచరులను గ్రామానికి పంపి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. చంద్రవంచ గ్రామానికి చెందిన శివాజీ యువజన సంఘం సభ్యుల ద్వారా ఈ ఆర్థిక సహాయాన్ని ఆయన యువకుడి కుటుంబానికి అందజేసిన ఆ కుటుంబానికి మనోధైర్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో చిట్టిఘనపూర్ గ్రామానికి చెందిన నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శాంత్‌కుమార్, వెంకటేశం, యువజన సంఘం సభ్యులు ఉన్నారు.

## బస్సు ప్రమాద బాధితులకు బాసటగా ప్రభుత్వ చీఫ్‌విఫ్

### ఒక్కో కుటుంబానికి రూ.20వేల ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/తాండూరు:** చేవెళ్ళ మిర్జాగూడ బస్సు ప్రమాద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం చీఫ్‌విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి ఆపన్నహస్తం అందించారు. మీర్జాగూడ వద్ద మితిమీరి న వేగంతో తాండూరు నుండి హైదరాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసి బస్సును ఢీ కొట్టిన ఘటనలో 19మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం తాండూరులో పర్యటించిన ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి మృతి చెందిన 13మంది బాధిత కుటుంబాలను పరమార్శించడంతో పాటు ఒక్కో కుటుంబానికి రూ.20వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

ఇందిరమ్మ కాలనీలో సొహెల్, ఖలీద్‌తో పాటు రెండు నెలల పాప కుటుంబానికి, వాల్మీకినగర్‌లోని వెంకటమ్మ, విశ్వంభర కాలనీకి చెందిన తబస్సుమ్, గౌతాపూర్‌లోని మస్కాన్ బేగం, పాతతాండూరుకు చెందిన దస్తగిరిబాబలకు చెందిన కుటుంబాలకు ప్రభుత్వం అందజేసిన రూ.7లక్షల ఆర్థిక సహాయం కాకుండానే పట్నం మహేందర్‌రెడ్డి తన సొంతంగా ఒక్కో కుటుంబానికి రూ.20వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు.

అనంతరం ఎల్లయ్యగౌడ్ కుటుంబాన్ని పరామర్శించారు. ఒకేసారి ముగ్గురు ఆడపిల్లలు మృతి చెందడం బాధాకరమని అన్నారు. లక్ష్మినారాయణపూర్ గ్రామానికి చెదిన అఖిలరెడ్డి, హాజీపూర్ గ్రామానికి బందెప్ప, లక్ష్మి కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులను తమ ట్రస్టు ద్వారా అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పారు.

**మానవ తప్పిదనాలతోనే రోడ్డు ప్రమాదాలు**

రోడ్డు ప్రమాదాలు చాలా మాటుకు మానవ తప్పిదాలతోనే జరుగుతున్నాయని ప్రభుత్వ చీప్ విఫ్ పట్నం అన్నారు. ఇంలాంటి ప్రమాదాలనీకప డ్రైవర్ల నిర్లక్ష్యం, మితిమీరిన వేగం, విశ్రాంతి లేకుండా విధులను నిర్వహించడం వల్లనే జరుగుతున్నాయని అన్నారు. లారీల ఓవర్ లోడింగ్ వల్లనే అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, తాను మంత్రిగా ఉన్నప్పుడే ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని తెలిపారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న బ్లాక్‌లను గుర్తించామని తెలిపారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో త్వరలోనే ఈ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఆయన వెంట టిపిసిసి ప్రచార కమిటీ సమన్వయకర్త కరణం పురుషోత్తమ్‌రావు, సీనియ్ నాయకుల సిద్రాల శ్రీనివాస్, గడ్డలి రవిదంర్, బిర్కట్ రఘు, మాజీ కౌన్సిలర్ పరిమళ, అబ్దుల్ కవి, సిద్ధు, తదితరులు ఉన్నారు.

## ఇండ్ల నిర్వాసితులతో కలెక్టర్ ప్రత్యేక సమావేశం



**ప్రజాపక్షం/వికారాబాద్ :** కొడంగల్‌లోని నేషనల్ హైవే 163 మహబూబ్‌నగర్ నుండి చించోళివరకు రోడ్డు వైడెనింగ్ పనులకు సంబంధించిన ఇండ్లు కొల్పోతున్న బాధితులతో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్‌ఓడబ్ల్యు లోగల 107 మందికి కట్టడాలలో 55,114 చదరపు అడుగుల కట్టడాలకు నోటిఫికేషన్ జారీచేయడం జరిగింది కావున ఇందులో బోర్‌వెల్స్ విలువ, చెట్ల విలువలను చూసి నష్ట పరిహారం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందుకు బాధితులు సమ్మతించినందుకు వారికి పదిరోజుల్లో నష్ట పరిహారం అందించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్అండ్‌బి శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, తహసీల్దార్ రామ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఖో ఖో క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా తరపున ఖో ఖో క్రీడల్లో పాల్గొనే పురుషుల క్రీడాకారులకు స్పోర్ట్స్ దుస్తులను పంపిణీ చేశామని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఖో ఖో సంఘం అధ్యక్షురాలు మంజుల అన్నారు. గురువారం తూంకుంట మున్సిపాలిటిలో గత కొన్ని రోజులుగా ఖోఖో క్రీడాకారులు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉమ్మడి రంగారెడ్డి ఖోఖో సంఘం అధ్యక్షురాలు మంజుల మాట్లాడుతూ ఈ నెల 7వ తేది నుంచి 9 వ తేదీ వరకు పెద్దపల్లి జిల్లా కేంద్రంలో 58వ రాష్ట్రస్థాయి సీనియర్ ఖో ఖో పోటీ ల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జట్టు పాల్గొంటుందని చెప్పారు. ఈ శిబిరంలో శిక్షణ తీసుకున్న 18 మంది క్రీడాకారులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. సీనియర్ క్రీడాకారుడు మన్మద్ క్రీడాకారులకు తన సొంత నిధులతో ట్రాక్ సూట్స్, ప్లెయింగ్ కిట్ దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఖో ఖో సంఘం ఉపాధ్యక్షుడు గుర్రం సత్తిరెడ్డి, ప్రధాన కార్యదర్శి తోట జయప్రకాష్, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్, జడ్‌పి హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు వెంకట్ రెడ్డి, యుటిఎఫ్ మండల అధ్యక్షుడు తిరుమలేష్, సీనియర్ క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

# అక్షర్, సుందర్ ధాటికి కుప్పకూలిన ఆస్ట్రేలియా..

## పొట్టి సిరీస్ ఆధిక్యంలో టీమిండియా..!



ఆస్ట్రేలియా పర్యటనలో వన్డే సిరీస్ కోల్పోయిన భారత జట్టు పొట్టి సిరీస్‌లో ముందంజ వేసింది. కీలకమైన నాలుగో టీ20లో సమిష్టి ప్రదర్శనతో ఆతిథ్య జట్టును చిత్తుగా ఓడించింది. శుభ్‌మన్ గిల్ (46) సాధికారిక ఇన్నింగ్స్‌కు అక్షర్ పటేల్(21 నాటౌట్ 2–20) ఆల్‌రౌండ్‌షో తోడవ్వగా ఆసీస్‌ను 48 పరుగుల తేడాతో మట్టికరిపించింది. లక్ష్య ఛేదనలో ఆరంభం నుంచి తడబడిన కంగారూ టీమ్.. సుందర్ (3–3) విజృంభణతో 119కే ఆలౌట య్యింది. భారీ విజయాన్ని అందుకున్న టీమిండియా ఐదు టీ20ల సిరీస్‌లో 2–1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. పేస్, బౌన్సీ పిచ్‌లతో ప్రత్యర్థులను బోల్తా కొట్టించే ఆస్ట్రేలియాను స్పిన్ అస్త్రంతో దెబ్బ కొట్టింది

భారత జట్టు. సిరీస్‌లో కీలకమైన నాలుగో టీ20లో భారీ స్కోర్‌తో కంగారూలకు పరీక్ష పెట్టిన టీమిండియా.. ఆ తర్వాత బంతితో చెలరేగింది. టాపార్డర్ శుభారంభం ఇచ్చినా.. మిడిల్ ఓవర్లలో స్పిన్నర్లు అక్షర్ పటేల్(2–20), వాషింగ్టన్ సుందర్(3–3)లు తిప్పేయగా ఆతిథ్య జట్టు బ్యాటర్లు వరుసగా డకౌట్ చేరారు. పవర్ హిట్టర్ స్టోయినిస్(17)ను సుందర్ ఎల్బీగా వెనక్కి పంపగా ఆసీస్ ఓటమి ఖాయమైంది. భారత్ నిర్దేశించిన 168 పరుగుల భారీ ఛేదనలో ఆస్ట్రేలియాకు ఆదిలోనే అక్షర్ పటేల్ షాకిచ్చాడు. దంచికొడుతున్న డేంజరస్ ఓపెనర్ మాథ్యూ షార్ట్(25)ను ఎల్బీగా వెనక్కి పంపాడు. దాంతో.. పరుగులు వద్ద ఆతిథ్య జట్టు తొలి వికెట్ కోల్పోయింది. మొదట అంపైర్ నాటౌట్ ఇవ్వడంతో రివ్యూ తీసకొని టీమిండియా అతడి వికెట్ సాధించింది. ఆతర్వాత వచ్చిన జోష్ ఇంగ్లిస్(10) బుమ్రా ఓవర్లో రెండు బౌండరీలు బాదాడు. దాంతో.. పవర్ ప్లేలో వికెట్ నష్టానికి ఆసీస్ 48 పరుగులు చేసింది. ఆ తర్వాతి ఓవర్లోనే ఇంగ్లిస్ అక్షర్ పటేల్ ఓవర్లో బౌల్డ్ కాగా.. దూకుడుగా ఆడుతున్న కంగారూ కెప్టెన్ మిచెల్ మార్ష్(30)ను దూబె ఔట్ చేసి పెద్ద బ్రేకిచ్చాడు. అతడి ఓవర్లో పెద్ద షాట్ ఆడిన మార్ష్ బౌండరీ వద్ద అర్ష్‌దీప్ సూపర్ క్యాచ్‌తో పెవిలియన్ చేరాడు. 70కే మూడు వికెట్లు పడిన వేళ టిమ్ డేవిడ్(14), ఫిలిప్పే(10)లు జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. కానీ, వీరిద్దరూ స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగారు. డేంజర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్(2)ను వరుణ్ బౌల్డ్ చేసి మ్యాచ్‌ను టీమిండియా వైపు తిప్పాడు. సుందర్ ఒకే ఓవర్లో స్టోయినిస్(17)ను ఎల్బీగా.. బార్ట్‌లెట్‌ను రిటర్న్ క్యాచ్‌తో వెనక్కి పంపాడు. బుమ్రా ఒక వికెట్ తీయగా.. సుందర్ ఓవర్లో జంపా గిల్ చేతికి చిక్కగా కంగరూ టీమ్ 119కే ఆలౌటయ్యింది. 48 పరుగుల తేడాతో గెలుపొందిన భారత్ సిరీస్‌లో 2–1తో ముందంజ వేసింది.

### గిల్, అక్షర్ పోరాడగా..

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన భారత జట్టు శుభారంభం లభించినా సద్వినియోగం చేసుకోలేదు. మిడిలార్డర్ చేతులెత్తేగా టీమిండియా నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి167 పరుగులు చేసింది. ఓపెనర్ అభిషేక్ శర్మ(28) స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగినా వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్(46) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఫామ్ లేమితో తంటాలు పడుతున్న గిల్.. ఎట్టకేలకు క్రీజులో నిలిచి జట్టును ఆదుకున్నాడు. మిడిలార్డర్‌లో శివం దూబే(22), కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(20)లు ఫర్వాలేదనిపించారు. ఆఖర్లో అక్షర్ పటేల్(21 నాటౌట్) ధనాధన్ ఆడడంతో టీమిండియా పోరాడగలిగే స్కోర్ చేయగలిగింది.

## టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్ వేదిక ఖరారు..

### ఆందోళనలో టీమిండియా ఫ్యాన్స్!

భారత్ వేదికగా వచ్చే ఏడాది ఫిబ్రవరి ,మార్చిలో జరగనున్న పురుషుల టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్ వేదిక ఖరారైనట్లు తెలుస్తోంది. దేశంలోనే అతి పెద్ద గ్రౌండ్ అయిన అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియాన్ని ఫైనల్ వేదికగా ఖరారు చేసినట్లు సమాచారం. మహిళల వన్డే ప్రపంచకప్ 2025 ముగిసిన నేపథ్యంలో టీ20 ప్రపంచకప్ 2026 షెడ్యూల్‌పై ఐసిసికసరత్తులు చేస్తోంది. ఈ క్రమంలోనే ఆతిథ్య దేశం అయిన భారత్ వేదికల ఎంపికపై కార్యచరణను మొదలుపెట్టింది. ఫైనల్‌తో సహా లీగ్ మ్యాచ్‌లకు సంబంధించిన వేదికల వివరాలతో కూడిన డ్రాఫ్ట్ షెడ్యూల్‌ను ఐసిసికి బిసిసిఐ సమర్పించాల్సి ఉంటుంది. ఈ డ్రాఫ్ట్ షెడ్యూల్‌పై సభ్యదేశాల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకొని ఐసిసి మార్పులు చేర్పులు చేస్తుంది. ఆ తర్వాతే షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటిస్తారు. తాజా నివేదికల ప్రకారం ఫిబ్రవరి 6 నుంచి మార్చి 8 వరకు టీ20 ప్రపంచకప్ 2026 జరగనున్నట్లు తెలుస్తోంది. టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీకి అహ్మదాబాద్, కోల్‌కతా, చెన్నై, ముంబై నగరాలను షార్ట్‌లిస్ట్ చేసినట్లు తెలుస్తోంది. ఒక్కో వేదికగా 6 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇరు దేశాల క్రికెట్ బోర్డుల పరస్పర అంగీకారం కారణంగా పాకిస్థాన్ మ్యాచ్‌లు శ్రీలంక వేదికగా జరగనున్నాయి. శ్రీలంకలోని కొలంబో, పల్లెకెలె, గాలే వేదికగా టీ20 ప్రపంచకప్ 2026 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఒక వేళ పాకిస్థాన్ ఫైనల్ చేరితే తుది పోరుకు కొలంబో ఆతిథ్యం ఇవ్వనుంది. అహ్మదాబాద్‌లో ఫైనల్ అంటే భారత అభిమానులు జంకుతున్నారు. గతంలో ఇదే వేదికగా జరిగిన పురుషుల వన్డే ప్రపంచకప్ 2023లో భారత్ ఓడింది. ఈ టోర్నీలో ఓటమెరుగని జట్టుగా ఫైనల్ చేరిన భారత్.. ఫైనల్లో ఆసీస్ చేతిలో మాత్రం ఓటమిపాలైంది. ఈ క్రమంలోనే ఫైనల్‌ను అచ్చొచ్చిన ముంబై వేదికగా నిర్వహించాలని ఫ్యాన్స్ కోరుతున్నారు.



### తెలుగు రాష్ట్రాలకు అన్యాయం..

టీ20 ప్రపంచకప్ వేదికలకు సంబంధించిన షార్ట్ లిస్ట్‌లో తెలుగు రాష్ట్రాలకు చెందిన మైదానాలు లేవు. హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంతో పాటు వైజాగ్‌లోని ఏసీవీడీసీఏ క్రికెట్ స్టేడియాలను ఎంపిక చేయలేదు. దాంతో తెలుగు అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు మైదానాలకు మ్యాచ్‌లు కేటాయించాలని కోరుతున్నారు.

# ఫోకస్

# వైకల్యం ఎవరికి?




నిక్ ఉయిసిచ్ జీవితాన్ని పరిశీలిస్తే, వైకల్యం ఎవరికి అనే ప్రశ్న ఉదయించక మానదు. అన్ని అవయవాలు సక్రమంగా ఉన్నప్పటికీ నిత్యం ఏదో కోల్పోయినట్టు ప్రవర్తించేవారు... ఏమీ సాధించలేమంటూ చేతులెత్తేసేవారు... నిత్యం నైరాశ్యంలో కొట్టుమిట్టాడేవారు ఉయిసిచ్‌ను చూసి మనసు మార్చుకుతీరాలి. లేకపోతే, అవయవాలు ఉన్నప్పటికీ, వైకల్యం ఉన్నవారిగానే వారిని పరిగణించాల్సి ఉంటుంది. ఎందుకంటే, టెట్రాఅమెలియా సిండ్రోమ్ అనే అత్యంత అరుదైన శారీరక లోపంతో జన్మించిన అతనికి, పుట్టుకతోనే కాళ్లూచేతులు లేవు. అతను బతకడం కష్టమని, ఒక వేళ ఊపిరి ఉన్నా, మంచానికే పరిమితమవుతాడని వైద్యులు తేల్చిచెప్పారు. అందుకు తగ్గట్టే ఉయిసిచ్‌కు అనుక్షణం అవమానాలే ఎదురయ్యేవి. అందరూ హేళన చేసేవారే. చివరికి పలు మార్లు ఆత్మహత్య చేసుకోవాలన్నంతా ఒత్తిడికి గురయ్యాడు. కానీ, ఒకరి గురించి తాను బతకడం లేదని, తన గురించి తాను బతకాలని అనుకున్నాడు. చీకటిని చీల్చుకుని వెలుగు వైపు వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. ఆ నిర్ణయమే అతని జీవితాన్ని అద్భుతంగా మార్చింది. నిరంతరం శ్రమించాడు. అసాధ్యంగా కనిపించే ఈత, పెయింటింగ్, స్కైడైవింగ్, డ్రమ్స్ వాయించడం వంటి అనేక కళల్లో ప్రావీణ్యం సంపాదించాడు. అతను నటించిన 'ది బటర్ ఫ్లై సర్కస్' అనే షార్ట్‌ఫిల్మ్ ఎన్నో అంతర్జాతీయ అవార్డులు గెల్చుకుంది. ఉయిసిచ్ ఇప్పుడు మానవ ఆత్మబలానికి ప్రతీకగా నిలుస్తున్నాడు. 70 దేశాలకు పైగా పర్యటించి, 80 లక్షల మందికిపైకి ప్రజలను ఉద్దేశించి ప్రసంగాలు చేశాడు. ప్రపంచ మేటి నాయకులను కలిశాడు. ఐక్య రాజ్య సమితి వేదికపై ప్రసంగించాడు. దివ్యాంగులకు పాఠశాలల్లో ఎదురవుతున్న అవమానాలకు వ్యతిరేకంగా గళం విప్పాడు. లక్షలాది మంది పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తున్నాడు. ఉయిసిచ్ రాసిన 'లైఫ్ విథౌట్ లిమిట్స్', 'అన్‌స్టాపబుల్', 'లవ్ విథౌట్ లిమిట్స్' పుస్తకాలు బెస్ట్‌సెల్లర్లుగా నిలిచాయి. అంతేకాదు అతను నెలకొల్పిన 'లైఫ్ విథౌట్ లింబ్స్' అనే సంస్థ నేడు లక్షలాదిమందికి ప్రేరణనిస్తున్నది. వివాహం చేసుకున్న అతను ఇప్పుడు నలుగురు పిల్లల తండ్రి. ప్రేమ, ఉద్దేశం, లక్ష్యం, సంతృప్తి వంటివి శరీర సామర్థ్యంతో నిర్ణయించడానికి వీల్లేదని ఉయిసిచ్ జీవితం మనకు స్పష్టం చేస్తున్నది. అతనికి చేతులు... కాళ్లే కాదు.. పట్టుదలకు పరిమితులు కూడా లేవు. జీవితం కఠినంగా అనిపించే ప్రతి సారి ఉయిసిచ్ గురించి ఆలోచించండి. నిజమైన వైకల్యం ఎవరిదో స్పష్టమవుతుంది.








# మెదడు కణాలకు వృద్ధాప్యం లేదు!



వయసు పెరిగేకొద్దీ మెదడు పనిచేసే విధానంలో మార్పు వస్తుందని, అందులోని కణాలు ఎక్కువగా చనిపోవడం ప్రారంభించడంతో, జ్ఞాపకశక్తి కోల్పోవడం, ఏవైనా కొత్త విషయాలను త్వరగా నేర్చుకోలేకపోవడం వంటి సమస్యలు కలెత్తుతాయన్న అభిప్రాయం చాలా మందిలో ఉంది. అలాంటి సీనియర్ సిటిజెన్స్ అందరికీ ఇది శుభవార్తే. స్వీడన్‌కు చెందిన శాస్త్రవేత్తలు నిర్వహించిన కొత్త పరిశోధనలను అనుసరించి మన మెదడు ఏ వయసులోనైనా ఎదిగి. పునరుత్పాదనమవుతుందని తేల్చారు. గతంలో అధిక వయసులో కొత్త మెదడు కణాలు (న్యూరాన్లు) ఏర్పడవు అనుకుంటున్నా, తాజాగా జరిగిన అధ్యయనాల్లో తేలిందేమిటంటే, జ్ఞాపకాలు, నూతన విషయాల అధ్యయనానికి కీలకమైన హిప్పోకాంపస్ ప్రాంతంలో పెద్దవయసు వారిలో కూడా కొత్త న్యూరాన్‌లు జన్మిస్తున్నాయి. పెద్దవయసు వారిలోనూ హిప్పోకాంపస్‌లో కొత్త న్యూరాన్లు ఎప్పటికప్పుడు ఉత్పత్తి కావడాన్ని న్యూరోజెనెసిస్‌గా పేర్కొంటారు. దీనివల్ల మెదడు ఎక్కువ కాలం అతి వయసులోనూ నేర్చుకునే సామర్థ్యం, జ్ఞాపకాల నిల్వ, తాజా సమాచారం ప్రాసెసింగ్ చేయగల శక్తిని కొంతమేర నిలుపుకుంటుంది. డీమెన్షియా వంటి స్టేజీల్లోనూ కొత్త మెదడు కణాలు కన్పించడంతో, మెదడులో ప్రతిఫలిక శక్తి, అనుకూల మార్పులు జరిపే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. క్రమం తప్పకుండా వ్యాయామం, నడక, పరెగత్తడం వంటి శారీరక పరిశ్రమ ఉంటే, ఈ కణాల పునరుత్పత్తి వేగాన్ని సంతరించుకుంటుందని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి.ఒమేగా3 ఫ్యాటియాసిడ్లు ఉన్న తాజా ఆహారం, పుష్కలమైన నిద్ర, మానసిక మేకింగ్ (పజిల్స్, భాష చదవడం లేదా కొత్త నైపుణ్యాలు) వంటికి ఉపయోగపడతాయి. దీని ద్వారా మెదడులో కొత్త న్యూయూరాన్‌లు ఏర్పడటం వేగవంతమవుతుంది, మానసిక గుణాలు మెరుగుపడతాయి. జ్ఞాపకశక్తి గణనీయంగా పెరుగుతుంది. మొత్తం మీద 'ది సైన్స్' పత్రిక వ్యాసాన్ని అనుసరించి, న్యూరోజెనెసిస్ ప్రక్రియ ఉండటం వల్ల వయస్సు పెరిగిన తర్వాత కూడా మెదడు పనితీరు గతంలో మాదిరిగానే ఉత్సాహంగానే ఉండడం సాధ్యం. ఈ ప్రక్రియను ఆధారంగా చేసుకుని మేలైన మెడికల్ చికిత్సలు అభివృద్ధి అయ్యే అవకాశాలు ఉన్నాయి. స్థూలంగా చెప్పాలంటే, మెదడు వృద్ధాప్యంలోనూ పూర్తిగా స్తంభించిపోదు. సరైన ఆహారం, వ్యాయామం, మానసిక వ్యాయామం వంటివి పాటిస్తే మెదడు సంపూర్ణ ఆరోగ్యంగా, నూతనాన్ని సృష్టించుకునే శక్తిని కలిగి ఉంటుంది. ఇది జ్ఞాపకశక్తిని, దృష్టి సామర్థ్యాన్ని, మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ఉత్తేజక మార్గం.


# వేతనాలివ్వకపోతే 17న మహాధర్నా

## ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్‌:** ఎన్‌హెచ్‌ఎంలో పనిచేయుచున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రెండు నెలల పెండింగ్ వేతనాలు, ఏడు నెలల పిఆర్‌సి ఏరియర్స్ తక్షణమే చెల్లించాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. గురువారం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా డిఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఆఫీస్ సూపరింటెండెంట్ సఫియోద్దీన్‌కు ఏఐటియుసి ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. భోగే ఉపేందర్ మాట్లాడుతూ గత రెండు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు కుటుంబాన్ని పోషించుకోలేక ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రభుత్వ ఉద్యోగుల లాగానే వీరికి కూడా ప్రతినెల 1వ తేదీన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో అనేక సందర్భాల్లో జిల్లా స్థాయి అధికారులకు వినతులు ఇచ్చినా నేటి వరకు జీతాలు అందలేదని తెలిపారు. సమస్యలు పరిష్కరించని కారణంగా ఈ నెల 17న ఉదయం 11 గంటలకు ఎన్‌హెచ్‌ఎం కమిషనర్ కార్యాలయం హైదరాబాద్ ముందట మహాధర్నా నిర్వహించాలని యూనియన్ నిర్ణయించినట్లు తెలియజేశారు. ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు దివాకర్, ఉపాధ్యక్షులు చిరంజీవి, కోశాధికారి నగేష్, సహాయ కార్యదర్శి రాందాస్, ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది శ్రీదేవి, ప్రకాష్, శ్రీకాంత్, విజయసాగర్, భవాని, సమత తదితరులు పాల్గొన్నారు.

# శత వార్షికోత్సవ శంఖారావం



## సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎస్.విలాస్

**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్ :** నిర్మల్ జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో టీ.గోపి అధ్యక్షతన జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యుడు ఎస్.విలాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నిర్మల్ జిల్లా కార్యదర్శి భూక్యా రమేష్ పాల్గొన్నారు. ఎస్.విలాస్ మాట్లాడుతూ,భారత కమ్యూనిస్టు పార్టీ స్థాపించి డిసెంబర్ 26 నాటికి వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటుందని, శత వార్షికోత్సవాలు విజయవంతం కావడానికి రాష్ట్రంలో నాలుగు ప్రాంతాల నుండి బస్సు జాతాలు బయలుదేరుతాయని తెలిపారు. మొదటి బస్సు జాతా నిర్మల్ జిల్లా బాసర నుండి నవంబర్ 15న బయలుదేరుతుందని, ఎఐకెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ, ఈ.టి. నరసింహ సారథ్యం వహిస్తారని వివరించారు. జిల్లా కౌన్సిల్ సమావేశంలో నూతన జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన భూక్యారమేష్ తమ కార్యకలాపాలు రిపోర్ట్‌ను అందించారు. ఎస్.ఎన్.రెడ్డి మాట్లాడుతూ బాసర నుండి ప్రారంభం కానున్న జాతను విజయవంతం చేయాలని,అదే విధంగా విరివిగా విరాళాలను ఇవ్వాలని కోరారు. పి.ముత్యం(జిల్లా కార్యవర్గ సభ్యులు), ఎస్.కైలాస్ (ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి), పుండలిక్, గంచక్కర్ శివాజీ, వెంకటేష్(జిల్లా కార్యవర్గ సభ్యులు), వెంకట్రాములు, పెంబి, దస్తురాబాద్ లింగన్న తదితరులు పాల్గొన్నారు.

# ఫీ బకాయి ఇవ్వకపోతే ప్రభుత్వాన్ని పాతరేస్తాం

## ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి

## మంత్రి పొన్నం ఇంటి ముట్టడికి యత్నం... నాయకుల అరెస్ట్






**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీః**రాష్ట్రంలోఅధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నత విద్యను రోడ్డున పడేసి విద్యార్థులను చదువులకు దూరం చేసింది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి దుయ్యబట్టారు. ప్రజాపాలనలో నాలుగు రోజుల నుంచి 2వేలకు పైగా ఉన్నత విద్య కళాశాలలు బంద్ చేయగా లక్షలాది మంది విద్యార్థులు ఇంటి వద్ద ఉన్నా ప్రభుత్వం మౌనంగా ఉండడం సిగ్గుచేటని విమర్శించారు. గురువారం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్,స్కాలర్‌షిప్‌బకాయివిడుదల చేయాలని, నాలుగు రోజులుగా కళాశాలల బంద్ ఉన్నా ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని మంత్రి పొన్నం ప్రభాకర్ క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నించారు. కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులకు, నాయకులకు మధ్య తోపులాట జరిగింది. నాయకులను అరెస్టు చేసి టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.మణికంఠరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో నాలుగు రోజుల నుంచి రెండు వేల పైగా ఉన్నత విద్యాకళాశాలలు బంద్ ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. 23 నెలలు గడుస్తున్నా ఫీజు బకాయిలు ఎందుకు విడుదల చేయడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో కళాశాలలు బంద్ చేస్తే దసరా, దీపావళి లోపు రూ.1200 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చిమాట తప్పారని, కేవలం రూ.300 కోట్లు విడుదల చేశారన్నారు. పదివేల కట్ల ఫీజు బకాయిలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి తన వద్ద విద్యాశాఖ ఉన్నప్పటికీ ఫీజు బకాయిలు విడుదల చేయించడంలో వైఫల్యం చెందారని దుయ్యబట్టారు. ఫీజు బకాయిలును విడుదల చేయాలన్నారు. లేని పక్షంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామనిహెచ్చరించారు. ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మచ్చ రమేష్, రేణికుంట్ల ప్రీతం, మంద అనిల్, రామారపు వెంకటేష్, కుర్ర రాకేష్, జిల్లా ఆఫీస్ బేరర్స్ మామిడిపల్లి హేమంత్, కనకం సాగర్, కేశబోయిన రాము యాదవ్, లద్దునూరి విష్ణు, సాయి ఆజాద్, నాయకులు నవదీప్, ఆదిత్య, సోనూ, పవన్, విష్ణు ఉన్నారు.

# ఇంటింటికీ సిపిఐ శతాబ్ది సంబర పిలుపు

## సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు




**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవ ముగింపు సందర్భంగా డిసెంబర్ 26న జరిగే ప్రదర్శన, బహిరంగ సభ కార్యక్రమాల సమాచారాన్ని ఇంటింటికి అందించాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. శతాబ్ది ఉత్సవ ముగింపు సభ ప్రచారాన్ని ఒక ఉద్యమంలా నిర్వహించాలని యావన్మంది పార్టీ సభ్యులు, సానుభూతి పరులను ప్రచార కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం గురువారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో మహ్మద్ సలాం అధ్యక్షతన జరిగింది. హేమంతరావు మాట్లాడుతూ వందేళ్ల కమ్యూనిస్టు పార్టీ చరిత్రను, పోరాటాలను ప్రజల పక్షాన సాధించిన విజయాలను నేటి తరానికి తెలియజేసేందుకు గ్రామ గ్రామాన శతాబ్ది ఉత్సవ ముగింపు సందర్భంగా జరిగే ప్రచార కార్యక్రమాల ద్వారా వివరించాలన్నారు.భారతదేశంలోనేబలమైన కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణం కలిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో శతాబ్ది ఉత్సవ ముగింపు సభ డిసెంబర్ 26న ఖమ్మంలో లక్షలాది మందితో జరగనుందన్నారు. వామపక్ష ఉద్యమ కేంద్రంగా పోరాటాల పురిటిగడ్డగా భాసిల్లిన ఖమ్మం స్వాతంత్ర్యానికి ముందు ఆ తర్వాత సువర్ణక్షర లిఖిత తెలంగాణ పోరాటంలోనూ కీలక భూమిక పోషించిందన్నారు. ఉద్యమ చరితకు అనుగుణంగా డిసెంబర్ మొదటి వారం నుంచి సభలు, సమావేశాలు, సెమినార్లు ఏర్పాటు చేయనున్నట్లు హేమంతరావు తెలిపారు. రచయితలచే కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు హేమంతరావు తెలిపారు. ఖమ్మం జిల్లా నుంచి వందలాది మంది యువతీ, యువకులకు త్వరలో జనసేవాదళ్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయ న తెలిపారు. ఖమ్మం నగరంసహా జిల్లాలోని అన్ని మండలాల్లో బృందాలుగా ఏర్పడి ఇంటింటికి శతాబ్ది ఉత్సవ సందేశాన్ని అందజేయాలని కోరా రు. సిపిఐరాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా,జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాల నివేదికను దండి సురేష్ ప్రవేశపెట్టారు.

# చర్చించకుండా సర్క్యులర్లు ఇస్తే సహించం




## ఎఐటియుసి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్‌:** సింగరేణి యాజమాన్యంగుర్తింపు సంఘంతో చర్చించకుండా, స్ట్రక్చర్ సమావేశాలలో మాట్లాడకుండా సర్క్యులర్లు ఇస్తే ఎట్టి పరిస్థితులలో సహించేది లేదని ఎఐటియుసి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య హెచ్చరించారు. గురువారం శ్రీరాంపూర్‌నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ఇచ్చే సర్క్యులర్లు, లీకేజీల ద్వారా కార్మికులు భయాందోళనలకు గురవుతున్నారని ఆరోపించారు. సింగరేణి వ్యాప్తంగా ఎఐటియుసి ఆధ్వర్యంలో అన్ని గనుల శాఖలలో ధర్నాలు చేసి మెమోరాండం ఇచ్చామని,అలాగే8న అన్నిజిఎం కార్యాలయాల ముట్టడి చేపట్టనున్నట్లు తెలిపారు.ఉపప్రధానకార్యదర్శి వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, సంయుక్త కార్యదర్శి చంద్రమోహన్, ఏరి యాసెక్రెటరీనర్సయ్య, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఫిట్ సెక్రెటరీలు నర్సింగరావు, సదానందం తదితరులు ఉన్నారు.

# ఎక్స్‌గ్రేషియా తక్షణమే చెల్లించాలి

## గీతపనివారల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలకూరి బాబు



**ప్రజాపక్షం/గరిడేపల్లి :** రాష్ట్ర ప్రభుత్వం కల్లుగీత కార్మికుల కుటుంబాలకు ఇవ్వవల్సిన ఎక్స్‌గ్రేషియా రూ.13కోట్లను తక్షణమే విడుదల చేయాలని గీత పనివార్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలకూరి బాబు, జిల్లా కార్యదర్శి కొండ కోటయ్యలు డిమాండ్ చేశారు. గురువారం సంఘం ఆధ్వర్యంలో గరిడేపల్లి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూఇటీవల రాష్టంలో ప్రమాదవశాత్తు చెట్లపై నుంచి పడి మరణించిన, వికలాంగులైన గీత కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా రావల్సిన ఎక్స్‌గ్రేషియా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనగాం సాంబయ్య, సోమగాని రామన్న, మోహన్ రంగా, వినోద్‌వినోద్, పగిడాల సైదులు పాల్గొన్నారు.

# ఎక్స్‌గ్రేషియా బకాయి చెల్లించాలి

## సంఘం రాష్ట్ర కార్యదర్శి బోలగాని సత్యనారాయణ



**ప్రజాపక్షం/మోటకొండూరు:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గీత పనివారలకు చెల్లించాల్సిన రూ.13 కోట్ల ఎక్స్‌గ్రేషియా బకాయి చెల్లించాలని గీత పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి బోలగాని సత్యనారాయణ అన్నారు. గురువారం గీత పనివారల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గాదెగాని మాణిక్యం, మండలఅధ్యక్షులుపల్లెవెంకన్నఆధ్వర్యంలో మండల తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. వినతి పత్రం తహసిల్దార్ నాగదివ్యకు అందించారు.గీతపనివారలసంఘంమండలనాయకులుగడ్డం అంజయ్య, గాజుల ఎల్లయ్య, సీసా ఇస్తారి,వంగాల మల్లేష్,తాళ్లపల్లి వెంకటయ్య, సూదగాని వెంకన్న, గాధగాని నరసింహులు, ఎరకల చంద్రయ్య, పల్లె శీను ఉన్నారు.

# స్థానికం

REGIONAL NEWS

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు : ఆర్‌డిఓ

**ప్రజాపక్షం/చిట్యాల:** ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, అట్టి వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని నల్లగొండ ఆర్‌డిఓ అశోక్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా పెద్దకాపర్తి గ్రామంలోని శ్రీ తిరుమల నాథ ఆలయ భూములుతో పాటు, ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతున్న విషయంపై గ్రామస్థుల ఫిర్యాదు మేరకు ఆర్‌డిఓ శుక్రవారం రోజున క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది రోజులలో ఫిర్యాదుదారులతో పాటు దేవాలయ భూములకు నాలుగు వైపులా ఉన్న రైతులకు నోటీసులు అందజేసి, హద్దురాళ్ళను ఏర్పాటు చేస్తామని, హెచ్చరిక బోర్డులను కూడా పెడతామన్నారు. ఆక్రమణదారులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ భాస్కర్, ఈఓ నాగిరెడ్డి, ఇంఛార్జ్ తహసిల్దార్ విజయ, ఆర్‌ఐ అమరేందర్‌రెడ్డిలతో పాటు గ్రామస్థులు చేకూరి గణేష్ మాదిగ, పొట్లపల్లి చిన్నస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలి

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్

**ప్రజాపక్షం/ కోదాడ:** మొంథా తుఫాన్‌తో నష్టపోయిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్న చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం మునగాల మండల వ్యాపంగా తుఫాన్‌కు దెబ్బతిన్నవరి పంటలను వారు పరిశీలించి మాట్లాడుతూ ఎకరాకు రాష్ట్ర ప్రభుత్వం 10వేలు ప్రకటన మంచిదేకాని ప్రస్తుతం రైతుల పెట్టుబడులు భారీగా పెరిగాయి. వాటిని దృష్టిలో పెట్టుకు కేంద్రం 20వేలు, రాష్ట్రం 20వేలు చెల్లించి రైతంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వలను డిమాండ్ చేశారు. అనేక గ్రామాలలో క్షేత్రస్థాయి పంట నష్టంపై వ్యవసాయాధికారులు అధికారులు పరిశీలించడం లేదని, ఇప్పటికైన వారు నిష్పక్షపాతంగా పరిశీలించి నివేదికలు ప్రభుత్వానికి అందించి రైతులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా ప్రదాన కార్యదర్శి కంబాల శ్రీనివాస్, మునగాల సిపిఐ కార్యదర్శి చిల్లంచర్ల ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.

## రూ.కోటి ఇన్సూరెన్స్ చెక్కు అందజేత




**ప్రజాపక్షం/సూర్యాపేట :** కోదాడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నందు పనిచేస్తూ రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందిన కానిస్టేబుల్ రాంబాబు కుటుంబానికి స్టేట్ బ్యాంక్ పోలీస్ సాలరీ ప్యాకేజీ ద్వారా ఒక కోటి రూపాయల ఎస్‌బిఐ ఇన్సూరెన్స్ చెక్కును జిల్లా ఎస్‌పి కె నరసింహ గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది మరణించిన క్రమంలో పోలీస్ శాలరీ ప్యాకెజి అకౌంట్ ద్వారా రూ. ఒక కోటి రూపాయల ఇన్సూరెన్స్ అందిస్తుందన్నారు. ఈ స్కీం ద్వారా రాంబాబు కుటుంబ సభ్యులకు రూ. కోటి చెక్కును అందజేయడం జరిగిందని తెలిపారు. ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించి క్షేమంగా గమ్యాలకు చేరుకోవాలన్నారు. ఈ స్కీంను రూపొందించిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, ఏఓ మంజు భార్గవి, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు రామచందర్ గౌడ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు అనిల్ కుమార్, మోహన్ కుమార్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

## పెండింగ్ ఫీజులను విడుదల చేయాలి



**ప్రజాపక్షం/చింతపల్లి :** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య( ఏఐఎస్‌ఎఫ్) నల్లగొండ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రలోని ఆదర్శ పాఠశాలలో బుధవారం ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మురళీకృష్ణ హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం పెండింగ్లో ఫీజులు 8 వేల కోట్లకు పైగా ఉన్నాయని, దీని వలన పేద విద్యార్థుల చదువులు మధ్యలోనే ఆపేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలలో ఫిట్నెస్ లేకుండా, ఫస్ట్ ఎయిడ్ బాక్సు,ఫైర్ సేఫ్టీ లేకుండా నడుస్తున్నటువంటి బస్సులను వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి వట్టేపు శివకుమార్, డివిజన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ శంశోద్దీన్, మండల అధ్యక్షుడు శివ పాల్గొన్నారు.

## విషహారం తిని వందకు పైగా గొర్రెలు మృతి

### సుమారు రూ.20 లక్షల నష్టం..రోదిస్తున్న గొర్రెల కాపరులు



**ప్రజాపక్షం/వేములపల్లి:** విష ఆహారం తిని 100కు పైగా గొర్రెలు మృతి చెందిన సంఘటన వేములపల్లిమండల కేంద్రం సమీపంలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే సూర్యాపేట జిల్లా, పెన్‌పహాడ్ మండలం, అన్నారం,అనంతరం, దోసపాడు గ్రామాలకు చెందిన ఉప్పునూతల సైదులు,శ్రీరాముల కోటయ్య,శ్రీరాముల గోపాలు,ఆవుల కోటయ్య, ఆవుల వెంకన్నలు తమ గొర్రెలను గత కొన్ని రోజులుగా మండల కేంద్రం సమీపంలో మేపుతున్నారు. కాగా బుధవారం రాత్రి 80 గొర్రెలు,గురువారం 40 గొర్రెలకు పైగా మృతి చెందినట్లు తెలిపారు. సుమారు 20 లక్షల పైగా నష్టం వాటిల్లినట్టు గొర్రెల కాపరులు వాపోయారు.భారీ సంఖ్యలో గొర్రెలు చనిపోవడంతో గొర్రెల కాపరులు రోధిస్తున్నారు.ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.గొర్రెలు చనిపోవడానికి కారణం విషపు ఆహారం కానీ, విషపు నీరు కానీ అయ్యుండొచ్చు అని స్థానిక పశు వైద్యాధికారి అశోక్ తెలిపారు. పోస్టుమార్టం తర్వాత గొర్రెల మృతికి కారణాలు తెలుస్తాయి అన్నారు.

## సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో కళాజాత

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ (చివ్వెంల) :** తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో యువత సిగిరెట్, గంజాయి, డ్రగ్స్ మత్తుకు బానిసలు కావద్దంటూ చివ్వెంల మండల కేంద్రంలో కళాజాత ప్రదర్శన చేశారు. మత్తుకు బానిసలై తల్లిదండ్రులకు, కుటుంబానికి భారం కావద్దన్నారు. పరిసరాల పరిశుభ్రత, రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు కళారూపాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారథి సభ్యులు పాలకుర్తి శ్రీకాంత్, పల్లెల రాము, పల్లెల లక్ష్మణ్ పాల్గొన్నారు.

# సీరియల్ నంబర్‌తో సంబంధం లేదు

### తేమ నాణ్యత ప్రమాణాలతో ఉన్న ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలి :కలెక్టర్




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** వర్షాలు తగ్గినందున17తేమ వచ్చే విధంగా రైతులు కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యాన్ని బాగా ఆరబెట్టాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి రైతులకు సూచించారు. సరైన తేమశాతం, నాణ్యత ప్రమాణాలతో ఉన్న ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని, ఇందుకుగాను అవసరమైన లారీలు, హమాలీలు, కాంటాలు అన్ని సిద్ధంగా ఉంచుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. గురువారం ఆమె మండలంలోని జి.చెన్నారం, చర్లపల్లి, దండెంపల్లిలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పరిస్థితిని పర్యవేక్షించారు. ముందుగా జి. చెన్నారం వెళ్లిన జిల్లా కలెక్టర్ అక్కడ కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని పరిశీలించారు.ఇప్పటివరకు వచ్చిన ధాన్యం తేమ శాతం అన్ని వివరాలను నిర్వాహకుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. 17 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని తక్షణమే మిల్లులకు పంపించేందుకు ఎక్కువ లారీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సీరియల్ నంబర్‌తో సంబంధం లేకుండా సరైన తేమ వచ్చిన అన్ని కుప్పలను కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని అన్నారు. లారీల సమస్య ,ఇతర ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు.జిల్లా కలెక్టర్ వెంట రెవిన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి పత్యా నాయక్, డిఎస్‌ఓ వెంకటేష్ ,పౌరసరఫరాల డిఎం గోపికృష్ణ, తహసిల్దార్ పరశురామ్ తదితరులు ఉన్నారు.

### ధాన్యం కొనుగోలులో మిల్లర్లు సహకరించాలి

**ప్రజాపక్షం/చిట్యాల :** వానాకాలం సీజన్‌లో పండించిన ధాన్యం కొనుగోలులో రైస్ మిల్లర్లు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని వట్టిమర్తి గ్రామ పరిధిలో ఉన్న సిద్ధార్థ రైస్ మిల్లును శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్షాల కారణంగా గడిచిన వారం, పది రోజులుగా ధాన్యం రైస్ మిల్లులకు రాలేదని, వర్షాలు తగ్గుముఖం పట్టిన కారణంగా మిల్లులకు ధాన్యం చేరుతుందన్నారు. దిగుమతి చేసుకోవడంలో ఆలస్యం చేయకూడదని, ధాన్యం రాగానే వెంటనే దిగుమతి చేసుకోవాలని, దానికి కావల్సిన ఏర్పాట్లను చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లుకు వచ్చిన ధాన్యం వివరాలను పరిశీలించారు. ఇప్పటి వరకు వచ్చిన లారీల వివరాలు, తేమ శాతం, ఇతర నాణ్యత ప్రమాణాల వివరాలను రైస్ మిల్లు యజమాని పోలా పెద్దయ్య ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట రెవిన్యూ శాఖ అదనపు కలెక్టర్ జి శ్రీనివాస్, జిల్లా పౌరసౌరఫర శాఖాధికారి వెంకటేశ్వర్లు, మేనేజర్ గోపికృష్ణ, సహకార శాఖాధికారి పత్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగాన్ని అంతం చేయడంలో ప్రభుత్వాలు విఫలం

### శతాబ్ది ఉత్సవ ముగింపు బహిరంగ సభకు యువత తరలిరావాలి

### ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర




**ప్రజాపక్షం/నల్లగొండ :** ఖమ్మం జిల్లాలో డిసెంబర్ 26న జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)శతాబ్ది ఉత్సవ ముగింపు బహిరంగ సభ విజయవంతం చేయడానికి యువత నడుం బిగించి అధిక సంఖ్యలో ఖమ్మంకు తరలిరావాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ నల్లగొండ జిల్లా కౌన్సిల్ సమావేశం నల్లగొండలోని మక్దూమ్ భవన్ సిపిఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూడిద సురేష్ అధ్యక్షతన జరిగింది.ఈసమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర మాట్లాడుతూ సిపిఐ బహిరంగ సభ విజయవంతం చేయడం కోసం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రచార బస్సు జాతాలు ఈనెల 17 నుంచి కొనసాగుతున్నాయని ఈ జాత ప్రచారం చేయడంలో కీలక పాత్ర పోషించాలన్నారు.నిరుద్యోగాన్ని అంతం చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యారని అన్నారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం వల్ల తీవ్ర ఆందోళన వ్యక్తమవుతుందన్నారు.అటు ప్రభుత్వ రంగం నుండి కొత్త ఉద్యోగ ప్రకటనలు తక్కువగా రావడం,ఇటు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కోల్పోవడం,ఈ రెండు కలసి ఒక కుంభమేళంలాగా నిరుద్యోగాన్ని పెంచిపెడుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు.ప్రభుత్వ నియామక ప్రక్రియలు చాలా నెమ్మదిగా జరగడం, గ్రూప్ పరీక్షల ప్రకటనలు సంవత్సరాల తరబడి అలస్యం అవుతుండగా,నియామకాల్లో తారతమ్యాలు, కోర్టుల స్టేలు, రాజకీయ ప్రతిస్పందనలు మరింత కల్లోలం సృష్టిస్తున్నాయన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి తీర్పారి వేంకటేశ్వర్లు లు మాట్లాడుతూ ఖమ్మంలో నిర్వహిస్తున్న సిపిఐ శాతాబ్ది ఉత్సవ ముగింపు బహిరంగ సభ విజయవంతం చేయడానికి జిల్లాలో జనసేన దళం శిక్షణ శిబిరాలు దేవరకొండ, మునుగోడు నియోజకవర్గం లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఉపాధి కల్పన కేంద్రాలు నామమాత్రంగా వ్యవహరిస్తోందని, ఉపాధికి అవసరమయ్యే నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి ఆయా రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు.ప్రభుత్వ ఆసుపత్రుల సమస్యలపై సర్వేలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ నవీన్ అన్నమల్ల,మల్లేష్,గడ్డం నవీన్,మహేందర్,దశరథ, కట్కూరి లింగస్వామి, నేతల నరేష్,రాజు,గోపగోని ఉదయ్, అక్కలయ్య, బాబు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు 24 గంటలు అందుబాటులో ఉండాలి

### ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు 24 గంటలు అందుబాటులో ఉండాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్ అన్నారు. గురువారం అఖిల భారత యువజన సమైక్య జిల్లా కమిటీ పిలుపుమేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ ఆసుపత్రి ముందు ధర్నా నిర్వహించారు. డాక్టర్ పావనికి మెమోరాండం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదగిరిగుట్ట మున్సిపల్ పరిధిలో 20 వేల జనాభాతో పాటు ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టకు రాష్ట్రం నలుమూలల నుండి భక్తులు వేలాదిగా దర్శనానికి వస్తూ ఉంటారు. ఆరోగ్య సమస్యలు వస్తే భక్తులతో పాటు స్థానికులకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కావున 24 గంటలు డాక్టర్లు, వైద్య సేవలు అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కనీసం అటెండర్ లేకపోవడం చాలా ఇబ్బందికరమని వెంటనే అటెండర్‌ను నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి కంబాల వెంకటేష్, ఏఐవైఎఫ్ నాయకులు అనంతుల నరసింహ, గోపగాని రాజు, గుండు వెంకటేష్, పేరబోయిన మహేష్, సంఘీ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కనీస మౌలిక వసతులు కల్పించాలి



**ప్రజాపక్షం/వలిగొండ :** అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ జిల్లా సమితి పిలుపుమేరకు వలిగొండ, వేములకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సందర్శన అనంతరం వలిగొండ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల వైద్య సదుపాయం ఆసుపత్రిగా ఉన్నది. మెడికల్ డాక్టర్ లేక, ఉన్న ఒకే డాక్టర్ అది కూడా దాదాపు 8 నెలలుగా డిప్యూటేషన్ పైన విధులు కొనసాగిస్తున్నారు. వాచ్మెన్, అటెండర్ లేక ఇబ్బందులు పడవలసి వస్తుంది వెంటనే పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలని అన్నారు. కాంట్రాక్ట్ పద్ధతిలో ఉన్న సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్, ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు మారోజు నరసిమాచారి, సుద్దాల సాయికుమార్, సహాయ కార్యదర్శి గుండెగాని నాగరాజ్, సలిగంజి కృష్ణకుమార్, సోమేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ హాస్టళ్ల ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** బాలల హక్కుల పరిరక్షణ సమితి కమిషన్ సభ్యులు సరిత నార్కట్ పల్లి మండలంలో ఆకస్మికంగా తనిఖీ లు చేపట్టారు. గురువారం తనిఖీ లు చేపట్టిన సందర్భంగా మండలంలోని చెరువుగట్టు గ్రామంలోని గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థుల యొక్క విద్య నైపుణ్యాలను అడిగి తెలుసుకున్నారు. వసతులను పరిశీలించి వసతులను మెరుగుపరచుకోవాలని సూచనలు ఇచ్చారు. భోజనం సదుపాయం తయారు చేసే విధానాలను నిర్వాహకులకు వివరించారు. ముఖ్యంగా విద్యార్థుల విద్యా పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, విద్యార్థులకు రక్షణ విషయంలో రాజీ పడకూడదని. విద్యార్థులు మన ఆధీనంలో ఉన్నంతవరకు పాఠశాల యాజమాన్యాన్ని పూర్తి బాధ్యత అని సూచించారు.

## మాల ధరించి వస్తే పాఠశాలకు రావద్దని కొట్టిందంటూ ధర్నా

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** అయ్యప్ప మాల ధరించి మాల బట్టలతో పాఠశాలకు రావద్దంటూ ప్రిన్సిపాల్ కొట్టిందని ఆరోపిస్తూ పాఠశాల ముందు ధర్నా చేసిన సంఘటన గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఏవిఎం స్కూల్ ఎదుట చోటుచేసుకుంది. బజరంగ్‌దళ్ స్టూడెంట్ యూనియన్, మాల ధరించిన స్వాములు తెలిపిన వివరాల ప్రకారం ఏవిఎం స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న మహేష్ అనే విద్యార్థి మాల ధరించి ఉండడం వల్లే పాఠశాల హెడ్ మాస్టర్ కొట్టిందని ఇది సరైంది కాదన్నారు. గతములో కూడా చేతికి కంకణాలు కట్టుకున్న విద్యార్థులను వేధించినట్లుగా మా దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇట్టి విషయమై పై అధికారులకు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంపై స్కూల్ ప్రిన్సిపాల్ స్పందిస్తూ మా పాఠశాలలో 80 శాతం హిందూ మతస్తులే ఉన్నారని, మేము ఇంత వరకు ఎవరిని కూడా ఏమి అనలేదన్నారు. మహేష్ అనే విద్యార్థి క్రమశిక్షణ రహితంగా అల్లరి చేస్తుండడంతో మందలించినట్లు వివరించారు. మాల ధరించిన స్వాములను పాఠశాలకు రావద్దన్న మాట అవాస్తవమన్నారు.

# ‘డబుల్’ ఇండ్లను లబ్ధిదారులకు కేటాయించాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి




**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి పట్టణం సింగన్నగూడెంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ప్రభుత్వం ఎంపిక చేసిన లబ్ధిదారులకు వెంటనే అప్పజెప్పాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సిపిఐ భువనగిరి పట్టణ ముఖ్య నాయకుల సమావేశం జిల్లా కార్యాలయంలో చింతల మల్లేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి దామోదర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ అనేక పోరాటాలు నిర్వహించి పేదల ప్రక్షాన నిలబడుతుందన్నారు. నేటికీ దేశంలో చెక్కుచెదరని పార్టీ ఉంది అంటే అది సిపిఐ మాత్రమేనని ఆయన అన్నారు. సిపిఐ 100 సంవత్సరాల శతజయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఖమ్మం బహిరంగ సభ జయప్రదం కోసం హైదరాబాద్ నుండి బస్సు జాతా ప్రారంభమై ఈనెల 20, 21న యాదాద్రి భువనగిరి జిల్లాకు విచ్చేయుచున్న సందర్భంగా పార్టీ శ్రేణులు, ప్రజానాట్యమండలి కళాకారులు, స్వాగతం పలికి బహిరంగ సభ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ ఇమ్రాన్, పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గనబోయిన వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, సీనియర్ నాయకులు చొప్పరి సత్తయ్య, కోర సామెల్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమ తరహాలోనే బిసి ఉద్యమం

### బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఈ నెలలో ప్రారంభమయ్యే పార్లమెంటు సమావేశాలు రాజ్యాంగాన్ని సవరించి బిసిలకు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు,బిసి జేఏసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బిసి జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా కూలీ అంబేద్కర్ విగ్రహాల ముందు బిసి రిజర్వేషన్లు పెంచడానికి పార్లమెంటులో రాజ్యాంగ సవరణ చేయాలని ప్రధాన డిమాండ్‌తో బిసి జేఏసీ మౌన దీక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం నలగొండ పట్టణంలోని క్లాక్ టవర్ వద్ద మౌన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ హాజరై మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దాలుగా బిసిల వాటా బిసి లకే రాజ్యాంగబద్ధంగా దక్కాలని రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో పోరాటాలు చేసిన తర్వాత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్‌కు అనుగుణంగా బిసి రిజర్వేషన్లను 42 శాతం పెంచుతూ జీవో నెంబర్ 9 ని విడుదల చేసిందని, ఈ జీవోను వ్యతిరేకిస్తూ రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు కోర్టులను వేదికగా చేసుకుని అడుగడుగునా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిసిల తినే కంచంలో మన్ను పోసి నోటికాడు ముద్దను గుంజుకుంటున్నారని అన్నారు. బిసి రిజర్వేషన్లు పెంచడం ధర్మబద్ధమైనదని, ఎస్‌సి, ఎస్‌టి అగ్ర కులాలకు కూడా జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు జరిగినప్పుడు బిసిలకు మాత్రమే జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు ఎందుకు ఉండవని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో చక్రహరి రామరాజు జిల్లా అధ్యక్షులు దుడుకు లక్ష్మినారాయణ,జిల్లా నాయకులు తండు సైదులు గౌడ్,సుంకరి మల్లేష్ గౌడ్,చీర పంకజ్ యాదవ్,పిల్లి రామరాజు యాదవ్, చిలకరాజు చెన్నయ్య,చొల్లేటి ప్రభాకర్, పన్నాల గోపాల్ రెడ్డి, బకారం శ్రీనివాస్,గోలి సైదులు,వైద్యుల సత్యనారాయణ, కాసోజు విశ్వనాధము,నేలపట్ల సత్యనారాయణ, సోమమల్లన్న, కేసబోయిన శంకర్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

### జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి రోజు దేశ వ్యాప్తంగా అనేక మంది సైబర్ నేరగాళ్ల బారిన పడి మోసాలకు గురవుతున్నారనీ,వారి బారిన పడకుండా ప్రతి ఒక్కరికి అవగాహన కల్గిఉండమే ఉత్తమ మార్గం అని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ అన్నారు. సైబర్ జాగారుకత దివాస్ సందర్భంగా గురువారం నల్లగొండ పట్టణంలోని దీప్తి నర్సింగ్ కళాశాల విద్యార్థినులకు, సైబర్ నేరాలపట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ..ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు ఎక్కువగా సులభంగా మోసపోయేది సైబర్ నేరగాళ్ల ద్వారానే అని అన్నారు. కొత్త కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైన వెంటనే స్పందించి 1930 కి సమాచారం అందించి ఎన్‌సిఆర్‌పి పోర్టల్ సైబర్ క్రైమ్ గౌట్ ఇన్‌లో ఫిర్యాదు చేస్తే సంబంధిత పోలీస్ స్టేషన్ వారు తక్షణమే స్పందించి తద్వారా పోయిన డబ్బులు రికవరీ చేసుకునే అవకాశం ఉందన్నారు. సైబర్ క్రైమ్ డిఎస్‌పి లక్ష్మినారాయణ ఎస్‌బి సిఐ రాము, వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్‌ఐ విష్ణు, కళాశాల విద్యార్థినులు ఉన్నారు.



# స్థానికం
REGIONAL NEWS



మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## ప్రజలంతా వందేమాతర గేయం ఆలపించాలి :ఎంఇఒ



అడ్డాకుల ఎంఇఒ వి.ప్రకాష్

**ప్రజాపక్షం/అడ్డాకుల:** వందేమాతరం గేయం రచించి 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. శుక్రవారం ఉదయం 10 గంటలకు దేశ ప్రజలంతా వందేమాతర గేయం ఆలపించాలని కోరింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలంటూ అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారస్తులు, అందరూ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వి.ప్రకాష్ యంఈఓ అడ్డాకుల కోరారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



**ప్రజాపక్షం/ఆత్మకూరు :** ఆత్మకూరు మండలం తిప్పుడంపల్లి గ్రామ శివారులో ఊక చెట్టు వాగు ఒడ్డున వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు, మండల రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ పరుశరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆత్మకూరు ఎస్సై జయన్న తెలిపారు. ఫిర్యాదులో పేర్కొన్న ప్రకారం చనిపోయిన వ్యక్తి వయస్సు 40 నుండి 45 వరకు ఉండవచ్చని, అతని ఒంటిపై ఆకుపచ్చ టీషర్ట్ కలదని, ఎడమచేతిపై ఇంగ్లీషులో బుజ్జి అని పచ్చబొట్టు కలదని తెలిపారు. మృతదేహాన్ని గుర్తుపట్టిన వారు ఆత్మకూరు ఎస్సైని సంప్రదించాలని తెలిపారు.

## వేధిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు




**ప్రజాపక్షం/ఉట్కూర్:** ఉట్కూర్ మండలంలోని విజయ కాటన్ ఇండస్ట్రీస్ వద్ద పనిచేస్తున్న కూలీలకు నారాయణపేట జిల్లా షీటీమ్ పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీమ్ పోలీసులు బాలరాజు మాట్లాడుతూ పనిచేసే చోట మహిళలను ఎవరైనా వేధింపులు అశ్లీల వ్యాఖ్యలు, బెదిరింపులు, అనుచిత ప్రవర్తన చేసినా భయపడకుండా వెంటనే నారాయణపేట షీటీమ్ 8712670398 పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మహిళల భద్రత, గౌరవం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన షీటీమ్, డయల్ 100,112 నెంబర్లు ఎప్పుడూ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే ఉద్యోగస్త మహిళలు తమ హక్కుల గురించి తెలుసుకోవాలని వేధింపులు ఎదురైతే న్యాయపరంగా రక్షణ పొందే మార్గాలు ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో షీటీమ్ పోలీసులు జ్యోతి, కవిత, ప్రజలు, కూలీలు, యువకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన ఉపన్యాస క్విజ్ పోటీలు



**ప్రజాపక్షం/ కృష్ణ :** కృష్ణ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు టీశాట్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో గురువారం వ్యాసరచన, ఉపన్యాస, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థుల వివరాలను మండల విద్యాధికారి నిజాముద్దీన్ వెల్లడించారు. ఉపన్యాస పోటీలో మొదటి స్థానంలో గుడెబల్లూర్ పాఠశాల విద్యార్థి సింధు, రెండవ స్థానంలో ముడుమాల విద్యార్థి నర్సిములు, వ్యాసరచన పోటీలో మొదటి స్థానంలో కృష్ణ విద్యార్థ గాయత్రి, రెండవ స్థానంలో ముడుమాల విద్యార్థి పై అమృత, క్విజ్ పోటీలో మొదటి స్థానంలో కృష్ణ విద్యార్థులు, రెండవ స్థానంలో గుడెబల్లూర్ విద్యార్థులు గెలుపొందారు. వీరికి ప్రశంసా పత్రంతో పాటు బహుమతుల ప్రదానం చేశారు. మండల స్థాయిలో గెలుపొందిన వారు 10వ తేదీన జిల్లా స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులంతా జిల్లా స్థాయిలో పోటీలలో చక్కని ప్రతిభ కనబరచి కృష్ణ మండలాన్ని మొదటి స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గణేష్ సింగ్, కిశోర్ కుమార్, జి. నరసిమయ్య శెట్టి, జి. నాగరాజు, తిరుమల రావు, దండు శేఖర్, పి. రాఘవేంద్ర, అనిల్ కుమార్, ఖాసీం అలీ, సత్యనారాయణ రెడ్డి, తిమ్మప్ప , అమీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పడమటి అంజన్నకు తులాభారం



**ప్రజాపక్షం/మక్తల్:** మక్తల్ పట్టణంలోని అతిపురాతమైన పడమటి ఆంజనేయస్వామికి బుధవారం రాత్రి ఘనంగా తులాభారం నిర్వహించారు. కార్తీక మాసంలో పౌర్ణమి రోజు గత కొద్ది సంవత్సరాలుగా పడమటి అంజన్నకు భక్తుల చే కానుక రూపంలో ఇచ్చిన వాటితో తులభార కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటామని వంశపార్యం పర్య ధర్మకర్త ప్రాణేశ చారి తెలిపారు. బుధవారం ఆలయ ఆవరణలో చిన్న రథోత్సవం, దిపోత్సవ కార్యక్రమం అనంతరం రామలీల మైదానంలో ఏర్పాటు చేసిన వేదికపై తులాభారం నిర్వహించారు. తులాభారం కోసం ఏర్పాటు చేసిన త్రాసులో ఒకవైపు ఆంజనేయ స్వామి, సీతరామ లక్ష్మ ణ విగ్రహాలను ఉంచి మరోవైపు వివిధ రకాల పళ్లను, పూలు నాణేలతో పటికబెల్లం ఉంచి మరోవైపు వివిధ రకాల పల్లను, పూలు నాణెలతో పటిక బెల్లం ఉంచి స్వామిని తులాభారం వేశారు. ఉడిపి పేజవర్ మఠం వేదపండిత శిక్షకుడు రాఘవేంద్రరావు మంత్రోపచర్జాలు చేస్తుండగా తులాభార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ప్రాణేష్ చారి అరవింద చారి, వివిధ రాజకీయ నాయకులు, భక్తులు, పెద్ద ఎత్తున తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన ఆహారం అందించాలి



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** వీపనగండ్ల మండల విద్యాధికారి నరసింహ గురువారం మండల పరిధిలోని పలు పాఠశాలలను సందర్శించారు. ఆయన ముందుగా కస్తూర్భా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించి, 10వ తరగతి విద్యార్థినులు మరింత శ్రద్ధతో చదవాలని సూచించారు. తరువాత మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పీ.ఎస్ వీపనగండ్ల ఎం.ఆర్సి పాఠశాల, పీ.ఎస్ బీసీ కాలనీ, పీ.ఎస్ ఎస్సీ కాలనీ పాఠశాలలను సందర్శించారు. ఎం.ఆర్సి పాఠశాలలో ఐదవ తరగతి విద్యార్థుల గణిత సామర్థ్యాలను పరిశీలించిన ఎంఈఓ గణితంలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సాయిలత, కల్పన, అరుణలు, ఉపాధ్యాయులు దేవేందర్, సుస్మిత, సి.ఆర్పి వెంకటేష్ పాల్గొన్నారు.

# త్వరితగతిన బ్రిడ్జి నిర్మాణం

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** భలాన్‌పల్లి నుండి పాపగల్ వెళ్లే రోడ్డు బ్రిడ్జిని త్వరితగతిన నిర్మించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం అకాలవర్షాలకుపాడైన రోడ్లను సిపిఐబృందం పర్యవేక్షించారు. తాడూరు మండలంలోని భలాన్‌పల్లి, పాపగల్ వయా నేరేళ్లపల్లి వెళ్లే ప్రధాన రహదారిని గత ప్రభుత్వంలో మంజూరు చేయడం జరిగిందని గుర్తుచేశారు. రాజకీయ కారణాల చేతనో అట్టిరోడ్డు నిర్మాణం జరగకుండా నిలిపివేశారని ఈ ప్రభుత్వమైన మూడుగ్రామాల ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రహదారి నిర్మాణానికి సహకరించి వెంటనే రహదారితోపాటు భలాన్‌పల్లి చెరువు అలుగు కింద బ్రిడ్జిని నిర్మించాలని వారు కోరారు. రెండురోజులుగా కురిసిన అకాలవర్షాలకు భలాన్‌పల్లి చెరువు నిండి అలుగుద్వారా పారేనీరు పాపగల్, నేరేళ్లపల్లికి వెళ్లే ప్రజలకు చాలా ఇబ్బందికరంగా మారిందని మోకాళ్లలోతుపైగా నీరు వెళ్లడంద్వారా ఆదారినుండి రాకపోకలకు చాలా అంతరాయం ఏర్పడిందని కావున తక్షణమే ప్రభుత్వ అధికారులు స్పందించి ఆగ్రామాల ప్రజలయొక్క ఇబ్బందులకు కారణమైన రహదారిని నిర్మించాలని లేనియెడల సిపిఐ ఆధ్వర్యంలో మూడుగ్రామాల ప్రజలను కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బండి లక్ష్మి పతి, శివశంకర్, తాడూరు మండల సిపిఐ నాయకులు వెంకటస్వామి, ఆయా గ్రామాలప్రజలు కిష్టయ్య, రమేష్, తిరుపతి, శివలీల, హన్మంతు, శ్రీనివాస్, వెంకటేష్, భాస్కర్ పాల్గొన్నారు.

# బాల్య వివాహాలపై అవగాహన




### రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ, యాక్సెస్‌టు జస్టిస్ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం

**ప్రజాపక్షం/పెబ్బేరు :** రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ వారి ఆధ్వర్యంలో యాక్సెస్‌టు జస్టిస్ వారు 100 రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం పెబ్బేరు మండల కేంద్రంలోని మహిళ పాలిటెక్నిక్ కళాశాలలో బాల్యవివాహాల గురించి అవగాహన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆర్‌డిఎస్ సమన్వయ కర్త ముబీన్ మాట్లాడుతూ..దేశంలో బాలబాలికలకు కుటుంబంలో ఆర్థిక సమస్యలు కావచ్చు మరి పేదరికం కావచ్చు, ఇతర వేరే ఇంకేమైనా కావచ్చు.. కానీ చిన్న వయసులోనే పెళ్లిల్లు చేయ్యడం ఎక్కువ అవుతున్న పరిణామంలో ఇళ్లలో ఎక్కువ మంది అమ్మాయిలు ఉంటే వారికి పెళ్లిలు తొందరగా చేస్తే కుటుంబ భారం కూడా తగ్గుతుంది అని భావించి తల్లిదండ్రులు చిన్న వయసులోనే గర్భం దాల్చడంతో వారి ఆరోగ్యం మీద చాలా ప్రభావం చూపుతుందని పుట్టబోయే పిల్లలు కూడా చేడు ప్రభావం ఉంటుందని తెలియజేశారు. అలాగే జీవితంలో ఎలాంటి పరిస్థితులు వచ్చిన ఆ సమస్యలకి తట్టుకుని మంచిగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలని సూచించడం జరిగింది. ఒక వేళ ఎవరైనా చట్టవ్యతిరేకంగా బాల్యవివాహాలు చేసినా, బాలకార్మికులుగా పనిలో ఉంచినట్లు అయితే, వెంటనే యాక్సిస్ టు జస్టిస్ వారికి కానీ చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098 లేదా 112 వారికి కానీ, డయల్ 100 పోలీస్ వారికి కానీ, అంగన్వాడీ టీచర్ కి తెలియచెయాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జయచంద్ర, అధ్యాపకులు దశరథ, మాట్లాడుతూ..విద్యార్థులకు జీవననైపుణ్యంతో పాటు, చదువు, సామాజిక అంశాలపై మీద అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం అనిత, చిన్నబాబు, అనిల్, క్రాంతి, తిరుపతి, యశ్వంత్, విద్యార్థి విద్యార్థినులు పాల్గొన్నారు.

# సబ్సిడీ వేరుశనగ విత్తనాల కోసం రైతుల రాస్తారోకో



**ప్రజాపక్షం/పానుగల్ :** సబ్సిడీ వేరుశనగ విత్తనాల కోసం పానుగల్ మండల కేంద్రంలో గురువారం మండలంలోని వివిధ గ్రామాల రైతులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బయ్య యాదవ్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బాల్య నాయక్‌లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూనె ఉత్పత్తులను పెంపొందించేందుకు రైతులకు వంద శాతం సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తుండగా రైతులు అధిక సంఖ్యలో గ్రామాల నుండి రైతు వేదికల దగ్గరికి వస్తున్నారని అధికారులు టోకెన్లు ఇచ్చినప్పటికి రైతులకు సరిపడా వేరుశనగ విత్తనాలను గోదాములో లేకపోవడం రాత్రి వేళలో ట్రాక్టర్ల ద్వారా తరలించడం సరికాదన్నారు. అవసరం ఉన్న రైతులు అందరికీ సబ్సిడి వేరుశనగ విత్తనాలను అందించాలని అన్నారు. నాయకులు సిఫార్సు చేసిన వారికి మాత్రమే వేరుశనగ విత్తనాల బ్యాగులను అధిక సంఖ్యలో తరలించారని రైతులు అన్నారు. రాస్తారోకో దగ్గరికి మండల వ్యవసాయ అధికారి మనిచందర్, హెడ్ కానిస్టేబుల్ యాదగిరి ఆధ్వర్యంలో పోలీసులు రాస్తారోకో వద్దకు వచ్చి రైతులతో మాట్లాడారు. గోదాంలో స్టాక్ అయిపోవడం వల్ల రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేయడం లేదని, ప్రభుత్వం నుండి కోటా వస్తే రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తామని ఏఓ తెలిపారు. రైతులకు సరిపడా విత్తనాలను మంజురూ చెయ్యాలని రైతులు వినతి పత్రాన్ని వ్యవసాయ అధికారికి అందజేశారు. అవసరమున్న రైతులందరికీ వేరుశనగ విత్తనాలను అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

# మహబూబ్‌నగర్ దార్శనికుడు ఎమ్మెల్యే యెన్నం



కాంగ్రెస్ పార్టీ నాయకులు

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ నగర అభివృద్ధికి సమగ్ర దృష్టి భవిష్యత్తు ప్రణాళిక, ప్రజల సమస్యలపై సంపూర్ణ అవగాహన కలిగిన నాయకుడు మన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ నగరానికి శాశ్వత పరిష్కారం చూపించేందుకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి ప్రాజెక్టులకు రూ.824 కోట్ల రూపాయలు మంజూరు చేయించడంలో ముఖ్య పాత్ర పోషించినందుకు, అలాగే నిధులను మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపేందుకు జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి, శ్రీనివాస్ కాలనీ, అక్కడ నుంచి గడియారం చౌరస్తా వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు అంబేద్కర్ చౌరస్తాలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ మహబూబ్‌నగర్ ఇంత పెద్ద స్థాయి అభివృద్ధి ప్రాజెక్టులు రాలేదని, మంత్రులుగా పనిచేసిన నాయకులు కూడా ఈ స్థాయిలో నిధులను మహబూబ్‌నగర్‌కు తీసుకురాలేకపోయారని స్పష్టం చేశారు. డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌ను ప్రతి రంగంలో అగ్రస్థానంలో నిలపాలని యెన్నం కృతనిశ్చయంతో పనిచేస్తున్నారు. ఇది కేవలం అభివృద్ధి ప్రాజెక్టులు కాదు మన నగర భవిష్యత్తుకు పునాది అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్‌పి వెంకటేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద విజయ్‌కుమార్, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇంచార్జి గోనెల శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్‌కుమార్, మారేపల్లి సురేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, డిసిసి ఉపాధ్యక్షులు సత్తూరు చంద్రకుమార్ గౌడ్, నాయకులు సిజే బెనహార్, మైత్రి యాదయ్య, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్ , చెన్నయ్య, యాదిరెడ్డి, వెంకటయ్య, రమేష్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, కోస్గి శివప్రసాద్ రెడ్డి, చర్ల శ్రీనివాసులు, యూత్ కాంగ్రెస్ నాయకులు సల్మాన్, సయ్యద్ ముస్తాక్, సుఫియాన్, రహీన్, హకీం, నర్సింహ, నాగరాజు, ఇమ్రాన్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# దాడికి పాల్పడిన నిందితులపై కఠినచర్యలు

### సంఘటనస్థలాన్ని పరిశీలించిన ఎస్‌పి



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** మారణాయుధాలతో ముగ్గురిపై దాడికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్‌పి గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణపరిధిలోని సంజాపూర్‌లో ఈనెల5వతేది సాయంత్రం దాడి జరిగిన స్థలాన్ని గురువారం జిల్లా ఎస్‌పి గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ స్థానిక డిఎస్‌పి వెంకట్‌రెడ్డి, సీఐ నాగార్జునతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా విలేకరులతో ఎస్‌పి మాట్లాడుతూ సంజాపూర్‌కు చెందిన గుర్రం మల్లేష్‌కు వెల్దండ మండలం చెరుకూరు గ్రామానికి చెందిన శిరీషతో రెండు సంవత్సరాల క్రితం వివాహం జరిగిందని, వివాహం కాక ముందునుంచే మరో వివాహితతో వివాహేతర సంబంధం ఉన్నదని, అట్టి విషయంపై గతంలో కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కావడం జరిగిందని ఎస్‌పి గుర్తుచేశారు. గత మూడునెలల నుండి మల్లేష్ వివాహేతర సంబంధం పెట్టుకొని ఇంటికి రాకపోవడంతో శిరీష, మల్లేష్ ఇరువురి కుటుంబసభ్యులు పెద్దల సమక్షంలో శిరీషకు ఎకరంన్నర భూమిని ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నారు. కాని శిరీషకు 0.30గుంటల భూమి మాత్రమే పట్టా చేయడంతో మిగిలిన 0.30గుంటల భూమి పంచాయతీ తరుచూ కొనసాగుతూ వచ్చిందని తెలిపారు. బుధవారం భూమి విషయంలోనే శిరీష అన్నదమ్ములు శివ, ప్రశాంత్‌లతోపాటు వారి నలుగురు స్నేహితులు మల్లేష్ తండ్రి జంగయ్య, తల్లి అలివేల, తమ్ముడు పరమేష్‌లను గొడ్డళ్లతోపాటు రాడ్‌లు, కర్రలతోదాడులు చేయడంలో వారు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. ఘటన విషయంతెలిసిన వెంటనే డిఎస్‌పి వెంకట్‌రెడ్డి, సీఐ నాగార్జున, ఎస్ఐ మాధవరెడ్డిలు సంఘటనస్థలానికి చేరుకొని దాడికి గురైన జంగయ్య, అలివేల, పరమేష్‌లను కల్వకుర్తి ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యంకోసం హైదరాబాద్ నగరానికి తరలించడం జరిగిందన్నారు. నిందితులలో ఐదుమందిని పట్టుకోవడం జరిగిందని మరొకరు పరారీలో ఉన్నారని తెలిపారు. పరారీలో ఉన్న వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈఘటనపై ఇప్పటికే కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌లో మర్డర్‌కేసు నమోదుకావడం జరిగిందన్నారు. పాల్పడిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్‌పి తెలిపారు.



## మౌలిక సదుపాయాలకు కృషి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి పట్టణపరిధిలోని గచ్చుబావి శివాలయ పరిసర ప్రాంతాలలో పరిశుభ్రత కోనేరు శుద్ధిమౌలిక సదుపాయాలకు కృషిచేస్తానని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. గురువారం శంషాబాద్ అమ్మపల్లి శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న కోనేరు శుద్ధిపనులను ప్రత్యక్షంగా పరిశీలించి అక్కడి నమూనా ఆధారంగా కల్వకుర్తి పట్టణంలోని గచ్చుబావి సమీపంలోగల పురాతన ఎంతో చరిత్ర కలిగిన శివాలయ దేవాలయం కోనేరు శుద్ధిచేసి పునరుద్ధరించడం ద్వారా ఆధ్యాత్మిక పర్యటకాన్నిస్థానిక ప్రజల భక్తిని పెంపొందించే దిశగా ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలయ కమిటిసభ్యులతో కలిసి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐక్యతఫౌండేషన్ సభ్యులు జైపాల్‌రెడ్డి, సాయిక్రాంతి ఉన్నారు.

## విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



**ప్రజాపక్షం/వెల్దండ :** మండల పరిధిలోని కొట్రగ్రామంలో ఉన్న జిల్లాపరిషత్, ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు 120 స్కూల్ బ్యాగులను అందజేశారు. ఈసందర్భంగా ఆసంఘం జిల్లా అధ్యక్షులు కోదండరాములు హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ బాగాకష్టపడి ఉన్నతస్థానానికి ఎదిగి మీరు కూడా భవిష్యత్తులో ఎన్నో సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రేమకుమారి, పాపిశెట్టి సతీష్‌గుప్త, జిల్లాబాధ్యులు దేవేందర్, ఫణికుమార్, విజయ్‌కుమార్, ఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.

## నేరరహిత సమాజమే ధ్యేయంగా అధికారులు, సిబ్బంది సమష్టి కృషి



వనపర్తి ఎస్‌పి రావుల గిరిధర్

**ప్రజాపక్షం/వనపర్తి :** డయల్ 100 సిబ్బంది గ్రామాలను సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధాలను మెరుగుపరచుకోవాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల బాధ్యతయుతంగా వ్యవహరించాలని ఎస్పీ అన్నారు. ప్రతి ఒక్క రికార్డును క్రమం తప్పకుండా ప్రతిరోజు నవీకరించాలి. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పర్యవేక్షించాలి. నేర రహిత సమాజమే ధ్యేయంగా పోలీసు అధికారులు, సిబ్బంది సమిష్టిగా విధులు నిర్వహించి ప్రజలకు సత్వర రోజు వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించి ఆయా పోలీస్ స్టేషన్‌లో నమోదు అయిన గ్రేవ్ కేసులను పరిశీలించారు. ఆయా కేసులలో పోలీస్ అధికారులు ఎలాంటి విచారణ కొనసాగిస్తున్నారో పరిశీలించి పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసులు, దొంగతనం కేసుల ఇన్వెస్టిగేషన్‌లో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు గ్రామ స్థాయిలో సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకుని విపిఓ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. గ్రామాలలో ఎలాంటి సమస్యలు తలెత్తిన తమకు సమాచారం అందే విధంగా సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలన్నారు. ఎలాంటి అత్యవసర సమయంలో నైన డయల్ 100 ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పీ, ఉమామహేశ్వరరావు, వనపర్తి డిఎస్పీ, వెంకటేశ్వరరావు, ఆత్మకూర్ సిఐ, శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, డిసిఆర్బి ఎస్సై, తిరుపతి రెడ్డి, వనపర్తి జిల్లాలోని ఎస్సైలు, డిసిఆర్బి, ఐటి కోర్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మండల భజరంగ్ దళ్ సంయోజక్‌గా వీరేష్ గౌడ్ నియామకం



**ప్రజాపక్షం/ధన్వాడ :** భారతదేశ హిందుత్వ భావజాలాన్ని విశ్వవ్యాప్తంగా విస్తరించే క్రమంలో హిందూ ధార్మిక సంస్థ అయినటివంటి విశ్వహిందూ పరిషత్ యొక్క యువజన విభాగం భజరంగ్ దళ్ తలపెట్టిన త్రిశూల్ దీక్ష కార్యక్రమం ధన్వాడ భజరంగ్ దళ్ కమిటీ ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని భక్త మార్కాండేయ దేవాలయంలో ఏర్పాటు చేయడం జరిగింది. సహస్ర భజరంగ్ దళ్ కార్యకర్తలతో నారాయణపేట జిల్లా నగరంలోనే త్రిశూల్ ర్యాలీ పదసంచాలన్ డిసెంబర్ 2వ వారంలో జరుగుతుంది. ఉమ్మడి పాలమూరు జిల్లా విహెచ్‌పి కార్యదర్శి కన్నా శివకుమార్ అధ్యక్షతన, నారాయణపేట జిల్లా భజరంగ్ దళ్ సంయోజక్ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ యొక్క త్రిశూల్ దీక్ష కార్యక్రమానికి సంబంధించిన సమావేశంలో ధన్వాడ మండల భజరంగ్ దళ్ సంయోజక్‌గా వీరేష్ గౌడ్, బాధ్యతలు స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా వీరేష్ గౌడ్ మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షణకై అహర్నిషలు పాటుపడతానని, నిబద్ధతతో హైందవ ధర్మ జాగృత కార్యక్రమాలు చేపడతానని, సమిష్టి కృషితో హిందూ యువకుల్లో చైతన్యం నింపడమే ధ్యేయమని పేర్కొన్నారు. మిగతా హిందూ పరిరక్షణ సంస్థలైనటువంటి ఆర్ఎస్ఎస్, విహెచ్‌పి, హిందూ వాహిని సభ్యులు వీరేష్ గౌడ్‌ను సన్మానంతో అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో (ఆర్ఎస్ఎస్) సంఘ ఎర్రగుంట్ల బాల్ రాజ్, సిరిగిరి నాగరాజు, హిందూ వాహిని జిల్లా అధ్యక్షులు జుట్ల సుదర్శన్ గౌడ్, భజరంగ్ దళ్ శివ, సంద రవి, చంటి, మొల్క మోళ్ళ బాల్‌రాజ్ గౌడ్ , జుట్ల కళ్యాణ్ గౌడ్, కుమ్మరి సాయిక్రిష్ణ, వల్కె మహేష్, క్రిష్ణ మురళి, సాయి గణేష్, భజరంగ్ దళ్ తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# రీల్

## శ్రీవిష్ణుతో సితార 'ప్రతి యువకుడి కథ'


శ్రీవిష్ణు


ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్టైన్మెంట్స్, శ్రీవిష్ణు కథానాయకుడిగా ప్రొడక్షన్ నెం.39 ని చేయనున్నట్టు ప్రకటించింది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి సన్నీ సంజయ్ రచన , దర్శకత్వం వహిస్తున్నారు.ప్రతి యువకుడి కథ'అనే టైటిల్ ను ఖరారు చేశారు.తనదైన వినోదాత్మక నటనతో ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోవడమే కాకుండా, అన్ని రకాల భావోద్వేగాలను గొప్పగా పలికించగల సామర్థ్యమున్న నటుడిగా పేరుగాంచిన శ్రీ విష్ణు, ఈ సినిమాలో మరో చిరస్మరణీయ పాత్రకు ప్రాణం పోసేందుకు సిద్ధంగా ఉన్నారు. 'అనగనగా'తో ఓటీటీలో అరంగేట్రం చేసి విమర్శకుల ప్రశంసలతో పాటు, ప్రేక్షకుల మెప్పు పొందిన దర్శకుడు సన్నీ సంజయ్, మరో గొప్ప కథతో రాబోతున్నారు. సున్నితమైన భావోద్వేగాలతో నిండిన, రోజువారీ జీవితాన్ని నిర్వచించే నిశ్శబ్ద సంఘర్షణలు, ఆశలు సంతృప్తిలను అన్వేషించే కథతో మరోసారి ప్రేక్షకుల మనసు దోచుకోబోతున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ సినిమాను సమర్పిస్తున్నారు. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభమవుతుంది.

## మఫ్టీ పోలీస్ నవంబర్ 21న రిలీజ్



యాక్షన్ కింగ్ అర్జున్, ఐశ్వర్య రాజేష్ లీడ్ రోల్స్ లో నటిస్తున్న 'మఫ్టీ పోలీస్'. చిత్రాన్ని నిర్మాత జి. అరుల్ కుమార్ సమర్పణలో జి.ఎస్. ఆరట్స్ నిర్మిస్తోంది. నూతన దర్శకుడు దినేష్ లెట్చుమనన్ దర్శకత్వం వహించారు. ఈ సినేనను నవంబర్ 21న సినిమా విడుదల చేస్తున్నట్టు నిర్మాతలు ప్రకటించారు.ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్ థ్రిల్లింగ్ సన్నివేశాలతో అంచనాలను పెంచింది. ఈ చిత్రంలో బిగ్ బాస్ ఫేమ్ అభిరామి, రామ్కుమార్, జి.కె. రెడ్డి, పి.ఎల్. తేనప్పన్, లోగు, వేల రామమూర్తి, తంగదురై, ప్రాంక్స్టర్ రాహుల్, ఓ.ఎ.కె. సుందర్ తదితరులు నటించారు.శరవణన్ అభిమన్యు సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు, ఆశివాగన్ సంగీతం అందిస్తున్నారు. లారెన్స్ కిషోర్ ఎడిటర్. అరుణ్ శంకర్ ఆర్ట్ డైరెక్టర్ ఈ సినిమా తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ ఒకేసారి విడుదల కానుంది.

## వరంగల్‌లో ఘనంగా ఆర్ఎస్ బ్రదర్స్ షోరూం ప్రారంభం



### నగరంలో సందడి చేసిన ప్రముఖ సినీ నటి శ్రీలీల



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** రీటెల్ వ్యాపారంలో బ్రాండ్ ఇమేజ్ సృష్టించిన ఆర్.ఎస్.బ్రదర్స్ దక్షిణ భారతదేశంలో విస్తరణలో భాగంగా గురువారం తెలంగాణలో చారిత్రక వరంగల్ నగరంలో తమ సరికొత్త షోరూమ్ అంగరంగ వైభోగంగా శుభారంభం చేసింది. వ్యాపారరంగంలో ప్రముఖ దార్శనికులైన పి.వెంకటేశ్వర్లు,ఎస్.రాజమౌళి,టి.ప్రసాదరావు, దివంగత పి.సత్యనారాయణ సుదూర దృష్టితో ప్రణాళికాబద్ధంగా నెలకొల్పిన ఆర్.ఎస్.బ్రదర్స్ సంస్థ సంప్రదాయాన్ని, ఆధునిక ఫ్యాషన్లను మేళవించి భారతదేశ వ్యాప్తంగా కొనుగోలుదారులకు చేరువవుతోంది. అందులో భాగంగా వరంగల్‌లోని సరికొత్త షోరూమ్ వైవిధ్య భరితమైన అభిరుచులు కలిగిన నగరవాసుల హృదయాల్ని చూరగొనేలా ప్రారంభించింది. ప్రముఖ సినీతార శ్రీలీల ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతిని వెలిగించి కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా నూతన షోరూమ్‌ను సందర్శించి వరంగల్‌లోని షాపింగ్‌ప్రియులకు ఇది అందమైన కొనుగోలు గమ్యంగా నిలుస్తుందని అన్నారు.ఈ సందర్భంగా ఆర్.ఎస్.బ్రదర్స్ రీటెల్ ఇండియా లిమిటెడ్ సంస్థ డెరెక్టర్లు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ వినియోగదారుల అభిరుచుల వైవిధ్యానికి తగినట్లుగా తమ బ్రాండ్ మరింతగా విస్తరిస్తుందని అన్నారు. మారుతున్న పోకడలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు నాణ్యతతో, సరసమైన ధరలతో కొత్తదనాన్ని అందించగలమని, ఇతర ప్రాంతాలలో కూడా కొత్త షోరూమ్స్ నెలకొల్పనున్నామని చెప్పారు.వరంగల్‌లో షోరూమ్‌లో విక్రయానికి అందుబాటులో ఉంచిన వస్త్ర వైవిధ్యంలో కుటుంబంలోని అన్ని తరాల అభిరుచులను ప్రతిబింబించే వుమెన్స్‌వేర్, మెన్స్‌వేర్, కిడ్స్‌వేర్ రూ.149ల ప్రారంభ ధరతో కొనుగోలుదారులను ఆకట్టుకున్నాయి. కంచిపట్టు చీరలు, డిజైనర్ లెహెంగాలు మొదలుకుని పర్వదినాల్లో ధరించే కుర్తాలు, ఆకర్షణీయమైన వెస్ట్రన్‌వేర్ వంటివి కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నాయి.ఈ సందర్భంగా సంస్థ ఛైర్‌పర్సన్, హోల్ టైం డెరెక్టర్ పొట్టి వెంకటేశ్వర్లు , తమ వరంగల్ షోరూమ్‌లో వెడ్డింగ్ కలెక్షన్స్, పెళ్లి కుమార్తె సంప్రదాయ వస్త్రాలంకరణకు సంబంధించిన సాధికారికమైన పనితనంలోని ప్రత్యేకత గురించి వివరించారు.సంస్థ మేనేజింగ్ డెరెక్టర్ సీర్ణ రాజమౌళి ' భారతదేశ వ్యాప్తంగా కొనుగోలుదారుల అభిరుచుల్ని, తాజా ఫ్యాషన్లను ప్రతిబింబించే వస్త్రశ్రేణి తమ వద్ద లభిస్తోందని చెప్పారు.హోల్ టైం డెరెక్టర్ తిరువీధుల ప్రసాదరావు వరంగల్‌వాసులకు హృదయపూర్వక స్వాగతం పెలుకుతూ వరంగల్‌లోని కొనుగోలుదారులు మెచ్చుకునే వైవిధ్యభరిత వస్త్రశ్రేణి ఆకర్షణీయమైన ఫ్యాషన్లతో, అందుబాటు ధరలలో ఒకే చోట లభిస్తోందని, పండగలు, వివాహాది శుభకార్యాలకు అవసరమైన షాపింగ్ కోసం తమ షోరూమ్‌కి విచ్చేయాల్సిందిగా కోరారు.

## వచ్చే ఏడాది ఏప్రిల్ 3న 'ఫంకీ'

వైవిధ్యమైన చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న కథానాయకుడు విశ్వక్ సేన్, హాస్య చిత్రాలకు చిరునామాగా మారిన దర్శకుడు కె.వి. అనుదీప్ కలయికలో రూపొందుతోన్న చిత్రం 'ఫంకీ'. ఇటీవల విడుదలైన టీజర్‌కు ప్రేక్షకులు ఇచ్చిన అద్భుతమైన స్పందనతో ఉత్సాహంలో ఉన్న 'ఫంకీ' చిత్ర బృందం ఈ సినిమాను 2026 ఏప్రిల్ 3న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. దర్శకుడు కె.వి. అనుదీప్ ఈసారి రెట్టింపు నవ్వులతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించడానికి సిద్ధమవుతున్నారు. 'జాతిరత్నాలు' సినిమాతో సంచలనాలు సృష్టించిన ఆయన.. మరోసారి విభిన్నమైన కథాంశం, కట్టిపడేసే హాస్యంతో ప్రేక్షకుల మనసు దోచుకోనున్నారు. 'ఫంకీ' చిత్రంలో విశ్వక్ సేన్ సినీ దర్శకుడి పాత్రను పోషిస్తుండటం విశేషం. కొత్త లుక్, కొత్త యాటిట్యూడ్‌తో ప్రేక్షకులను సరికొత్తగా అలరించనున్నారు. ఇప్పటికే టీజర్‌లో ఆయన నటన, ఎనర్జీ, కామెడీ టైమింగ్‌కి ప్రశంసల వర్షం కురిసింది. ఈ సినిమాలో కయాదు లోహర్ కథానాయికగా నటిస్తున్నారు. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో సంగీతం ఈ చిత్రానికి అదనపు ఆకర్షణగా నిలవనుంది. అద్భుతమైన గీతాలు, నేపథ్య సంగీతంతో భీమ్స్ సిసిరోలియో ఈ సినిమాకి ప్రధాన బలంగా నిలవనున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్మెంట్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ఎక్కడా రాజీ పడకుండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఎన్నో విజయవంతమైన చిత్రాలను అందించిన నిర్మాణ సంస్థల నుంచి వస్తున్న సినిమా కావడంతో, 'ఫంకీ'పై సహజంగానే అంచనాలు ఎక్కువగా ఉంటాయి. ఆ అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా 'ఫంకీ' చిత్రం ప్రేక్షకులకు నవ్వుల విందుని అందిస్తుందని చిత్ర బృందం హామీ ఇచ్చింది.



## మైథలాజికల్ థ్రిల్లర్ జటాధర


సుధీర్ బాబు

సుధీర్ బాబు, పవర్షాస్ సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్న నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ జటాధర. ఈ చిత్రంలో శిల్పా శిరోద్కర్ కీలక పాత్ర పోషించారు. జటాధర నవంబర్ 7న హిందీ, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో సుధీర్ బాబు మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. చిన్నప్పుడు మనం జానపద, చందమామ కథలు వినుంటాం. బ్యాంకులు లేని సమయంలో ధనాన్ని భూమిలో పాతి ఒక బంధనం వేసి దానికి ఒక పిశాచి కాపలాగా ఉంటుంది' అని ప్రచారంలో ఒక కథ ఉండేది. ఈ కథకు అలాంటి ఒక జానపదం ఆధారం. అలాంటి కథని ప్రజెంట్ టైంలోకి తీసుకొచ్చి ప్రజెంట్ చేశారు. సినిమాలో డిఫరెంట్ ప్లేయర్స్ ఉంటాయి. బాలీవుడ్ స్త్రీ సినిమా వచ్చింది. నిజానికి అది మన సౌత్ ఇండియాలో 'ఓ స్త్రీ రేపు రా' అన్న జానపదం లాంటి కథ. ఘోస్ట్ హంటిం గ్, ఫ్యామిలీ ఎమోషన్, డివోషనల్, శివుడు గురించి కథలు. ఇలా చాలా లేయర్స్ వున్నాయి. ఎందుకనేది సినిమాలో చాలా ఆసక్తికరంగా వుంటుంది. జటాధర అనే టైటిల్ వినగానే ఇది డివైన్ సినిమాని తెలుస్తుంది. ఫైనల్‌గా శివుడు వస్తాడని ముందే అర్థమౌతుంది. అయితే ఆ పాయింట్‌కి రీచ్ అయ్యేవరకూ వుండే జర్నీ చాలా ఎక్సైయిటింగ్‌గా వుంటుంది, ఆడియన్స్‌ని థ్రిల్ చేస్తుంది. టీజర్ ట్రైలర్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. బిజినెస్ కూడా చాలా బాగుంది. జి స్టూడియోస్ లాంటి సంస్థ నిర్మాణంలో వుంది ఏ, బి, సి సెంటర్ అనే తేడా లేకుండా అందరికీ నచ్చే సినిమా. ఈ సినిమా ప్రొడ్యూసర్స్ నార్త్ నుంచి వచ్చారు. తెలుగు సినిమా చేద్దామని వచ్చారు. నాతో, నానితో కలిసి సినిమా చేద్దామని వచ్చారు. ఒక కథ చెప్పారు. నాకు అంతగా నచ్చలేదు. కొన్ని రోజుల తర్వాత మీ దగ్గర ఏదైనా కథ ఉంటే చెప్పమన్నారు. అప్పుడు ఈ కథని మేము డెవలప్ చేస్తున్నాం . అలా చెప్పినప్పుడు వాళ్ళకి నచ్చింది. తర్వాత ప్రొడక్షన్ స్టార్ట్ అయింది. సోనాక్షి చాలా అద్భుతమైన నటి. తన లుక్స్ సౌత్ ఇండియన్ లాగే ఉంటాయి. తన నటన అందరినీ ఆకట్టుకుంటుంది. ధనపిశాచి క్యారెక్టర్‌కి చాలా వాల్యుయాడ్ చేశారు. శిల్ప శోభ అనే పాత్రలో కనిపిస్తారు. అద్భుతంగా నటించారు. చాలా హెవీ పెర్ఫార్మన్స్ ఉన్న క్యారెక్టర్ అది. సినిమా తర్వాత తనకి చాలా మంచి అవకాశాలు వస్తాయి. క్యారెక్టర్ విన్నప్పుడు దాన్ని ఎలా ఎచీవ్ చేయాలనే ఆలోచన వుంటుంది. ఇప్పటివరకూ 20 సినిమాలు చేశాను. ఈ జర్నీలో ఒక క్యారెక్టర్‌ని ఎలా అర్థం చేసుకోవాలి? దాని కోసం ఎలా గ్రౌండ్ వర్క్ చేయాలి దానికంటూ ఒక కథను ఎలా మనలో అనుకోవాలి? ఇలా వర్క్ చేసినప్పుడు క్యారెక్టర్‌ను చేయడం ఈజీ గానే ఉంటుంది. నిజానికి ఇందులో శివుడు కనిపించే ఒక ఎపిసోడ్ ఉంది. అక్కడ కృష్ణ గారిని చూపించాలని అనుకున్నాం. కానీ వీఎఫ్ఎక్స్‌కి ఎక్కువ సమయం కుదరలేదు. ఇందులో కృష్ణ గారు గాని మహేష్ గారు గాని కనిపించడం వుండదు. బాలీవుడ్‌లో బాఘీ తర్వాత కొన్ని అవకాశాలు వచ్చాయి. అయితే నా ఫోకస్ ఎప్పుడు తెలుగు సినిమా పైనే ఉంది. రాహుల్ రవీంద్రన్‌తో ఒక సినిమా వుంది. బాహుబలి లాంటి సినిమా. అలాగే పుల్లెల గోపీచంద్ బయోపిక్ కూడా చేయాలి.

అరుణాచల ప్రస్తావన కూడా వుంది. సినిమాలో మన పురాణాల్లో ఉన్న కొన్ని కథలు సొల్యూషన్‌గా ఈ కథను చేయడం జరిగింది. ఈ సినిమా చేయడానికి ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ నాకు చాలా ఎక్సైట్ చేసింది. యాక్షన్, ఫ్యామిలీ, మైథలాజి అన్ని ఎమోషన్స్ కుదిరిన సినిమా ఇది. అయితే తనకి దెయ్యాలు వున్నాయంటే నమ్మకం వుండదు. దేవుని పై నమ్మకం వుంటుంది. సైన్స్‌ని నమ్ముతాను. అలా

# జర్నలిస్టుల సమస్యలు విస్మరిస్తే ఆందోళన తప్పదు

### ప్రభుత్వానికి టియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యవర్గ సమావేశం హెచ్చరిక




**ప్రజాపక్షం / హైదరాబాద్ :** గత ప్రభుత్వం మాదిరిగానే, ప్రస్తుత ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను విస్మరిస్తే రాష్ట్ర వ్యాపితంగా ఆందోళన బాట పట్టడం తప్పదని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) ప్రభుత్వాన్ని హెచ్చరించింది. గురువారం శంకర్ పల్లి మండలం పొద్దటూరులోని ప్రగతి రిసార్ట్స్‌లో టియుడబ్ల్యుజె యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ అధ్యక్షతన రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. జర్నలిస్టుల ప్రధాన సమస్యలు, వాటి పరిష్కారంలో ప్రభుత్వం నుండి జరుగుతున్న జాప్యంపై కార్యవర్గం సుదీర్ఘంగా చర్చించింది. ప్రస్తుత ప్రభుత్వం అధికారాన్ని చేపట్టి దాదాపు రెండేళ్లు కావస్తున్నా, జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించక పోవడంపై సమావేశం తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. గత ప్రభుత్వం ఇలాంటి వైఖరినే అనుసరిస్తే గల్లీ నుండి ఢిల్లీ దాక తమ సంఘం లెక్కలేనన్ని ఉద్యమాలు చేపట్టిన విషయాన్ని సమావేశం గుర్తుచేసింది. జర్నలిస్టుల ప్రధాన సమస్యలైన ఇంటి స్థలాలు, ఆరోగ్య పథకం, అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియను వీలైనంత తొందరగా పరిష్కరించాలని సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ అంశంపై ఐజెయు జాతీయ అధ్యక్షులు, మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఇప్పటికే ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్చించినట్లు ఆయన స్పష్టం చేశారు. ఫిబ్రవరి మాసం మొదటి వారంలో విజయవాడలో జరగనున్న ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) జాతీయ ప్లీనరీని విజయవంతం చేసేందుకు సన్నాహాలు ప్రారంభమైనట్లు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అయితే ఈ ప్లీనరీని పురస్కరించుకుని జనవరి మాసంలో రాష్ట్రంలో హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ కేంద్రాల్లో సదస్సులు నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. మహాసభలు పెండింగులో ఉన్న జిల్లాల్లో జనవరి మొదటి వారంలోపు వాటిని పూర్తి చేయాలని సమావేశం నిర్ణయించింది.యూనియన్ నియమించిన ఆయా సబ్ కమిటీల సమావేశాలను త్వరలో నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఇటీవల జరిగిన హైదరాబాద్ ప్రెస్ క్లబ్ కార్యవర్గ ఎన్నికల్లో ఫ్రెండ్స్ ప్యానెల్ కు మద్దతు పలికి, ప్యానెల్ గెలుపు కోసం శ్రమించిన రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీతో పాటు ఇతర నాయకులను కార్యవర్గం అభినందించింది. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి టియుడబ్ల్యుజె సమావేశం శుభాకాంక్షలు తెలిపింది. గత కార్యవర్గ సమావేశం తర్వాత యూనియన్ చేపట్టిన వివిధ కార్యక్రమాలపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ నివేదిక సమర్పించారు. ఇటీవలి కాలంలో రాష్ట్రంలో అకాల మరణం చెందిన 16మంది జర్నలిస్టులకు సమావేశం నివాళులు అర్పించింది. మృతికి సంతాప సూచికగా మౌనం పాటించింది. రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశానికి ఆతిథ్యం ఇచ్చిన రంగారెడ్డి జిల్లా శాఖకు సమావేశం కృతజ్ఞతలు తెలియజేసింది. సమావేశంలో ఐజెయు జాతీయ మాజీ అధ్యక్షులు, స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, ఎం.ఏ. మాజీద్, జాతీయ కార్యదర్శి వై. నరేందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యుడు కె. సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. సంపత్ కుమార్, గాడిపల్లి మధు గౌడ్, కార్యదర్శులు కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, జి. మధు గౌడ్, కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి, రాష్ట్ర చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూసుఫ్ బాబు, అశోక్ లతో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, 30 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

## హాజరుకండి(మొదటి పేజీ తరువాయి)

గురువారం ఈ విషయాన్ని వెల్లడించారు. అతను సాక్ష్యం చెప్పిన తర్వాత ఏజెన్సీ గతసారిలాగే మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద అతని వాంగ్మూల్మాన్ని నమోదు చేస్తుందని ఆ వర్గాలు తెలిపాయి. ఈ ఇడి దర్యాప్తు ఆగస్టు 21న సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) నమోదు చేసిన ఎఫ్ఐఆర్ నుండి వచ్చింది. ఈ కేసులో ముంబయిలోని అంబానీ ప్రాంగణం సహా సిబిఐ సోదాలు కూడా నిర్వహించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ఫిర్యాదు ఆధారంగా ముంబయ్‌కి చెందిన రిలయన్స్ కమ్యునికేషన్స్(ఆర్‌కామ్)డైరెక్టర్ అనిల్ డి.అంబానీ, గుర్తుతెలియని ప్రభుత్వ ఉద్యోగులు, గుర్తు తెలియని ఇతరులపై స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎఫ్ఐఆర్ క్రిమినల్ కేసు నమోదు చేసింది. సిబిఐ ఎఫ్ఐఆర్‌లో జత చేయబడిన ఎస్‌బిఐ ఫిర్యాదు ప్రకారం ఆ కంపెనీ వివిధ రుణదాతలకు 40,000వేల కోట్లకు పైగా బకాయిపడిందని, 2018గణాంకాల ప్రకారం పబ్లిక్ సెక్టార్ బ్యాంక్ మాత్రమే 2929.05 కోట్ల నష్టాన్ని ఎదుర్కొంటోంది. ఆగస్టులో సిబిఐ చర్య తర్వాత అంబానీకి చెందిన ఒక ప్రతినిధి మాట్లాడుతూ ఎస్‌బిఐ దాఖలు చేసిన ఫిర్యాదు 10 సంవత్సరాల కాలం నాటితో కేసులతో ముడిపడిఉందని, ఆ సమయంలో అంబానీ కంపెనీకి నాన్ ఎగ్జిక్యూటివ్‌గా ఉన్నారని, రోజువారీ నిర్ణయంలో ఎటువంటి ప్రమేయం లేదని చెప్పారు. ప్రత్యేకంగా గమనించదగ్గ విషయమేమిటంటే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇప్పటికే తన సొంత ఉత్తర్వు ద్వారా ఐదుగురు నాన్‌ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లకు వ్యతిరేకంగా చర్యలను ఉపసంహరించుకుంది.అయినప్పటికీ దీనిని ఏమాత్రం పట్టించుకోకుండా రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీని ప్రత్యేకంగా ఎంపికచేశారని ఆ ప్రకటన పేర్కొంది. జూలైలో అంబానీ గ్రూప్ కంపెనీల ప్రస్తుత, మాజీ ఎగ్జిక్యూటివ్‌లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు నిర్వహించింది. ఆగస్టు మొదటి వారంలో అతనిని (అంబానీ)ప్రశ్నించి స్టేట్‌మెంట్ నమోదు చేసింది. రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఆర్‌ఇన్‌ఫ్రా) సహా అనిల్ అంబానీకి చెందిన బహుళ గ్రూప్ కంపెనీల రూ.17,000 కోట్ల అవకతవకలు సామూహిక రుణ మళ్లింపునకు సంబంధించినవిగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రాథమిక దర్యాప్తులో తేలింది. 2017 మరియు 2019మధ్య కాలంలో అంబానీ గ్రూప్‌కంపెనీలకు వైఇఎస్ (ఎస్) బాంక్ దాదాపు రూ.3,000 కోట్ల అక్రమ రుణ మళ్లింపు ఆరోపణ సహా ఇందులో ఉంది. అంబానీ గ్రూప్ కంపెనీలపై దర్యాప్తులో భాగంగా ఏజెన్సీ ఇటీవల రూ.7,500 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసింది. వీటిలో ముంబైలోని పాలీహిల్ ప్రాంతంలో వ్యాపారవేత్త నివాసం, ఢిల్లీలో ఉన్న రిలయన్స్ సెంటర్ భూమి సహా వీటిలో ఉన్నాయి.

## ఓట్ల చోరీకి యత్నం
(మొదటి పేజీ తరువాయి)

'జంగిల్ రాజ్' గురించి మాట్లాడుతున్నారు... కానీ, ఢిల్లీలో 'జంగిల్ రాజ్' విధించినది ప్రధాని, అమిత్ షా అని, మొత్తం దేశం, ఇది ఇడి, సిబిఐ,ఐటి, ద్వేషం, నిరుద్యోగ పాలనను చవి చూస్తోందని, ఇదే నిజమైన ఆటవిక రాజ్యమని రాహుల్ మండిపడ్డారు. ప్రధాని బిహార్, దేశంలో ప్రజలలో ద్వేషాన్ని వ్యాపింపజేస్తున్నారన్నారు. ఆయన కులం, మతం ఆధారంగా ప్రజలలో చీలిక సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. ఇక ప్రస్తుత బిహార్ ముఖ్యమంత్రి రాష్ట్ర యువతను కార్మికులుగా మారుస్తున్నారని ఆరోపించారు.

### ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచేందుకు ప్రభుత్వంతో ఇసి కుమ్మక్కు : ప్రియాంకాగాంధీ

ఎన్నికల కమిషన్ (ఇసి) మన రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య హక్కులను బలహీనపరిచేందుకు ప్రభుత్వంతో కుమ్మక్కవుతోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వాద్రా ఆరోపించారు. హర్యానాలో చేసినట్లుగానే బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఎన్‌డిఎ దొంగతనం చేయడానికి సిద్ధమవుతోందన్నారు. గురవారం ఆమె సీతామరి, తూర్పు చంపారన్ జిల్లాల్లో జరిగిన బహిరంగ ర్యాలీలనుద్దేశించి ప్రసంగించారు. హర్యానాలో మొత్తం ఎన్నికలను దొంగిలించినట్లే, బిహార్‌లో 65 లక్షల ఓట్లను జాబితా నుండి తొలగించడం ద్వారా ఇక్కడ కూడా అదే పని చేయడానికి సిద్ధమవుతున్నారన్నారు. అయితే రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటం ప్రజల కోసం, సత్యం కోసమని, మహాత్మా గాంధీ ఒకప్పుడు పోరాడిన అదే యుద్ధంలో ఆయన పోరాడుతున్నారని ప్రియాంకాగాంధీ ఉద్ఘాటించారు. దేశానికి ద్రోహం చేస్తున్న వారిని ప్రజలు ఎప్పటికీ మరచిపోరన్నారు. ఎన్నికల కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, వివేక్ జోషి, ఎస్. ఎస్. సంధు భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. పదవీ విరమణ తర్వాత సౌకర్యవంతమైన జీవితాన్ని గడుపుతారని అనుకుంటే, అది జరగని పని అని ఆమె జోస్యం చెప్పారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయంగా జరిగితే ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని గద్దె దించి పేదలు, మహిళలు, యువత కోసం పనిచేసే ప్రభుత్వం వస్తుందన్నారు. దేశాభివృద్ధికి అపారమైన కృషి చేసిన బిహార్ ప్రజల పట్ల ఎన్‌డిఎ ప్రభుత్వానికి గౌరవం లేదని ఆమె ఆరోపించారు. అభివృద్ధి కోసం కాకుండా మతం పేరుతో ఎన్‌డిఎకు ఓటు వేయమని బిజెపి నాయకులు ప్రజలను కోరుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో పేలవమైన మౌలిక సదుపాయాల పట్ల ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, గత మూడు సంవత్సరాలలో 27 వంతెనలు కూలిపోయాయని మండిపడ్డారు. మోదీ భారత్‌కు ప్రధాని అని, పోస్టర్లపై ప్రతిపక్ష నాయకుల చిత్రాల పరిమాణాన్ని కొలవడం తప్ప ఆయనకు వేరే పని లేదా? అని ప్రశ్నించారు.









Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com